ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 172 పేజీలు: 10+4 వెల: 6.50

లాఠీఛార్జిలో గాయపడిన విద్యార్థిని పరిస్థితి విషమం
సిక్కింలో సొరంగ ప్రమాదం.. 10 మంది దుర్మరణం
5

## కొనసాగిన 'కాక్రోచ్' నిరసనలు

**న్యూఢిల్లీ, జూలై 21:** నీట్ వైఫల్యాలు, సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జికి నిరసనగా ఆ పార్టీ ఛీఫ్ అభిజిత్ దీప్కేఆధ్వర్యంలో మంగళవారంకూడా జంతర్‌మంతర్‌వద్ద నిరసనలు కొనసాగాయి. కాగా లాఠిఛార్జిలో గాయపడిన విద్యార్థులందరినీ స్థానిక రామ్‌మనోహర్‌లోహియా ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకవిద్యార్థినిని ఐసియులో ఉంచి చికిత్స జరుపుతున్నారు. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిజెపి కేడర్‌నున ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ ఎంపిలు రాహుల్, ప్రియాంక, కెసి వేణుగోపాల్; జైరామ్‌రమేష్ వంటి వారు పరామర్శించి ధైర్యం చెప్పారు.





ఢిల్లీలో మంగళవారం రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకుని తరలిస్తున్న పోలీసులు

# ప్రధాని నివాసం ముట్టడి
# ఉద్రిక్తం

- రాహుల్ నాయకత్వంలో పెద్దఎత్తున ధర్నా
- పాల్గొన్న ఖర్గే, ప్రియాంక, వేణుగోపాల్ తదితరులు
- విద్యార్థులపై చర్యకు ప్రధాని జవాబు చెప్పాలని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- పోలీసుల లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగం
- రాహుల్ సహా నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తోపులాటలో రాహుల్ ముక్కునుంచి కారిన రక్తం

**న్యూఢిల్లీ, జూలై 21:** నీట్‌పరీక్షల్లో లోపాలపై కాక్రోచ్‌జనతాపార్టీచేపట్టిన సంసద్‌ర్యాలీలో సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జిని తీవ్రంగా నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ ర్యాలీ తీసింది. మంగళవారం జరిగిన >>2



## రాహుల్‌గాంధీతో కేంద్ర మంత్రి జితేందర్ చర్చలు

# 24 గంటలూ ఎత్తిపోసుడే..

### దేవాదుల 9 పంపింగ్ యూనిట్లు ప్రారంభం
### 22 రిజర్వాయర్లను నింపడమే లక్ష్యం
### తాగు, సాగునీటి భద్రత కల్పిస్తున్నాం: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,జులై 21,ప్రభాతవార్త:** దేవాదుల ఎత్తిపోతల పథకం తొమ్మిది పంపింగ్ యూనిట్లు మంగళవారం రాత్రి నుంచి పూర్తి సామర్థ్యంతో పనిచేయడం ప్రారంభించాయనీ, ఇక 24 గంటలు నీటిని ఎత్తిపోస్తుంటాయనీ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన చిట్ చాట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేవాదుల ప్రాజెక్టుపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు పంపులను గరిష్ట సామర్థ్యంతో నడపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయ విమర్శలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం మానేసి, కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను ఎందుకు మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్ అమలు చేశారో >>2



మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి ఉత్తమ్



మంగళవారం దుద్యాల ఎడ్యుకేషనల్ హబ్ పనులను పరిశీలిస్తున్న సిఎం రేవంత్

# శరవేగంతో 'కొడంగల్' ఎత్తిపోతలకు మరిన్ని పంపులు

### త్వరగా ప్రాజెక్టు పూర్తి చేయాలని సిఎం రేవంత్ ఆదేశం
### పనితీరు బాగాలేని కలెక్టర్లను బదలీ చేస్తాం
### రెండేళ్లలో ఔటర్ రింగ్ రోడ్లు పూర్తి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి/ దుద్యాల, జూలై 21, ప్రభాతవార్త:** మక్తల్–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ పనుల పురోగతిపై అధికారులు తప్పుడు సమాచారం ఇస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మంగళవారం సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వచ్చిన సీఎం దుద్యాల ఎడ్యుకేషన్ హబ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

నీటిపారుదల శాఖ పనుల పురోగతిపై సమీక్షించిన సీఎం.. నారాయణపేట మీదుగా కొడంగల్‌కు వచ్చే కృష్ణా జలాల ఎత్తిపోతల పథకానికి అదనపు పంపుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సివిల్ పనులకు వెంటనే వర్క్ ఆర్డర్లు ఇచ్చి పనులు పూర్తి చేయించాలని స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు కోసం సరిపడా భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెప్టెంబరులోగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మూడవ సంపు ఏర్పాటుకు అవసరమైన పనుల పురోగతిపై క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాలని ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశ పనులు డిసెంబరు వరకు పూర్తి చేస్తామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. వచ్చే యేడాది డిసెంబరు నాటికి పనులు ఎంతమేరకు పూర్తి చేస్తారో అధికారులు సమగ్ర నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు.

అవుటర్ రింగ్ రోడ్ల పనులు కూడా త్వరగా చేపట్టాలని రేవంత్ స్పష్టం చేశారు. ప్రతిపాదనలో ఉన్న వికారాబాద్, నారాయణపేట అవుటర్ రింగ్‌రోడ్ల పనులపైదృష్టి సారించాలని సూచించారు. ఈ పనులను పూర్తి చేసి 2028 పంద్రాగస్టుకల్లా ప్రజలకుఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అవుటర్ రింగ్ రోడ్ల పనుల కోసం అన్ని శాఖల అధికారుల మధ్య సమన్వయంతో డిజైన్లు రూపొందించాలని సూచించారు. సెప్టెంబరు నాటికల్లా భూసేకరణ పూర్తి చేస్తామని కలెక్టర్లు సమ్మతించగా సకాలంలో టెండర్ ప్రక్రియ కూడా చేపట్టాలని సీఎం ఆదేశించారు. అవుటర్ రోడ్ల నిర్మాణానికి రైతులను ఒప్పించి భూసేకరణ చేపట్టాలని సూచించారు. కాన్సెంట్ అవార్డుకు వెళితే రైతులకు ఎక్కువ పరిహారం వస్తుందని, దీనిపై వారిలో అవగాహన కల్పించాలన్నారు. రైతులకు న్యాయం జరిగేందుకు కలెక్టర్లు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన వివరించారు.

కొడంగల్ సెగ్మెంట్‌లో చేపట్టనున్న బహుళ విధ పారిశ్రామిక పార్కుల పురోగతిపై సీఎం సమీక్షించారు. దుద్యాల ఇండస్ట్రియల్ పార్కు, వాటికి అవసరమైన భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. టీజీఐఐసీ చురుకైన పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. పనితీరు బాగాలేని కలెక్టర్లను అక్టోబరులో బదిలీ చేస్తామని హెచ్చరించారు. క్షేత్రస్థాయి వెళ్లాల్సిందేనని కలెక్టర్లకు స్పష్టం చేశారు. కొడంగల్‌లో ఎడ్యుకేషనల్ హబ్, ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయడం వల్ల హైదరాబాద్ నుంచి కూడా విద్యార్థులు ఇక్కడికి వస్తారని ఆశాభావంవ్యక్తం చేశారు. రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని సీఎంవివరించారు. సమావేశంలో ఐఏఎస్ సీనియర్‌అధికారులు దానకిషోర్, సందీప్‌కుమార్ సుల్తానియా, వికాస్‌రాజ్, విపి గౌతమ్, టీకే శ్రీదేవి, క్రిస్టినా జెడ్‌చోంగ్తు, సీఎం ప్రిన్సిపల్‌సెక్రటరీ శ్రీధర్, శశాంక, కలెక్టర్ దీపక్ తివారీ, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, బీ.మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సేమ్‌సీన్ పార్లమెంటులో మళ్లీ గందరగోళం

### నీట్, అయోధ్యపై చర్చకు విపక్షాల పట్టు
### ఉభయ సభలు నేటికి వాయిదా


**న్యూఢిల్లీ,జులై 21:** పార్లమెంటు రెండో రోజు సమావేశాల్లోను ఉభయసభలు నిరసనలతో దద్దరిల్లాయి. నీట్‌లోపాలపై ఆందోళనచేస్తున్న బొద్దింకలపార్టీ కార్యకర్తలు, ఆందోలన కారులపై లాఠీఛార్జి, అమానుషంపై చర్చించాలని, అయోధ్య విరాళాలచోరీకేసును చర్చకు పెట్టాలని కోరుతూ విపక్షాలు పట్టుబట్టాయి. ఉభయ సభలుప్రారంభం నుంచే విపక్ష నేతలు బ్యానర్లు చేతబట్టి నిరసనలతో మారుమోగించారు. విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాచేయాలని, ప్రధానిమోడీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఇతర పక్షాలనాయకులు డిమాండ్ >>2



## సీతక్కపై క్రిమినల్ కేసు కొట్టివేత

### కింది కోర్టు ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై21:** మంత్రి, ములుగు ఎమ్మెల్యే దనసరి అనసూయ (సీతక్క)కు హైకోర్టులో ఊరట లభించింది. కొవిడ్19 మహమ్మారి సమయంలో ఆరోగ్యశ్రీ పథకం పరిధిలో కరోనా చికిత్సను చేర్చాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన నిరాహార దీక్షకు సంబంధించి ఆమెపై నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజన మంగళవారం విచారించి, ఎక్సైజ్ కేసుల ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తీసుకున్న చర్యలను, కేసులో జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పు వెలువరించారు. దీంతో సీసీ నెం. 308/2024లో సీతక్కపై కొనసాగుతున్న క్రిమినల్ విచారణకు ముగింపు >>2



## మరో అల్పపీడనం

### పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 23, 24 తేదీల్లో ఉత్తర ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలకు ఆనుకుని మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాబోయే రోజుల్లో తెలంగాణతో పాటు, దేశంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర కోస్తాంధ్ర పరిసర ప్రాంతాలపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో >>2

## 'నీట్' దోషులను కఠినంగా శిక్షిస్తాం

ఎన్‌డిఎ సమావేశంలో ప్రధాని మోడీ 2



## మరీ.. ఇంత నియంతృత్వమా?

### రాహుల్, ప్రియాంక తదితర విపక్ష నేతల అరెస్టు అప్రజాస్వామికం
### కేంద్ర చర్యలకు నిరసనగా నేడు చలో రాజ్‌భవన్: పిసిసి చీఫ్ మహేష్

**హైదరాబాద్,జులై 21,ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపి ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చెసి జైల్ కు తరలించడం దుర్మార్గమనీ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. మోడీ ఇంటి ముందు ధర్నా చేసి నీట్ పరీక్ష పేపర్ లీక్ ల విషయంలో పార్లమెంట్ లో సమగ్ర చేయాలన్న రాహుల్ గాంధీ డిమాండ్ కు బిజెపి సర్కార్ భయపడిందనీ, అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడి విచారణ చేయమంటే, చర్చలు చేయమంటే బిజెపి తోక ముడుస్తుందనీ ఆరోపించారు. రాహుల్ గాంధీ తోపాటు ప్రతిపక్ష నేతలు అరెస్ట్ లకు నిరసనగా బుధవారం చలో రాజ్ భవన్ నిరసన కార్యక్రమం చేపడుతున్నామనీ మహేష్ కుమార్ గౌడ్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు చలో రాజ్ భవన్ (లోక్ భవన్) కు కాంగ్రెస్ శ్రేణులు నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున తరలిరావాలనీ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్స్ లు, పార్టీ నాయకులు అందరూ భారీగా తరలివచ్చి బిజెపి నిరంకుశ పాలనపై ఉద్యమించాలనీ మహేష్ కుమార్ గౌడ్ విన్నవించారు

**లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం: మంత్రి పొన్నం ప్రభాకర్**

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇంటి ముందు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమనీ ప్రభాకర్ ఆవేదన చెందారు. రాహుల్ గాంధీ ,మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ ఇతర ముఖ్య నేతల అరెస్టులను తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలనీ అన్నారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జీ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలనీ అన్నారు.

**భావప్రకటన స్వేచ్ఛను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోంది: మంత్రి జూపల్లి కృష్ణారావు**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను పోలీసులు అకారణంగా అరెస్ట్ చేయడాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు >>2



# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

### నాలుగుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారు..
### వరంగల్లు రైతుల డిక్లరేషన్ ఏమైంది: కెటిఆర్

మంగళవారం మంచిర్యాల జిల్లాలో జరిగిన రైతు సదస్సులో కెటిఆర్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి విస్మరించిందని, కాంగ్రెస్‌కు ఓటేసినపాపానికి ప్రజలు నరకం చూస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలోని అంకతిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదన్నారు. రాష్ట్రానికి ఎల్నినో ప్రభావం చేసిననష్టం కంటే కాంగ్రెస్‌చేసిన నష్టమే ఎక్కువన్నారు. కన్నెపల్లిలో ఉన్న వాటర్‌ను రోజుకు మూడు టీఎంసీల చొప్పున అన్నారం, సుందిల్ల, ఎల్లంపల్లి బ్యారేజ్‌లకు బ్యాక్‌వాటర్ ఎందుకు పంపడం లేదని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఒక్క ఎల్‌నినో కాదు >>2

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

>> ఇంకొక ఎల్ నినో వచ్చిన మన రాష్ట్రానికి కరువు రాకుండా బ్యారేజ్ లు కట్టి బాహుబలి మోటార్లు పెట్టించిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తా అని ప్రజలను మభ్యపెట్టి నాలుగు సార్లు ఎగ్గొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇలా ఇచ్చిన హామీలన్నిటిని తుంగలో తొక్కాడన్నారు. కాళేశ్వరంపై రేవంత్ రెండు పిల్లర్స్ దెబ్బతిన్నాయని చెప్పి 32 నెలలుగా ఎందుకు మరమ్మతులు చేయించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద బూటకపు ప్రచారాలు చేస్తూ రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి వరంగల్ సభలో ఏక కాలంలో రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. 32 నెలలు గడిచిన ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తన పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించారు. నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలే కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, సుంకే రవి, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సేమ్‌సీన్

>> చేసారు. లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు నీట్‌పేపర్‌లీక్‌పై నినాదాలు ప్రారంభించారు. అలాగే సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జి సిగ్గుసిగ్గు అంటూ నిరసన తెలిపారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా విపక్ష సభ్యులను పదేపదే వారిస్తూ వారివారి సీట్లలోకి వెళ్లి కూర్చోవాలంటూ విజ్ఞప్తిచేసారు. ఎంతసేపటికీ సభ్యులునిరసన విరమించకపోవడంతో మధ్యాహ్నం వరకూ బిర్లా సమావేశాలను వాయిదా వేసారు. తిరిగి సమావేశం అయిన తర్వాత స్పీకర్‌స్థానంలో హాజరయిన దిలీప్‌సైకియా కూడా విపక్ష సభ్యులందరినీ వారివారి స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలని కోరారు. సభా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. దీనితోసభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సైకియా సభను బుధవారానికి వాయిదా వేసారు. సభలో ప్రశ్నోత్తరాలను చేపట్టాలనినిర్ణయించిన స్పీకర్‌కు అడుగడుగునా సభ్యులు అడ్డుతగిలారు. రాజ్యసభ కార్యక్రమాలు కూడా నిరంతరాయంగా అవాంతరాలతోనే నడిచాయి. మధ్యాహ్నం వరకూ వాయిదాపడిన తర్వాత తిరిగి సమావేశం అయినా నీట్‌పరీక్షల పేపర్‌లీకేజి, లాఠిఛార్జి, అయోధ్య విరాళాలచోరీ వంటి వాటిపై చర్చలు జరగాల్సిందేనంటూ పట్టుబట్టడంతో సభమరోసారి వాయిదాపడింది. తిరిగి మూడు గంటలకు సమావేశం అయినా కూడా ఎగువసభలో విపక్ష సభ్యులు అవే నినాదాలుకొనసాగించారు. ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలంటూ పట్టుబట్టారు. ఒకదశలో రాజ్యసభలో అధికార పక్ష సభ్యులు కూడా విపక్ష సభ్యుల ఆందోళనకు కౌంటర్‌గా నినాదాలుచేసారు. దీనితో సభా ధ్యక్షుడు ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్ సభను బుధవారానికి వాయిదా వేసారు. అంతకుముందు విపక్ష సభ్యులతో స్పీకర్ ఓంబిర్లా సమావేశం అయి సభసజావుగా సాగేందుకు సహకరించాలని, నీట్‌పై చర్చించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. సభా సమావేశాలకుముందు ఇండియా కూటమి నాయకులంతా ఖర్గే ఛాంబర్‌లో సమావేశం అయి ఉభసభలలో అధికార పార్టీని నిలదీయాలని నిర్ణయించారు. బుధవారం పార్లమెంటు కాంప్లెక్స్‌లోనే అజాద్ సమాజ్‌పార్టీ కాన్షీరామ్ విభాగం ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ ఆకస్మిక నిరసనకు దిగారు. కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాచేయాలని నిరసన తెలుపుతూ బైఠాయించారు. అలాగే పార్లమెంటు బయట ఆప్ ఎంపిలు కూడా నిరసన నిర్వహించారు. ఆప్ ఎంపి సంజయ్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసు లాఠీఛార్జికి నిరసనగా ఇతర పార్టీనేతలతోకలిసి నిరసన తెలిపారు.

## ‘నీట్’ దోషులను కఠినంగా శిక్షిస్తాం

### ఎన్డీయె పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని

**న్యూఢిల్లీ,జులై 21:** నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు బాధ్యులైన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఇటువంటి ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టడం దేశ బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ మంగళ్ మిలన్ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రధాని వ్యాఖ్యలను వెల్లడించారు. పోటీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పటిష్టమైన, నమ్మకమైన పరీక్షా వ్యవస్థను నిర్మించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు రిజిజు తెలిపారు. అలాగే పార్లమెంట్‌లో శాసన కార్యక్రమాలకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు పూర్తి సహకారం అందించాలని, ప్రతిపక్షాలు కూడా రాజకీయ భేదాలను పక్కనపెట్టి దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం దృష్ట్యా నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని మోడీ సూచించినట్లు చెప్పారు. దేశంలో అత్యంత పోటీ ఉన్న ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్‌కు ప్రతి సంవత్సరం 20 లక్షలకు పైగా విద్యార్థులు హాజరవుతారు.



మంగళవారం సిఎం రేవంత్‌తో భేటీ అయిన బ్యాడ్మింటన్‌స్టార్ శ్రీకాంత్

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కిడాంబి శ్రీకాంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై21:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల యూఎస్ ఓపెన్ (BWF Super 300) టోర్నమెంట్‌లో రన్నరప్‌గా కిడాంబి శ్రీకాంత్ నిలిచారు.

# ఎత్తిపోసుడే..

>> హరీశ్ రావు వివరించాలని మంత్రి ప్రశ్నించారు. ఆ నిర్ణయం వల్లే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి చేరుకుందని అన్నారు. అలాగే, కాళేశ్వరం కాంట్రాక్టర్లు బిఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని మాజీ ఎమ్మెల్సీ కె. కవిత చేసిన ఆరోపణలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతులను తప్పుదోవ పట్టించడం మానేసి, ఆ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాగునీటి భద్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా సన్న వడ్ల కొనుగోళ్లలో కుంభకోణం జరిగిందంటూ వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమనిమీడియా, సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో స్కాములు జరిగి ఉండవచ్చు కానీ, తమ ప్రభుత్వంలో ప్రతీదీ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని అన్నారు. ధరలు పెంచి టెండర్ కోట్ చేయడం వల్ల తొలుత ఎవరూ ముందుకు రాలేదని తెలిపారు. అందుకే సాంకేతిక నిబంధనల ప్రకారం మళ్లీ టెండర్లు పిలవాల్సి వచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# మరో అల్పపీడనం

>> వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

## వారం - వర్జ్యం

22-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
నవమి పూర్తి,
స్వాతి పూర్తి
వర్జ్యం : తె.5.18-ఉ.7.05
దు. ఉ.11.47-మ.12.39
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ఏపనిని చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకు కలిగిస్తాయి. దీర్ఘకాలికి సమస్యలు తీరి ఊరటచెందుతారు.

**వృషభం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఇంటియందు శుభ కార్యాలు నిర్వహిస్తారు. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:** నిలకడ లేని గెలుపుకన్నా దైవాన్ని బాగా నమ్ముకొని లాభపడతారు. కలిగిన దానితో తృప్తి పడుతారు.

**కర్కాటకం :** ఇంట్లో ఒకరి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. పాలసీ రెన్యువల్ పట్ల అప్రమత్తత వహించండి.

**సింహం:** ఎల్లవేళల సలహాలను తీసుకొనే వారివద్ద కాకుండా మరొక నిపుణుని సలహాలు తీసుకోవటం వలన లాభపడతారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. రాజకీయ రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** ఆర్థికముగా పరిస్థితి బాగున్నా ఖర్చు అధికమవుతుంది. సుదూర ప్రాంతముల లోని వారియొక్క క్షేమ సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** ఇతరుల కార్యకలాపాలు, వారికి సహాయ సహకారాలు అందించటంతోనే కాలం గడుస్తుంది. ఉద్యోగాలు సానుకూలంగా ఉంటాయి.

**ధనుస్సు:** జీవితంలో ముఖ్యము అని భావించే కార్యక్రమాలను ప్రారంభించ టానికి విశేషంగా కృషిచేసి కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**మకరం:** బాధ్యతయుతంగా ప్రవర్తించి కార్యాలయంలో గౌరవం పెంపొందించు కుంటారు. ఆర్థిక వ్యవహారాలు మధ్యస్తంగా ఉంటాయి.

**కుంభం:** మీలో దాగి వున్న నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మీనం :** బ్యాంకు లావాదేవీలలోని తేడాలను, లోపములను పరిశీలించుకొని లాభపడతారు. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ప్రధాని నివాసం వద్దకు వెళ్తున్న రాహుల్, ప్రియాంక తదితరులు



రాహుల్ ముక్కునుంచి కారుతున్న రక్తం



రాహుల్‌ను వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు

# ప్రధాని నివాసం ముట్టడి.. ఉద్రిక్తం

>> ఈ ర్యాలీతో ఢిల్లీ వీధులన్నీ ఉద్రిక్తంగా మారాయి. కేంద్ర ప్రభుత్వంపై దాడిని మరింత ఉధృతం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మంగళవారం ప్రధాని అధికారిక నివాసం లోక్ కల్యాణ్ మార్గ్ వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కే.సి. వేణుగోపాల్, పవన్ ఖేరా తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలకు మద్దతుగా ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ, “నిన్న యువ విద్యార్థులపై జరిగిన క్రూరమైన పోలీసు చర్యకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. ప్రభుత్వం బాధ్యత వహించేందుకు సిద్ధంగా లేదు. పార్లమెంట్‌లో కూడా ఈ అంశంపై చర్చించేందుకు నిరాకరిస్తోంది. దేశ యువత భవిష్యత్తును నాశనం చేసినందుకు ప్రధాని, కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలని పేర్కొన్నారు. నిరసన సందర్భంగా కాంగ్రెస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకున్నట్లు వైరల్ అయిన దృశ్యాల్లో కనిపించింది. ప్రధానినివాసంముందునుంచి రాహుల్‌ను తరలించే సమయంలో పోలీసులు రాహుల్‌పై దురుసుగా వ్యవహరించారనినేతలు ఆరోపించారు. రాహుల్ ముక్కునుంచి రక్తంకారిన దృశ్యాలను పార్టీ వైరల్‌చేసింది. అంతకుముందు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు రామ్ మనోహర్ లోహియా (ఆర్ఎంఎల్) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. సోమవారం పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడంతో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో, పోలీసుల దౌర్జన్యం, లాఠీచార్జిలో గాయపడిన విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కే.సి. వేణుగోపాల్ పరామర్శించారు. దేశ విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుండగా, తమ హక్కుల కోసం గొంతెత్తిన వారిపై లాఠీలు ఎత్తడం అత్యంత దురదృష్టకరం. ప్రశ్నపత్రాల లీకేజీకి ప్రభుత్వం బాధ్యత వహించి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పార్టీ పేర్కొంది.

పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విద్యార్థుల సమస్యపై సభలో చర్చ నిర్వహించాలని కోరామని తెలిపారు. దీనికి స్పందించిన స్పీకర్ ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారని, దీంతో పార్లమెంట్‌లో చర్చ కూడా ప్రభుత్వ అనుమతిపైనే ఆధారపడుతోందని ఆయన విమర్శించారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశం. యువతపై ఇలాంటి దాడులు జరగడం భారతీయ విలువలకు విరుద్ధం. జరిగిన ఘటనపై ప్రధాని మోదీ ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. కాగా, పరీక్షా వ్యవస్థలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న నిరసనకారులు ముందురోజు పార్లమెంట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించి, లాఠీచార్జి చేసి వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు. ప్రస్తుతం నిరసనకారులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే బైఠాయింపులో పాల్గొన్న కాంగ్రెస్‌నేతలనందరినీ వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించి తదనంతరం విడుదలచేసారు.

**రాహుల్‌గాంధీతో నిరసనలోనే కేంద్ర మంత్రి చర్చలు..!**

మోడీ నివాసం ముందు బైఠాయించిన కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకించి రాహుల్‌గాంధీతో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ చర్చలుజరిపారు. పార్లమెంటులో చర్చించాలని, నీట్ లీకేజికి బాధ్యులైనవారిపై కఠిన చర్యలుండాలని, నీట్ లోపాలు, సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జి అంశాలపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలని రాహుల్ గాంధీ స్పష్టంచేసారు. సిజెపి ర్యాలీలోనిర్వహించిన లాఠీ ఛార్జికి ప్రధానిమోడీ క్షమాపణలు చెప్పాలని రాహుల్ డిమాండ్‌చేసారు. దేశ విద్యావ్యవస్థలో సంస్కరణలురావాలని, పేపర్ లీకేజిలకు వ్యతిరేకంగా యువత నిరసన తెలుపుతుండగా వారిపై లాఠీ ఛార్జిజరిగిందని తెలిపారు.

**రాహుల్‌రహస్య ఆపరేషన్ సక్సెస్?..!**

హటాత్తుగా ఇచ్చిన పిలుపుతో మోడీ నివాసం ముందు కాంగ్రెస్‌నేతలు ఎంపిలు నాయకులు నిర్వహించిన ముట్టడి విజయవంతం కావడం రాహుల్ నిర్వహించిన రహస్య ఆపరేషన్ అని తెలుస్తోంది. ముందు 10 రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసానికి చేరిన నేతలు ఎఐసిసి అధ్యక్షుడు 84వ జన్మదినశుభాకాంక్షలు తెలియజేసేందుకు చేరుకున్నారు. అక్కడినుంచి సుమారు 2.3 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న 7,లోక్‌కల్యాణ్‌మార్గ్‌లోని ప్రధాని నివాసానికి కాంగ్రెస్ నేతలు హటాత్తుగాచేరుకుని నిరసన చేపట్టారు. తొలుత విజయ్‌చౌక్‌వరకూ నిరసన ర్యాలీ చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది సమాచారం ముందుగానే లీక్ అవడంతో పోలీసులు అడ్డుకుంటారనే అంచనాతో ప్లాన్‌మార్చి ప్రధానిమోడీనివాసం ముందు బైఠాయింపును నిర్వహించారు. ఖర్గే పుట్టినరోజుకు భోజనానికి వస్తున్నట్లుగా భావించిన భద్రతా అధికారులకు ఎలాటి అనుమానం రాలేదు. అలాగే ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా ముందుగా పసిగట్టలేకపోయాయి. నీట్ పేపర్ లీక్కు వ్యతిరేకంగా బొద్దింకల జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉద్యమాన్ని కాంగ్రెస్ హైజాక్ చేసింది. సోమవారం యువ విద్యార్థులు, బొద్దింకల పార్టీ నాయకులపై దృష్టి సారించిన ఈ ఉద్యమం.. మంగళవారం రాహుల్ గాంధీ వైపు మళ్లడంతో చర్చ తీవ్రరూపం దాల్చింది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానమంత్రి నివాసానికి చేరుకున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే తన ఏకైక డిమాండ్ అని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఒకవేళ ఇది జరగకపోతే రాత్రంతా ప్రధానమంత్రి నివాసం బయటే గడుపుతానని ప్రకటించారు. ప్రధానమంత్రి నివాసం బయట నిలబడి ఉన్న కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ మాట్లాడుతూ 120 మంది ఎంపీలు తనతో ఉన్నారని పేర్కొన్నారు.

కర్ణాటక ముఖ్యమంత్రి డీకేశివకుమార్, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీసన్ కూడా చేరుకున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్ బయటకు వచ్చి రాహుల్ గాంధీని కలిసి డిమాండ్లను పరిశీలిస్తామని చెప్పారు. అంతేకాకుండా నీట్ పేపర్ లీక్ విషయంపై సభలో చర్చిస్తామని తెలిపారు. అయితే రాహుల్ గాంధీ తాను తన డిమాండ్లకు కట్టుబడి ఉన్నానని స్పష్టంగా చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తాను ఇక్కడి నుంచి వెళ్లనని అన్నారు. అంతేకాకుండా తాను రాత్రికి ఇక్కడే ఉంటానని కూడా తెలిపారు.

## ప్రజాస్వామ్య హక్కుపై దాడి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై21:** కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకలతో పాటు ఇతర నాయకులను అదుపులోకి తీసుకోవడాన్ని సిఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఇది ప్రజాస్వామ్య హక్కుపై జరిగిన దాడి అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నుండి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తున్న యువతకు కాంగ్రెస్ కుటుంబం, దేశం మొత్తం అండగా నిలుస్తాయన్నారు. ‘మీరు మమ్మల్ని జైలులో పెట్టవచ్చు, మమ్మల్ని అణచివేయడానికి ప్రయత్నించవచ్చు; కానీ న్యాయం, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న లక్షలాది మంది భారతీయ యువత ఆగ్రహాన్ని మాత్రం మీరు అణచివేయలేర’ని అన్నారు.

# మరీ.. ఇంత నియంతృత్వమా?

>> తీవ్రంగా ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, భావప్రకటన స్వేచ్ఛను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా అపహాస్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ప్రజల తరపున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై పోలీసు చర్యలకు దిగడం సరికాదని జూపల్లి అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో ప్రజల గొంతును అణచివేయలేరని, ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**జాతీయరహదారి -65 దిగ్బంధనం: జగ్గారెడ్డి**

రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా బుధవారం నేషనల్ హైవే-65 దిగ్బంధనం చేస్తున్నామనీ తెలంగాణ కాంగ్రెస్‌వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ , కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని మోదీ నివాసం ముందు నిరసన చేపట్టిన సందర్భంగా, పోలీసులు రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం: మంత్రి వివేక్ వెంకటస్వామి**

విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిలిచిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు గళమెత్తితే వారి గొంతు నొక్కడం సరికాదన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు. విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

## నేడు ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్ల సమ్మె

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై21:** రాష్ట్రంలో బుధవారం ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్ల సమ్మె జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఈ సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్మిక హక్కులు, సామాజిక భద్రత కోసం పోరాటం చేస్తున్నట్లు వారు ప్రకటించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మె కు దిగుతామని రేపు ఓలా, ఉబర్, ర్యాపిడో డ్రైవర్ల అసోసియేషన్ హెచ్చరించింది. వీరికి మద్దతుగా స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో కూడా సమ్మె బాట పట్టే అవకాశం ఉందని సమాచారం.

## అఫ్ఘాన్‌లో భారీ వరదలు.. 20 మంది మృతి

**కాబూల్,జులై 21:** ఆఫ్ఘానిస్థాన్‌లోని నూరిస్తాన్ ప్రావిన్స్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలో కనీసం 20 మంది మృతిచెందగా, 80 మందికిపైగా గాయపడ్డారు. మరో 100 మందికిపైగా గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. నూరిస్తాన్ ప్రావిన్స్ రాజధాని పరూన్ అత్యధికంగా ప్రభావితమైన ప్రాంతంగా మారింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించి నివాస ప్రాంతాలను ముంచెత్తాయి. దీంతో అనేక ఇళ్లు ధ్వంసమవడంతో పాటు భారీ స్థాయిలో ఆస్తి నష్టం సంభవించింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు, భారీ కొండచరియలు పరూన్ పట్టణాన్ని చీల్చుకుపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. రహదారులు తెగిపోవడం, ఇళ్లు నేలమట్టం కావడం, అనేక ప్రాంతాలు శిథిలాలుగా మారడం వంటి దృశ్యాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. తాలిబన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నూరిస్తాన్‌లోని పరూన్‌తో పాటు సమీప ప్రాంతాలు కూడా వరదల ప్రభావానికి గురయ్యాయని తెలిపింది.

# సీతక్కపై క్రిమినల్ కేసు కొట్టివేత

>> పలికింది. 2021 ఏప్రిల్ 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద సీతక్కతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆరోగ్యశ్రీ పథకంలో కొవిడ్ చికిత్సను చేర్చాలని కోరుతూ నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీసుల అనుమతి తీసుకోలేదని, కొవిడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ సామాజిక దూరం పాటించకుండా, మాస్కులు ధరించకుండా నిరసన చేపట్టారని ఆరోపిస్తూ గాంధీనగర్ పోలీసులు ఐపీసీ సెక్షన్లు 188, 269, 270తో పాటు విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 51(బి) కింద కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయగా, ఎక్సైజ్ కేసుల ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు దానిని స్వీకరించి విచారణ కొనసాగిస్తోంది.

ఈ నేపథ్యంలో సీతక్క హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసు చట్టబద్ధం కాదని, కేసు స్వీకరణ నుంచే న్యాయపరమైన లోపాలు ఉన్నాయని పిటిషన్‌లో వాదించారు. ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు విచారణకు సంబంధిత ప్రజాసేవకుడు లేదా అతని పైఅధికారి నుంచి తప్పనిసరిగా లిఖితపూర్వక ఫిర్యాదు ఉండాల్సి ఉంటుందని, కానీ ఈ కేసులో కేవలం పోలీసుల ఎఫ్ఐఆర్, చార్జిషీట్ ఆధారంగానే కోర్టు విచారణ ప్రారంభించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అలాగే విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 51(బి) కింద కూడా అవసరమైన చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించలేదని, సెక్షన్ 60 ప్రకారం అధికారం కలిగిన వ్యక్తి ఫిర్యాదు చేయకపోవడంతో విచారణ కొనసాగించడానికి అవకాశం లేదని వాదించారు.

అంతేకాకుండా ఐపీసీ సెక్షన్లు 269, 270 వర్తించాలంటే నిందితుడి చర్యల వల్ల అంటువ్యాధి వ్యాపించే అవకాశం లేదా వ్యాప్తికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు ఉండాలని, కానీ తనపై అలాంటి ఆరోపణలు గానీ, ఆధారాలు గానీ లేవని సీతక్క తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కేవలం శాంతియుత నిరసనలో పాల్గొన్నందుకు ఈ నేరాలు వర్తించవని, సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల తీర్పులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయని వాదించారు.

వాదనలు పరిశీలించిన జస్టిస్ సుజన, సీతక్కపై కొనసాగుతున్న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడానికి చట్టపరమైన ఆధారం లేదని నిర్ధారిస్తూ, కింది కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి కేసును కొట్టివేశారు.

# ప్రేమ వ్యవహారమైతే ఒకరిపైనే చర్యలు సరికాదు..

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి ఉదంతంపై

## మాజీ డిజి నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణలో వున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంపై విశ్రాంత ఐపిఎస్ అధికారి సిబిఐ మాజీ తాత్కాలిక డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు ఎక్స్ వేదికగా మంగళవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన వెనక ప్రేమ వ్యవహారం వుంటే కేవలం ఉదయ్ కృష్ణారెడ్డిపై మాత్రమే చర్యలు తీసుకోవడం సరికాదని ఆయన తెలిపారు. ఈ ఉదంతంలో ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన ఎఫ్ఐఆర్ కారణంగా అతన్ని వెంటనే సస్పెండ్ చేయడం అనేక ప్రశ్నలు లేవనెత్తేలా వుందని నాగే శ్వర రావు తెలిపారు. ప్రేమ బంధం విఫలమైతే దానిని క్రిమినల్ కేసుగా మార్చవద్దని ఆయన పోలీసులకు సూచించారు. ఈ కేసులో నిష్పక్ష పాతంగా విచారణ జరగాలని, పరస్పర అంగీకారంతో సంబంధం వుంటే ఇద్దరికి సమానంగా క్రమశిక్షణా చర్యలు వుండాలని ఆయన పేర్కొన్నా రు. ఒకరిపై చర్యలు తీసుకుని మరొకరిని నిరపరాధిగా చూడడం సరైంది కాదని ఆయన తెలిపారు. ఈ కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై విధించిన సస్పెన్షన్‌పై పునసమీక్షించాలని కేంద్ర హోం శాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కేసు విచారణ పూర్తయ్యే వరకు ఉదయ్ కృష్ణారెడ్డి శిక్షణ కొన సాగేలా చూడాలని ఆయన కోరారు. ఐపిఎస్ అధికారులకు శిక్షణ ఇచ్చే జాతీయ పోలీసు అకాడమిలో వెలుగు చూసిన ఈ ఘటనపై సమగ్ర వి చారణ చేయాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్‌తో పాటు తెలంగాణ డిజీపికి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసు శాఖలో ఒక కానిస్టేబుల్ నుంచి తన ప్రయాణం మొదలుపెట్టి ప్రతిష్టాత్మకమైన ఐపిఎస్ అందుకుని ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని, ఈ విషయంలో ఎ పి సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెంది న నాగేశ్వరరావు 1986 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఒడిషా కేడర్‌లో సుదీర్ఘ కాలం పనిచేసి కేంద్ర సర్వీసులోనూ సేవలందించారు. ఈ క్రమంలో నే 2018 అక్టోబర్ నుంచి 2019 ఫిబ్రవరి నెల వరకు సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా పనిచేశారు.

**హైకోర్టును ఆశ్రయించిన ఉదయ్ కృష్ణారెడ్డి.. నేడు విచారణ**

ఇదిలావుండగా తనపై నమోదైన నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టి వేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరగనుంది. అకాడమిలో తమ వాడికి న్యాయం జరగకుంటే కోర్టులో దీనిపై తేల్చుకుంటామని ఉదయ్ కృష్ణారెడ్డి కుటుంబీకులు ఇప్పటికే వెల్లడించడం తెలిసిందే. ఈ విషయాన్ని అతని సోదరుడు ప్రణయ్ కృష్ణా రెడ్డి మీడియాకు వెల్లడించడం గమనార్హం. మరోవైపు ఉదయ్ కృష్ణారెడ్డి ఇంకా ఆసుపత్రిలోనే వున్నట్లు తెలిసింది. అతను ఆసుపత్రి నుంచి డి శ్చార్జి అయితే విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇదే కేసుకు సంబంధించి అల్వాపూర్ పోలీసులు పో లీసు అకాడమిని సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడి ఈ ఘటనపై వివరాలు సేకరించడంతో పాటు సిసిటివి ఫుటేజిలను స్వాధీనం చే సుకున్నారు.



# మిజోరం స్పీకర్‌ను సన్మానించిన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై21:** మిజోరాం రాష్ట్ర శాసనసభ స్పీకర్ పూలాల్ బిక్జామా, వారి సతీమణి వాన్‌లాల్ రుటి మంగళవారం సాయంత్రం తెలంగాణ అసెంబ్లీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో సమావేశమయ్యారు. ఇరు రాష్ట్రాల స్పీకర్లు.. అసెంబ్లీల సమావేశాల నిర్వాహణ, పనితీరు, పద్ధతులపై చర్చించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మిజోరాం స్పీకర్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభ తరుపున మిజోరాం స్పీకర్‌ను, వారి సతీమణిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. తర్వాత శాలువ కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, లెజిస్లేటివ్ అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ ద్రోహులను మళ్లీ చేర్చుకునే ప్రసక్తే లేదు: మమతా బెనర్జీ

**కోల్‌కతా, జులై 21:** పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనరి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పార్టీని వీడి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని ఆమె స్పష్టంచేశారు. అదే సమయంలో రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనేందుకు ఇండియా కూటమిలోని పక్షాలన్నీ ఐక్యంగా ఉండాల్సి న అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. కోల్‌కతాలో మంగళవారం ఓ కార్యక్రమంలో మమతబెనర్జీ మాట్లాడారు. లౌకికవాదాన్ని, సమాఖ్య స్ఫూర్తిని, ప్రజా సంక్షేమ పాలనను కాపాడుకోవడానికి ప్రతిపక్షాల ఐక్యత ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. విపక్ష కూటమిలోని పార్టీలు విభేదాలను పక్కనపెట్టి ఏకం కావాలని పిలుపునిచ్చారు. పార్టీని వీడిన ద్రోహులను ఎప్పటికీ తిరిగి చేర్చుకోబోమని, ఈ విషయంలో తనకు ఎలాంటి భేషజాలు లేవని స్పష్టంచేశారు. పార్టీని వీడుతున్న వారికి నేను ఒక్కటే చెబుతున్నా. బీజేపీకి మద్దతుగా నిలవాలనుకుంటే నేరుగా ఆ పార్టీలోనే చేరి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేస్తున్నా. ఎంత ఎక్కువమంది వెళ్లిపోతే నాకు అంత సంతోషం. ఆయా స్థానాలను యువ నాయకులతో భర్తీ చేస్తా అని మమతాబెనర్జి వ్యాఖ్యానించారు.

# భద్రత ఉపసంహారణ సహా కీలక అంశాలపై చర్చ

## ఉన్నతాధికారులతో డిజిపి సి.వి.ఆనంద్ సమీక్ష



**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** పోలీసు శాఖ పనితీరును మరింతగా మెరుగు పరచడంతో పాటు పలు కీలక అంశలపై డిజిపి సి.వి ఆన ంద్ మంగళవారంఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పోలీసు శాఖకు సంబంధించిన పలు విధానపరమైన, పరిపాలనా, సాంకేతిక అంశాలపై డిజిపి ఆనంద్ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. సమగ్ర ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఆర్‌సీ) అమలు, మావోయిస్టు ముప్పు పేరుతో అవసరానికి మించి కల్పించిన భద్రతను ఉపసంహారించడంపైనా ఈ భేటీలో చర్చించారు. మావో యిస్టు ల ముప్పు ఇప్పుడు లేనందున ఇంతకాలం భద్రత పొందిన వారి నుంచి 400 మంది పోలీసు సిబ్బందిని ఉపసంహారించడం, ఇదే సమయంలో బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను పెద్ద సంఖ్యలో వెనక్కు తీసు కోవడంపైనా డిజిపి సమీక్షించారు. ఇంతకాలం గన్‌మెన్లుగా పనిచేసిన సిబ్బ ందిని ప్రస్తుతం ఇతర విభాగాల్లో సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావడం మంచి పరిణామని డిజిపి ఆనంద్ తెలిపారు. దీంతో పాటు పోలీసు శాఖలో వాహనాల ఆడిట్ వాటి వినియోగం ఎలా వుందనే దానిపైనా డిజిపి సమీక్ష నిర్వహించారు. మారిన పరిస్థితుల్లో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ యూనిట్లను ఒకే క్యాంపస్ నుంచి నిర్వహించే అంశంపైనా ఈ భేటీలో చర్చించారు.

తెలంగాణ పోలీసు మాన్యువల్ తుది రూపకల్ప న, ఐపిఎస్ అధికారుల యూనిఫాంలో క్రాస్ బెల్టులు, లాఠీలు వంటి సంప్రదాయ అంశాల ప్రస్తుత అవసరంపై నా ఈ సమావేశంలో చర్చించారు. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టిఎస్ఎస్‌పి) సిబ్బందికి సంబంధించిన వివిధ సమస్యలు, వాటి పరిష్కారంలో ఇతర ప్రభుత్వ శాఖల స మన్వయం, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధం, డ్రగ్ కంట్రోల్ వంటి రంగాల్లో కొత్త విభాగాల ఏర్పాటు పైనా డిజిపి ఆనంద్ ఉన్నతా ధికారులతో చర్చించారు. రోడ్డు ప్రమాదాల నివా రణకు కొత్తగా ఏర్పాటు చేయనున్న రోడ్డు భద్రత బ్యూరో గురించి కూడా ఈ సమావేశంలో సమీక్షి ంచారు. దీంతో పాటు ప్రస్తుత సాంకేతిక అవసరాలకు అనుగుణంగా కంప్యూటర్ సర్వీసెస్ విభాగాన్ని ఆధునీకరించడం, సీసీటీఎన్ఎస్ 3.0, టీజీకాప్ 3.0, హాక్ఐ 3.0, ప్రాజెక్టుల పురోగతిపైనా డిజిపి సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో సైబరాబాద్ కమిషనర్ రమేష్, ఫ్యూచర్ సిటీ క మిషనర్ డాక్టర్ తరుణ్ జోషి సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ విధానాల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుం టామని డిజిపి సి.వి. ఆనంద్ తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం రేపు కలెక్టరేట్ల వద్ద ఎఐఎస్ఎఫ్ ముట్టడి

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం 23న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి చేపట్టాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి తెలిపింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులు మంగళవారం విడుదల చేశారు. హిమాయత్ నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా ఛలో కలెక్టరేట్లకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. ప్రభుత్వం నిరక్ష ్య వైఖరిని వీడి వెంటనే పెండింగ్ బకా యిలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కళాశాలలు ఫీజుల పేరుతో విద్యార్థుల అసలు విద్యా సర్టిఫికెట్లను నిలుపుదల చేయడం తీవ్ర అన్యాయమన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 23న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న చలో కలెక్టరేట్ల కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సామిడి వంశివర్ధన్ రెడ్డి, మహమ్మద్ అన్వర్, అనిల్, హరీష్, నాయకులు కృష్ణ, రఘు, అరుణ్, జోసెఫ్ భాను, భాను పాల్గొన్నారు.

# విద్యార్థులపై దాడులు చేసి అణిచివేయడం మోడీ నియంతృత్వ పాలనకు నిదర్శనం

## కేంద్ర విద్యామంత్రి దిష్టిబొమ్మ దహనం చేసిన పిసిసి ఒబిసి

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** ప్రజాస్వామిక పద్ధతిలో గాంధేయ విధానంతో విద్యార్థులు నిరసనచేపడితే దానిని పాశవికంగా మోడీ అణిచివేయడానికి పోలీసుల బలప్రయోగం ఉపయోగించడం దారు ణమని పిసిసి ఒబిసి అధ్యక్షుడు కేతూరి వెంకటేశ్ విమర్శించారు. గాంధీ భవన్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం పిసిసి ఒబిసి విభాగం ఆధ్వర్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కేతూరి వెంకటేష్ మాట్లాడుతూ ఢిల్లీలో సోమవారం జరిగిన నిరసనలో విద్యార్థుల, యువత పై జరిగిన లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా ప్రజలు ముక్తకంఠంతో నిరసన తెలుపాలని అన్నారు. పిసిసి ఒబిసి విభాగం ఆధ్వర్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యువత అధైర్య పడొద్దని కోరారు. రాహుల్ గాంధీని ప్రధాని చెయ్యడం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడు మహేష్ అన్న లక్ష్యం అని తెలి పారు. నిరసన కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, రాజేష్ శామీర్‌పేట్, అలోక్‌నాథ్, వరికుప్పల సుధాకర్, దేరంగుల కృష్ణ, అరుణ్‌కుమార్‌గౌడ్, పవన్‌గౌడ్, శ్రీనివాసులు, వేదప్రకాశ్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాలిపేరు 15 గేట్లు ఎత్తివేత

## ఉగ్రరూపంలో తెలంగాణ నయాగరా జలపాతం

## చత్తీస్‌గఢ్-తెలంగాణకు రాకపోకలు బంద్

## ఇసుక వాగుపై తెగిన రోడ్డు

**హైదరాబాద్,జులై 21ప్రభాతవార్త:** సోమవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాద్రిజిల్లా చర్లమండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరదనీరు భారీగా చేరుతుండటంతో మధ్యతరహా ప్రాజెక్టు అధికారులు మంగళవారం 15 గేట్లను ఎత్తి 10,738 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుకు మరింత వరదనీరు చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరాన్ని బట్టి మరిన్ని గేట్లు ఎత్తే అవకాశ ముందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలో వరి సాగు చేస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చత్తీస్‌ఘడ్‌లో కురిసిన వర్షంకు 8967 వరద నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతోంది అలాగే ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతోపాటు తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తు న్నది. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163 పై ఇసుక వాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం అక్కేపల్లి గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో అక్కేపల్లి శివలింగాపూర్‌ల మధ్య రాకపోకలు నిలి చిపోయాయి. ప్రధానరహదారి కావడంతో కొం దరు వాగుదాటే యత్నం చేస్తున్నారని ప్రవాహం తగ్గేవరకు సాహసాలు చేయవద్దని కోరారు.

# విద్యుత్ ధర్నాలో పాల్గొంటే సస్పెన్షన్

## ఆర్టిజెన్లకు దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ హెచ్చరిక

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త :** తమ సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఆర్టిజెన్లు నిర్వహించ తలపెట్టిన ధర్నాకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆంక్షలు విధించింది. తమ సమస్యల పరిష్కారానికి సంస్థపై వత్తిడి తెచ్చేందుకు చేపట్టిన ఆందోళనలో భాగంగా ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లో ఛలో విద్యుత్ సౌధ కార్యక్రమానికి జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ధర్నా కార్యక్రమంలో ఆర్టిజన్లను పాల్గొంటే వారిని సస్పెండ్ చేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సిఎండి తీరుపై మండిపడుతున్న ఆర్టిజెన్లు ఎట్టిపరిస్థితుల్లోనూ ధర్నా చేసి తీరుతామని స్పష్టం చేశారు.

# ప్రధాని నివాసం వద్ద ప్రతిపక్షాల ధర్నాలో నిఘా వైఫల్యంపై కేంద్రం ఆరా

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** ప్రతిపక్ష నేతలు మంగళవారం అనూహ్యంగా ఢిల్లీలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రధాని మోది నివాసం వ ద్ద మూడు గంటలకు పైగా మెరుపు ధర్నా నిర్వహించడం సంచలనం రేపింది. ఢిల్లీ పోలీసు విభాగం కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోనే పనిచేస్తుండడం విదితమే. గతంలో ఆప్ నేత కేజ్రీవాల్ ఢిల్లీ సిఎంగా వున్న సమయంలో ఢిల్లీ పోలీసు విభాగం రాష్ట్ర సర్కారు ఆధీనంలోకి తేవాలని కోరినా కేంద్రం పట్టించుకోలేదు. ఆఖరుకు సుప్రీం కోర్టు సైతం ఇందులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీని త రువాత ఢిల్లీలో భద్రత అంతా ఢిల్లీ పోలీసు విభాగం పర్యవేక్షణ కిందే వుండసాగింది. ఇక ప్రస్తుతం ఢిల్లీలో బిజెపి పాలనలోనే వుండడం మ రో విశేషం. ఈ నేపథ్యంలో నిట్ పరీక్ష సహా పలు పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు లీక్ కావడంపై సిజెపి అనే పార్టీ కొంతకాలంగా ఆ ందోళన చేస్తుండగా ఇది సోమవారం నాడు ముదిరి పోలీసుల లాఠీఛార్జి వరకు వెళ్లింది. దీనిని నిరసిస్తూ మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖార్గెతో పాటు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ప్రధాని మోది ఇంటి వద్దకు చేరు కుని ఆందోళనకు దిగారు. ఈ పరిణామం కేంద్రంతో పాటు ఢిల్లీ పోలీసు విభాగం ఊహించలేక పోయింది. ఒక దశలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ధర్నా జరుగుతున్న ప్రాంతానికి వచ్చి రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖార్గెతో చర్చించినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు ప్రధా ని మోది ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనను కేంద్రం తీవ్రంగా పరిగణించినట్లు తెలిసిం ది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన మోది నివాసం వద్దకు ప్రతిపక్ష నేతలు ఎలా చేరుకున్నారని కేంద్ర హోం శాఖ ఢిల్లీ పోలీసులను అ డిగినట్లు తెలిసింది. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని కేంద్రం ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

# డివైడర్‌ను ఢీకొన్న కారు

## ముగ్గురి మృతి.. ఒకరికి గాయాలు

**కల్హేర్, జులై 21, ప్రభాతావార్త:** జాతీయ రహదారిపై అతివేగంగా దూసుకు పోతున్న కారు డివైడర్‌ను ఢీకొనడంతో కల్హేర్ పోలీసు ఠాణా పరిధిలో మంగళ వారం తెల్లవారుజాము 4 గంటలకు పెద్దప్రమాదం జరిగింది. ఎస్ఐ రవిగౌడ్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా దిగుళూరుకు చెందిన మహమ్మద్ షామీన్(50), మహమ్మద్ అనాబియా తస్కీం(4), మహమ్మద్ నదీమ్ (32), మహమ్మద్ నవీద్(28)లు హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్టుకు (ఎంహెచ్ 06ఎఎన్ 7306) స్కార్పి యో కారులో వెళుతున్న క్రమంలో మండల పరిధిలోని బాచేపల్లి శివారులోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్ సమీపంలో జాతీయ రహదారి 161 డివైడర్‌ను కారు ఢీకొని రోడ్డుకు హైవే రోడ్డు నుంచి సర్వీస్ రోడ్డు అవ తలి వైపునకు కారు పల్టీలు కొడుతూ దూసుకుపోయింది. ప్రమాదంలో మహమ్మద్ షామీన్ బేగం (50), మహమ్మద్ అనాబియా తీస్కం (4) ఘటనాస్థలంలోనే మృత్యువాతపడగా నదీమ్ (32) చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గాయాలకు గురైన నవీద్ (28) సంగారెడ్డిలోని వెల్నెస్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందచేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# నేటి నుంచి ఇన్‌సర్వీస్ టీచర్ల దరఖాస్తులు

## ఆగస్టు 31 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

## సెప్టెంబరు 7 నుంచి పరీక్షలు

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇన్ సర్వీస్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించిన టెట్ ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 దరఖాస్తులను బుధవారం నుంచి ఆన్‌లైన్ లో స్వీకరిం చనున్నారు. సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు పరీక్షలను సీబీటీ విధానంలో నిర్వహిం చనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫి కేషన్‌ను మంగళవారం పాఠశాల విద్య డైరక్టర్, టెట్-ఇన్ సర్వీస్ టీచర్స్- 2026 ఛైర్‌పర్సన్ నవీన్ నికోలస్ విడుదల చేసి, ఇందుకు సంబం ధించిన షెడ్యూల్‌ను ప్రకటించారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతోపాటు సాధారణ రెసిడెన్షియల్ స్కూల్స్, వివిధ సంక్షేమ శాఖల అధ్వర్యంలో కొనసాగు తున్న గురుకుల స్కూల్స్ టీచర్లు, మోడల్ స్కూల్ టీచర్లు కూడా టెట్‌కి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ప్రకటించారు. దరఖాస్తులను ఈ నెల 29 వరకు స్వీకరించ నున్నారు. టెట్ పరీక్షలను సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు నిర్వహించ నున్నారు. ఒక్కో పేపర్‌కి జనరల్, బీసీ అభ్య ర్థులకు ఫీజు రూ. 750గా నిర్ణయించగా.. రెండు పేపర్లు రాయాలనుకునే వారు రూ. 1000 చెల్లిం చాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థు లకు ఒక్కో పేపర్‌కి రూ. 700 కాగా.. రెండు పేపర్లకి కలిపి రూ. 950గా నిర్ణయించారు. మంగళవారం టెట్ ఇన్‌సర్వీస్ టీచర్స్- 2026 నోటిఫికేషన్‌ను జారీ చేయగా.. నేటి(బుధవారం) నుంచి ఆన్‌లైన్‌లో దరాఖాస్తులను స్వీకరించ నున్నారు. ఈ నెల 29వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆగస్టు 31 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వ హించనుండగా.. మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఆగస్టు 28 నుంచి 31 మధ్యలో టెట్ ఫలితాలను విడుదల చేయనున్నట్లు నోటిఫి కేషన్‌లో ప్రకటించారు. అర్హత మార్కులకి సంబం ధించి జనరల్, ఈడబ్ల్యూఎస్ వారికి 60 శాతం అంతకంటే ఎక్కువ, బీసీలకు 50 శాతం అంత కంటే ఎక్కువ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు 40 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు రావల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రకటిం చింది. రాష్ట్రంలో సుమారు 25 వేల మంది ఇన్ సర్వీస్ టీచర్లు టెట్ పరీక్షకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# ప్రభుత్వ విప్‌లకు మంత్రి హోదా ఇస్తూ జిఓ

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రభుత్వ విప్‌లు ముగ్గురికి రాష్ట్ర మంత్రి హోదా ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ విప్‌లు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట విజయ రమణ రావు, వేముల వీరేశం జివో ఆర్‌టి నెంబర్.1064 ద్వారా రాష్ట్ర మంత్రి హోదాను కల్పి స్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ విప్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న చింతకుంట విజయరమణరావు, వేముల వీరేశం యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర మంత్రి హోదా కల్పిం చడం పట్ల, పెద్దపల్లి, నకిరేకల్ మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లోని ఆర్టికల్-18 ప్రకారం రాష్ట్ర మంత్రి హోదాకు సంబంధించిన అన్ని అధికారిక ప్రోటో కాల్ ఈ ముగ్గురికి వర్తిస్తాయి. ప్రజా సమస్యల పరిష్కారం, నియో జకవర్గ అభివృద్ధి, శాసనసభలో ప్రభుత్వ తరఫున సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న సిహెచ్‌రమణారావు, వీరేశం,యెన్నం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర మంత్రి హోదా కల్పించడం వారి సేవలకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నారు.

# అమెరికాలో రోడ్డుప్రమాదం

## కారులో ప్రయాణిస్తున్న ముగ్గురి మృతి

## మరో ఇద్దరి పరిస్థితి విషమం

**హైదరాబాద్ (సైదాబాద్), జులై 21, ప్రభాతవార్త:** అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు నగర వాసులు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మన కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవాజామున జరిగిన ఈ ప్రమాద వివరాలిలా ఉన్నాయి. ఐఎస్ సదన్ డివిజన్‌లోని వాణినగర్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ నవీద్ గతంలో నగరం లోని డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్‌లో దాదాపు పది సంవత్సరాలు సైంటిస్ట్‌గా పాటు పని చేశారు. జివికెలో కూడా ఆయన వ నిచే శా ర ు. ఇటీవల కుటుంబ సభ్యులతో పాటు అమెరికాలో ఫార్మాస్యూటికల్ దిగ్గజ కంపెనీ అయిన మెర్క్ ఫార్మా కంపెనీలో ఉద్యోగం కోసం వెళ్లారు. మెర్క్ ఫార్మాలో ఆయన ప్రస్తుతం డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. లోకల్ టూర్ కోసం నవీద్ కుటుంబ సభ్యులు అయిదుగురు కలిసి మన కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుఝామున కారులో బయలుదేరారు. అమెరికాలోని సెయింట్ ఫ్రాన్సిస్ ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో నవీద్ భార్య నజియా సల్మా(45), కుమార్తె హాఫీజా నేహా షేక్(19), కుమారుడు హాఫీజ్ ఒమర్(14)లు మృతి చెందారు. అబ్దుల్ నవీద్‌తో పాటు ఆయన చిన్న కూతురు ఖదీజ(5) తీవ్ర గాయాలకు గురై అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లుగా తెలుస్తుంది. నగరంలోని వాణినగర్‌లో నవీద్ తల్లిదండ్రులు నివాసముంటున్నారు. నవీద్ కుటుంబ సభ్యులు అమెరికాలో రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న స్థానికులు, నాయకులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. కాగా తమకు అమెరికాకు వెళ్లడానికి వీసా త్వరగా లభించేలా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని నవీద్ తండ్రి కోరారు. యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.



నవీద్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

# 'సర్' ప్రక్రియను సకాలంలో పూర్తి చేయండి

## జిల్లా ఎన్నికల అధికారులతో విడియో కాన్ఫరెన్స్

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై21:** రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను సకాలంలో పూర్తయ్యేలా సంబంధిత ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను ఆన్ లైన్ లో సమర్పించిట్లయితే హార్డ్ కాపీ కోసం బిఎల్ఓలు ఓటర్లను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. ఎన్యుమరేసన్ ఫారమ్ సమర్పించేటప్పుడు ఆధార్ కార్డు తప్పనిసరి అని చెప్పొద్దని, ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారమ్ లను సమర్పించేందుకు అవసరమైన సహాయాన్ని అందించి, వారి ఫిర్యాదులను పరిష్కరించాలని తెలిపారు. అలాగే ఓటరు జాబితాల్లో వీవీఐపి, వీఐపి ఓటర్ల పేర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రాజకీయపార్టీలతో నిర్వహించే సమావేశాల్లో పారదర్శకత పాటిస్తూ, సంబంధిత వివరాలను నమోదు చేయాలని, పట్టణ ప్రాంతాలు, పురోగతి తక్కువ ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ వారంలోగా ప్రతి జిల్లాలో ఎన్యుమరేషన్ ప్రక్రియ 90శాతం పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆయన ఆదేశించారు.అలాగే నో మ్యాపింగ్ కేటగిరీలో ఉన్న ఓటర్లను పూర్తిస్థాయిలో ధృవీకరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయడానికి సంబంధిత ఎన్నికల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారిలు తదితరుల పాల్గొన్నారు.


**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**

స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట, హైదరాబాద్-500038.

**బహిరంగ ప్రకటన**

**ప్రణాళికా విభాగం**

**No. 006054/HMDA/01829/SWFL/GTK/2025**

M/s. MRW కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, యాదాద్రి-భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, భువనగిరి గ్రామం వద్ద ఉన్న సర్వే నం.లు 586/P మరియు 590/P లోని బహిరంగ ప్లాట్స్ (108 ప్లాట్స్)తో 42213.23 చ.మీ. యొక్క విస్తీర్ణానికి, ప్లాట్ నం.లు 109 & 110 తొలగించటం మరియు మొత్తం ప్లాట్స్ సంఖ్య 110కు బదులుగా 108కి తగ్గించటం ఫైల్ నం.48/LO/ZO-I/GTKR/HMDA/2011 ప్రకారం డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతి పొందిన దాని కొరకు మరియు ప్లాట్ నం.లు 94 నుండి 108లలోని ప్లాట్ ఏరియాలు కూడా ఇతర మార్పులు కలిపి దానికి రివిజన్ కం ఫైనల్ లేఅవుట్ ప్రతిపాదన నిమిత్తం ఒక దరఖాస్తు దాఖలు చేసినట్లు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కావున సాధారణ ప్రజానీకం మరియు ప్లాట్‌ల యజమానులు/కొనుగోలుదారులు/అగ్రిమెంట్ హోల్డర్‌లు, యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, భువనగిరి గ్రామం వద్ద ఉన్న సర్వే నం.లు 586/P & 590/Pలో 42213.23 చ.మీ. యొక్క విస్తీర్ణానికి దాని అనుమతి పొందిన డ్రాఫ్ట్ లేఅవుట్ యొక్క పర్మిషన్ గల వారు ఇంతకుముందు అనుమతి గల డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్‌కి చేయబడిన మార్పుల విషయమై ఈ ప్రకటన యొక్క ప్రచురణ తేదీ నుండి (15) రోజుల లోపుగా వారి అభ్యంతరాలు/సూచనలు ఏవైనా వ్రాతపూర్వకంగా ఈ కార్యాలయానికి దాఖలు చేయవచ్చును. ఈ నిర్దేశిత కాలంలో ఎటువంటి అభ్యంతరాలు/సూచనలు అందనట్లయితే యాదాద్రి-భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, భువనగిరి గ్రామం వద్ద ఉన్న సర్వే నం.లు 586/P & 590/P లోని అనుమతి గల డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్ యొక్క రివిజన్ కం ఫైనల్ లేఅవుట్ యొక్క అనుమతి డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్ 42213.23 చ.మీ. విస్తీర్ణానికి దరఖాస్తుదారుని అభ్యర్థన ఈ కార్యాలయంతో అందుబాటులో ఉన్న మెటీరియల్ పత్రాలపై ఆధారంగా పరిగణింపబడుతుంది.

సం/- షాలినీ కుమ్‌కుమ, మెట్రోపాలిటన్ కమిషనర్ తరఫున, HMDA

DIPR.No.6430-PP/CL/Advt/1/2026-27, తేది: 21.07.2026

వార్త

పువ్వు ఎంత అందంగా ఉన్నా పరిమళంలేకపోతే అది వ్యర్థమే. అలాగే క్రియాశూన్యమైన మాటలు వినడానికి ఎంత సొంపుగా ఉన్నా నిష్ప్రయోజనమే.

-మెకాలే

# ఆకలి మరణాలను అదుపు చేయలేమా?

**భారత దేశంలో జరిగే ఆకలి మరణాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కప్పి పుచ్చుతున్నాయని అనేక మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తు న్నారు. ఒకవ్యక్తి ఆకలితో మరణించినప్పుడు, పోస్టుమార్టమ్ నివేదికలో మరణానికి గల కారణాన్ని పోషకాహార లోపంతో వచ్చిన గుండె వైఫల్యం లేదా అతి సారవ్యాధి అని రాస్తారే తప్ప నేరుగా ఆకలిచావు అని నమోదు చేయరని రైట్టుపుడ్ క్యాంపియన్ వంటి సంస్థలు చెబుతున్నాయి. భారతదేశంలో జరుగుతున్న ఆకలిచావులను ఈ నేపథ్యంలో చూడాలి. ప్రపంచవ్యాప్తంగా పేదరికానికి, ఆకలి మరణాలకు పెట్టుబడి దారీ, భూస్వామ్య వ్యవస్థలే కారణం. ఈ వ్యవస్థల స్థానం లో నూతన ప్రజాతంత్ర వ్యవస్థలు, సోషలిస్టు వ్యవస్థలు ఏర్పడినప్పుడే పేదరికం తొలిగి ఆకలిమరణాలు ఆగుతాయి. అందుకు వెనుకబడిన దేశాల, పెట్టుబడి దారీ దేశాల ప్రజలు నేటివ్యవస్థల మార్పు కోసం ఉద్యమించాలి.**

బొల్లిముంత సాంబశివరావు

పెట్టుబడిదారీ వ్యవస్థ పేదలను, ధనికులను సృష్టిస్తుంది. కష్టజీవులు, కార్మికులు ఉత్పత్తుల ద్వారా సంప దలు సృష్టించినా దానిపై హక్కు లేక పేదరికంలో మగ్గుతున్నారు. ఏ కష్టం చేయని వారు సంపన్నులు అయ్యారు. పెట్టుబడిదారులుగా మారిన వీరు అనేక దేశాల్లో పారిశ్రామిక రంగాన్ని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. వెనుకబడిన దేశాల్లో సేద్యం చేయని భూకామందుల వద్ద భూమి పోగుబడి ఉంది. సేద్యం చేసే గ్రామీణ పేదలు భూమికి దూరం అయ్యారు. ఈ నేపథ్యంలోనే ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రమైనాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన ఆర్థిక వ్యత్యాసాల వల్ల మొత్తం ప్రపంచ సంపదలో 10 శాతం కుబేరుల వద్ద 75శాతం సంపద ఉంటే, 90 శాతం ప్రజల వద్ద 25శాతం సంపద మాత్రమే ఉంది. అత్యంత ధనవంతులైన 1శాతం కుబేరుల వద్ద37శాతం పైగాసంపద పోగుబడి ఉంది. ప్రపంచంలో 100 బిలియన్ల అమెరికా డాలర్ల కంటే ఎక్కువ సంపద కలిగిన వారి సంఖ్య 15 శాతానికి చేరింది. ఎలన్మస్క్ 936 బిలియన్ యుఎస్ డాలర్లు, లారీఫేజ్ 299 బిలియన్ డాలర్లు, సెర్గీబ్రిన్ 275 బిలియన్ డాలర్లు, మైఖేల్డిల్ 229 బిలియన్ డాలర్లు, జెఫ్బెజోస్ 225 బిలియన్ డాలర్లతో ప్రపంచటాప్ ఐదుగురు కుబేరులుగా ఉన్నారు. భారతదేశంలో అత్యధిక ఆర్థిక అస, మానతలు ఉన్నట్లు, ప్రపంచ అసమానతల నివేదిక తెలిపింది. టాప్ 10శాతం కుబేరుల వద్ద దేశం మొత్తం సంపదలో 65శాతం ఉండగా, వీరిలో ఒకశాతం అత్యంత కుబేరుల వద్ద ఏకంగా 40శాతం సంపద ఉంది. దిగువ 50 శాతం ప్రజల వద్ద కేవలం 15శాతం సంపద ఉంది. పెట్టుబడిదారీ విధానాల ఫలితంగా ప్రపంచంలో ఆర్థిక అసమానతలతో పాటు సంపద కొద్ది మంది వద్ద పోగుబడి ఉండటం వల్ల ప్రపంచంలో పేదరికం తీవ్రంగాఉంది. ప్రపంచజనాభాలోని 70కోట్లకు పైగా ప్రజలు అంతర్జాతీయ దారిద్ర్యరేఖ ప్రకారం తీవ్ర పేదరికంలో ఉన్నారు.రోజుకి మూడుఅమెరికా డాలర్లు, భారతీయ కరెన్సీలో 250 రూపాయల కంటే తక్కువ ఆదాయంతో జీవించే వారిని తీవ్ర పేదరికంలో ఉన్నవారిగా అంతర్జాతీయ సంస్థలైన ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంక్ పరిగణిస్తున్నాయి. సబ్సహారా ఆఫ్రికా ప్రాంతం అత్యంత పేద ప్రాంతం. అక్కడ సుమారు 4కోట్ల, 30 లక్షల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. భారత దేశం పేద జనాభా సంఖ్యరీత్యా ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది.దేశంలో 23.4 కోట్ల మంది తీవ్ర పేదరికంలో మగ్గుతున్నారని ఐక్యరాజ్య సమితి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రోజు వారి ఆదాయం మూడు డాలర్లకన్నా తక్కువ ఉన్నవారిని ప్రామాణికంగా తీసుకుంటే, భారతదేశంలో తీవ్రపేదరికంలో ఉన్నవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. దేశం రోజు మూడు డాలర్ల ఆదాయం అత్యధిక ప్రజలకు లభించకపోవడమే అందుకు కారణం. భారతదేశంలో, పాకిస్థాన్, ఇథియోపియా, నైజీరియా దేశాలకన్నా పేదలు ఎక్కువగా ఉన్నారు. సంపద వ్యత్యాసాల వల్ల ప్రజలు




పేదరికంలో మగ్గుతూ ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 90 లక్షల మంది ప్రజలు ఆకలితో మరణిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ,వివిధ అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ఈ గణాంకాలు నమోదు అయ్యాయి. ప్రతిరోజు ప్రపంచవ్యాప్తంగా 25 వేల మంది ఆకలి వల్ల మరణిస్తున్నారు. యుద్ధాలు, అంతర్గత కలహాలు నడుస్తున్న దేశాల్లోనే ఆకలి వల్ల వేలాది మంది చనిపోతూన్నారని ఆక్స్ఫాం నివేదిక పేర్కొంది. ఆకలి మరణాలలో మూడింట ఒకవంతు (30లక్షల మంది ) 5 సంవత్సరాలలోపు ఉన్న చిన్న పిల్లలే ఉంటున్నారు. తీవ్ర ఆహార లోపం వల్ల పిల్లల రోగనిరోధక శక్తి క్షీణించి, సాధారణ వ్యాధులు కూడా ప్రాణాంతకం అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 73.3కోట్లమంది ప్రతిరోజు రాత్రిపూట ఆకలితో నిద్రపోతున్నారు.సూడాన్, పాలస్తీనా(గాజా) దక్షిణ సూడాన్ ,హైతీ, మాలి వంటి దేశాల్లో కరవు పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయి. 2030 నాటికి ఆకలి రహిత ప్రపంచం అనే ఐక్యరాజ్యసమితి లక్ష్యం నెరవేరేపరిస్థితి కనుచూపు మేర కల్పించడంలేదు. భారతదేశంలోతాజా గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రపంచవ్యాప్తంగా సర్వేచేసిన123 దేశాల్లో, భారతదేశం ఆకలిసూచిలో 102వ స్థానంలోఉంది. మన దేశానికి లభించిన 25.8స్కోర్తో ఆకలి పోషకాహార లోపం తీవ్రతను తీవ్రమైనదిగా వర్గీకరించారు. దేశ జనాభాలో అవసరమైన క్యాలరీల ఆహారం లభించని వారు 12 శాతంగా ఉన్నారు. 5 ఏళ్లలోపు పిల్లల్లో వయస్సుకు తగ్గ ఎత్తులేని పిల్లలు32.9శాతంగా ఉన్నారు. ప్రతి ముగ్గురులో ఒకరు ఎత్తుకు తగ్గ బరువు లేరు. తీవ్రపోషకాహార లోపం ఉన్నపిల్లలు 18.7శాతం ఉన్నారు. ఎన్ఎఫ్హెచ్ఎస్ నివేదిక ప్రకారం దేశంలో 50 మంది గర్భిణీలుస్త్రీలు, కౌమార బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఐక్య రాజ్యసమితి నివేదిక ప్రకారం భారతదేశంలో తీవ్ర పోషకాహార లోపం వల్ల 5సంవత్సరాలలోపు పిల్లలు ఏటామూడు లక్షలకుపైగా చనిపోతున్నారు.భారతదేశంలో ప్రత్యక్షంగా ఆకలిలేక అన్నం లేక చనిపోయిన వారి మరణాలు నమోదు కాలేదని, దేశంలో ఆకలి చావులు లేవని కేంద్రప్రభుత్వం చెబుతున్నది. కాని అంతర్జాతీయ సంస్థలు (యునిసెఫ్, ఎఫ్ఎఒ) వివిధ స్వచ్ఛంద సంస్థల పరిశోధనల ప్రకారం తీవ్రమైన పోషకాహార లోపం వల్ల ఏర్పడే అనారోగ్య సమస్యల వల్ల భారత్లో ఏటా లక్షలాది మంది మరణిస్తున్నారు. భారత దేశంలో జరిగే ఆకలి మరణాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కప్పి పుచ్చుతున్నాయని అనేక మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవ్యక్తి ఆకలితో మరణించినప్పుడు, పోస్టుమార్టమ్ నివేదికలో మరణానికి గల కారణాన్ని పోషకాహార లోపంతో వచ్చిన గుండె వైఫల్యం లేదా అతి సారవ్యాధి అని రాస్తారే తప్ప నేరుగా ఆకలిచావు అని నమోదు చేయరని రైట్టుపుడ్ క్యాంపియన్ వంటి సంస్థలు చెబుతున్నాయి. భారతదేశంలో జరుగుతున్న ఆకలిచావులను ఈ నేపథ్యంలో చూడాలి. ప్రపంచవ్యాప్తంగా పేదరికానికి, ఆకలి మరణాలకు పెట్టుబడి దారీ, భూస్వామ్య వ్యవస్థలే కారణం. ఈ వ్యవస్థల స్థానం లో నూతన ప్రజాతంత్ర వ్యవస్థలు, సోషలిస్టు వ్యవస్థలు ఏర్పడినప్పుడే పేదరికం తొలిగి ఆకలిమరణాలు ఆగుతాయి. అందుకు వెనుకబడిన దేశాల, పెట్టుబడి దారీ దేశాల ప్రజలు నేటివ్యవస్థల మార్పు కోసం ఉద్యమించాలి. ●

# కొవిడ్‌కు దారేది?

కొవిడ్ వచ్చేసిందనో, వచ్చేస్తోందనే భయపడదామా? ముందు జాగ్రత్తలతో అప్రమత్తమవుదామా? అంటే ఎంతో మంది రెండో దానికే ప్రాధాన్యత నిస్తారు. కానీ తెలిసీ తెలియని పరిస్థితుల్లో మరెంతో మంది అంతర్లీనంగా భయపడి వణికిపోతుంటారు. ఏదిఏమైనా 'కోవిడ్' భూతం మళ్లీ నేరుగానో మరో రూపంలోనో మానవాళి మధ్యన చేరినట్లే ఉంది. దేశవ్యాప్తంగా దాదాపు 500 కేసులకిపైగా కోవిడ్ పాజిటివ్ వచ్చినా అక్కడక్కడ ఆ లక్షణాలున్న రోగాలు బయటపడుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దాదాపు కోవిడ్ రోగ లక్షణాలకు దగ్గరగా ఉన్నా కొన్ని లక్షణాలు రోగులను భయభ్రాంతుల్ని చేస్తున్న సమాచారం విస్తృతంగా ఉంది. అలా అని కరోనా వ్యాప్తి జరగదని కానీ, జరుగలేదనీ కానీ ధృవీకరించే సమాచారమేదీ అందుబాటులో లేదు. ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో కోవిడ్ పరీక్షలు చేసినప్పుడు కొంత మందికి పాజిటివ్ రావడంతో ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. నెల్లూరు ఎన్టీఆర్ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడంతో ఆ ప్రాంతంలో కొంత అలజడి బయలుదేరింది. మళ్లీ మాస్కల దుమ్ము దులుపుతున్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండల నిడిగుంట పాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు కేన్సర్ చికిత్స కోసం పుదుచ్చేరి వెళ్లగా అక్కడ కరోనా సోకినట్లు వైద్యులు ధృవీకరించారు. అతని బంధువులందరికీ 'నెగిటివ్ అని తేలడంతో కొద్దిగా ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడు నివాసం 13 ఏళ్ల బాలిక 'కిడ్నీ' వ్యాధితో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా ఆమెకూ 'కోవిడ్ పాజిటివ్' ధృవీకరణతో ఆ రాష్ట్రమంతా అప్రమత్తమైంది. సాధారణ వ్యక్తులెవరికీ 'కోవిడ్' పాజిటివ్ రాకపోవడం మంచిదైంది. లేకుంటే సాధారణ జనంలో అనవసరంపు ఆందోళనలు మొదలయ్యేవి. ఆంధ్ర రాష్ట్రంలో జూన్ 26 నుంచి జులై 19 మధ్యకాలంలో 19 కోవిడ్ కేసులు చికిత్సలో ఉండగా నాలుగు మరణాలు నమోదయ్యాయి. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి లక్షణాలున్న ఒక్క కేసుకూడా నమోదవలేదు. దాంతో తెలంగాణ ప్రభుత్వం కాస్త ఊపిరి పీల్చుకుంది. కోవిడ్ లక్షణాలు స్వల్పంగా కనిపించినా హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారెవరికీ పాజిటివ్ రాలేదు. తీవ్రమైన దీర్ఘకాల వ్యాధులు ఉన్నవారే వ్యాధి నిరోధక శక్తి తగ్గి కోవిడ్ బారినపడ్డారు. ఈ కారణాల చేత మరో కోవిడ్ 'వేవ్'వచ్చిందనే ఆరోపణలను వైద్యులు కొట్టి పారేస్తున్నారు. అయితే వర్షాకాలం రీత్యా జ్వరాలు, ఫ్లూ, దగ్గు, జలుబు వంటి సాధారణ అనారోగ్య లక్షణాలపై ఆస్పత్రులకు వెళ్తున్నారు. తొలి దశలోనే వ్యాధినిరోధకత చికిత్స తీసుకోవడం మంచిది. కోవిడ్ వైరస్‌లో స్వల్ప మ్యూటేషన్‌ల కారణంగా క్లస్టర్లుగా మాత్రమే కోవిడ్ వ్యాప్తిని గుర్తిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఈ కేసుల విస్తృత వ్యాప్తి నేపథ్యంలో ఒమిక్రాన్ సబ్‌వేరియంట్‌పై నిర్ధారణ జరిగాకనే వైద్యాధికారులు వాటి నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపారు. మహారాష్ట్ర, కేరళ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోనూ కోవిడ్ కేసులు పెరగడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. కానీ ప్రజల్లో కోవిడ్ నాలుగో వేవ్‌ను చూడబోతున్నామా?అనే ఆందోళనతో ఉన్నారు. అదేంకాదు కానీ కేవలం స్కాటర్డ్ ట్రాన్స్‌మిషన్‌గా శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. మహారాష్ట్రలో 48కేసులు ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసులున్నాయి. చాలా కేసులు ఇతర వ్యాధులకు టెస్ట్ చేస్తున్న సందర్భాల్లో బయటపడినవే. ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులన్నీ ఏరుగ్మతకు శస్త్రచికిత్స చేయాల్సినా ఆ సందర్భంలోనూ కోవిడ్ టెస్ట్ తప్పనిసరి చేస్తున్నారు. అలాబయట పడినవే ఈ కొన్నీ కూడా. కోవిడ్‌కు పునఃప్రవేశం లేదని చెప్తున్న శాస్త్రజ్ఞులు సైతం వాటి నుంచి వచ్చిన కొత్త వేరియంట్‌లకు అవే లక్షణాలున్నా కరోనా వైరస్‌అంతప్రమాదం కాదని చెబుతున్నారు. ఈ మాట కోవిడ్ రోగులకు వర ప్రసాదంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 73దేశాల్లో పాజిటివిటీ రేటు 11శాతానికి చేరినట్లు లెక్క. ఇప్పటికీ ఆలస్యం లేదు. జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. సాధారణ జ్వరాలే అయినా చికిత్సకు వెళ్లాలి. వృద్ధులు డయాబిటిస్, బి.పి, గుండె జబ్బులున్నవారు 'మాస్క్' ధరించడం అలవాటు చేసుకోవాలి. సర్వైలెన్స్, జీనోమ్ సీక్వెన్సింగ్‌ను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్‌లు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లను సిద్ధంగా ఉంచుకోవాలి.మాస్క్, శానిటైజర్, టెస్ట్ అత్యవసరం. కోవిడ్‌తో కలిసి బతకడం ఇంత క్రితమే అలవాటయింది. కనుక అదేదారిలో ఈసారి కూడా వైద్యచికిత్సలు, సామాజిక జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో కోవిడ్ బాధితులకు తర్వాత క్రమంలో డెంగీ లక్షణాలు వస్తుంటాయని కూడా కొన్ని అధ్యయనాలున్నాయి. ఈకారణం చేత డెంగీ వ్యాధిసోకిగా నాలుగు రోజులకు తగ్గిపోతుందిలే! అని అశ్రద్ధ చేసేందుకు వీలులేదు. దేశంలో డెంగీ వ్యాధి నివారణకు 'క్యూడెంగా' అనే కొత్త టీకా త్వరలో భారత్‌లో విడుదల కాబోతోంది.జపాన్‌కు చెందిన తకేడా బయోఫార్మస్యూటికల్స్ సేవలు అభినందించాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా డెంగీ కేసుల్లో మూడోవంతు భారత్‌లోనే నమోదవుతున్నందున భారతీయులకీ టీకా వర ప్రసాదమే. మనదేశంలో ఆమోదం పొందిన తొలి డెంగీ టీకాను స్వాగతిద్దాం. ఒక్కోసారి పుట్టిన వైరస్ మళ్లీమళ్లీ సోకే అవకాశం ఉన్నందున వ్యాధి నివారణ కన్నా వ్యాధి నిరోధకత మేలు. సింగపూర్, ఆగ్నేయాసియా దేశాలలో విస్తృతంగా ఉన్న ఒమిక్రాన్ ఆర్ఎఫ్ 5 వేరియంట్ కోవిడ్ వైరస్ భారత్‌లోకి ఎలా ప్రవేశించిందో భారత్ పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

నిన్నటి తప్పుల గురించి కానీ రేపు రాబోయే కష్టం గురించి కానీ దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.




యం.కె. గాంధీ

నేర్చుకున్నదాంట్లో ఒక గ్రాము ఆచరణలో పెట్టేందుకు పది గ్రాముల ఇంగిత జ్ఞానం అవసరం.



ఆల్బర్ట్ కామూ

## ప్రజావాక్కు



### అడుగు అంతరిక్ష విజయం వైపు

భారత్‌లో స్కైరూట్ ఏరోస్పేస్ అన్న ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో తొలి రాకెట్, విక్రమ్1 ప్రయోగం విజయవంతం కావడం ముదావహం. అటూ ఇటుగా పాతికేళ్ల వయస్సు యువశాస్త్రవేత్తల బృందం సాధించిన ఈ ఘనత భారత్ అంతరిక్ష రంగంలో కీలక మలుపు. 2020లో రోదసీ ప్రయోగాల,పరిశోధనల రంగంలోప్రైవేట్‌సంస్థలకు చోటిచ్చేలా భారత్ తన విధానాన్ని మార్చుకుంది. దేశ భద్రత తదితర కారణాలతో ప్రభుత్వానికే పరిమితమైన ఈ రంగంలోఇస్రో ఎన్నోవిజయాల్నినమోదు చేసినా,ప్రపంచ మార్కెట్లో మరింత దూసుకుపోయే అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి ప్రైవేట్‌భాగస్వామ్యం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. అంతరిక్ష వాణిజ్యంలో దేశం వాటా కేవలం రెండు శాతమేఉండడం,వరుస విజయాలతో,వేరే దేశాలతోపోల్చినపుడు తక్కువఖర్చుతో విజయాల్ని నమోదు చెయ్యడం గమనంలోకి తీసుకుని ఎదిగే అవకాశాల్ని గుర్తించింది. ఇప్పుడు ఆదిశగా జరుగుతున్న ప్రయత్నాల్లో మొదటి విజయం లభించింది. అమెరికా, చైనాల సరసన మూడో దేశంగా నిలిచింది.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్ రోడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పైనుండి బండ రాళ్ళు కిందికి పడే అవకాశం ఉంది. ఈ ఘాట్‌రోడ్‌లో నిత్యం బస్సులు లక్షల ప్రయాణీకుల్ని తీసుకువెళ్తాయి. ఏడాది పాటు ట్రాఫిక్ ఉంటుంది. దశాబ్ద కాలం నుండి ఈ ఘాట్ రోడ్, పైన కొండలు,మలుపులు పూర్తిగా చూసి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణులు ఒక పూర్తి అభిప్రాయం ఇచ్చారు గనుక అప్పటినుండే ప్రమాద సూచన ఉన్నట్లు.నిపుణులు సూచించే రక్షణ మార్గాలు పక్కగా ఇంజనీ రింగ్ విభాగం చర్యలు చేపట్టాలి.

- బి. మేఘానథం, విశాఖపట్నం

### ఆలోచించాల్సిందే..

పాలన ఎంత బాగా చేసినా ప్రజలకు ఎన్ని సంక్షేమ పథకాలు అందించినాకొంతకాలానికి ప్రభుత్వాలపై వ్యతిరేకత రావటం సహజం. ప్రజావ్యతిరేకత కారణంతోనే రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారుతుంటాయి.ప్రభుత్వాలపై వ్యతిరేకతవచ్చినా పాలకులు పట్టించుకోకుండాప్రజల సమస్యలను పరిష్కరిస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది.

- ఎమ్. జగన్నాథం, హైదరాబాద్

### మధుర జ్ఞాపకాలు

ఒకప్పుడు ఫోటోదిగాలంటే గంటల కొద్దీగామున్తాబయి స్టూడియోకు వెళ్లేవాళ్లం. సంబరం అంతలా ఉంటుంది మరి. నేడు దాదాపు అందరి దగ్గర అన్ని సౌకర్యాల గల స్మార్ట్‌ఫోన్ ఉంటుంది. దాంతో ఎన్ని కావాలంటే అన్నిఛాయాచిత్రాలు, వీడియోలు తీసుకోవచ్చు. బ్లాక్ అండ్ వైట్ నుంచి అనతికాలంలో ప్రగతి సాధిస్తున్న వైనంఅబ్బురపరుస్తుంది. ఏదిఏమైనప్పటికీ అప్పటి నుంచి ఫోటలకున్న విలువ అంతా ఇంతా కాదు. తిరునాళ్లలో జాతరల్లో అంతే కలియతిరిగి, ఫోటో తీయించకపోతే ఏదో వెలితిగా ఉంటుందంటే అతిశయోక్తికాదు. పాత జ్ఞాపకాల పెన్నిది అలనటి ఛాయాచిత్రాల, ఆల్బమ్‌ను చూస్తున్నంత సేపు ఎన్నో మధుర బంధాలు మాటలకందనిది, గుండెల్లో కూడుకట్టుకుంటాయి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### నైతిక విలువలను నేర్పించాలి

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఎల్కేజీ యూకేజీ నుండి డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సోమవారం మధ్యాహ్నం విద్యార్థులకు నైతిక విలువల గురించి ఒక ప్రత్యేకమైన క్లాస్ బోధించాలి. విద్యార్థులను దండించడం, క్రమశిక్షణ నేర్పడం చాలా అవసరం. ఇది లేకపోవడం వలనసమాజంలోచాలా ఇబ్బందులుఎదురవుతున్నాయి. గురుకుల జూనియర్‌కళాశాలలో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. కొన్నిచోట్ల స్మోకింగ్ మద్యం సేవించడం వ్యవసాయ బావులలో స్నానాలకు వెళ్లడం జరుగుతుంది. హౌస్ మాస్టర్ పర్మిషన్ లేకుండా బయట జులాయిగా తిరుగుతున్నారు. గురువులను గౌరవించడం, పూజించడం, నమస్కరించడం, సీనియర్లను గౌరవించడం,జూనియర్లను ప్రేమించడం, కుటుంబ సభ్యులను,పెద్దలను గౌరవించడం వంటి నైతిక విలువలను విద్యార్థులకు తప్పనిసరిగా నేర్పించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు

పాలకుర్తి జనగామ దారిలో ప్రయాణం చేస్తుంటే కలవరం అవుతున్నది. వాన చినుకుల మీద ఆధారపడి నాట్లు వేసిన భూములు కొన్ని బోరుబావులపైన ఆధారపడి వేసిన నాట్లు ఇవన్నీ దేనికి సంకేతం. మునుపటి బీడు తెలంగాణకే. ఇందులో ఎంత మాత్రం సందేహం లేదు. తెలంగాణ విశిష్ట పంటలవైపు రైతులను మళ్లించడం కనీసం ఒక అర ఎకరమైనా మునగా వైపు మళ్లించడం చేయాలి.ఏడాది పాటు ఉపాధి హామీ స్థిరీకరణ సాధ్యం అవుతుంది. అంతే కాదు గ్రామీణా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా ఉంటుంది.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# నీటి ప్రాజెక్టులతోనైనా రైతుల కష్టాలు తీరుతాయా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉండడం వలన వ్యవసాయరంగంపై ఆధారపడిన రైతాంగం వర్షం లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉందనిపిస్తుంది. ఈ క్రమంలో నీటివనరులపై ఆధారపడాల్సి వచ్చినా బోర్లు చెరువులు కుంటల్లో నీరు అడుగంటి పోవడం నీటి కరువు తలపించే విధంగా ఉన్నందున వ్యవసాయ రంగంలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యగా ఉంటుంది. వర్షాభావం అనుకున్న స్థాయిలో లేకపోవడం ఒక ఎత్తుఅయితే, ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావం అంతగా వ్యవసాయ రంగంపై ప్రభావం చూపకపోవడం మరోఎత్తుఅవుతున్నది. దీనికి తోడు సూపర్ ఎల్‌నినో వాతావరణ ప్రభావం కూడా ఉన్నట్టు చర్చ జరుగుతోంది. తద్వారా రైతులు జూన్ మాసంలో ఖరీఫ్ పంటలు వేసుకునేందుకు పెట్టుబడి పెట్టి పొలాన్ని చదును చేసి విత్తనాలను నాటే సమయంలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడం ముఖ్యంగా వరి పొలానికి కావలసిన నీరు తగినంత నిలువ లేకపోవడం వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతాంగానికి ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం నిరాశను కలిగిస్తున్నాయి. వరి, మొక్కజొన్న పత్తి లాంటి వాటిని పండించడానికి జూన్ మాసం నుండి అనుకూలంగా ఉన్నప్పటికీ, ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండడం ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపార వాణిజ్య పంటలను పండించే రైతులు సాగు నీరు లేక వ్యవసాయ సేద్యానికి అనుకూలంగా లేని పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణ వర్షపాతం కూడా లేకపోవడం వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపెడుతున్నాయి. సాగు నీటితో పాటు ప్రజలకుసరిపడా త్రాగునీరు లేకపోవడం నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతుండడం విచారకరం. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ పంటలను పండించాలి అనుకున్న రైతులు సంకోచిస్తున్నారు. ఇప్పటికే వరినాట్లు వేసి వర్షంకోసం ఎదురు చూస్తున్నరైతులు వేరేపంటలు వేయడానికి ముందుకుపోలేకపోతున్నారు. మొక్కజొన్న పత్తిలాంటి పంటలను సాగుబడి చేయాలన్నా కావలసిన భూగర్భనీటినిల్వలు ఎండిపోతుండంతో ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ఏ పంటను వెయ్యాలోఅర్థంకాని పరిస్థితిలో కొందరు రైతులు సందిగ్ధంలో ఉంటున్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సైతం నీటి ఎద్దడి నెలకొని బావులు చెరువులు కుంటలు ఎండి పోవడం వలన త్రాగు నీటితో పాటు సాగునీరు కూడా ఇప్పట్లో అనుకూలంగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన నీటి ప్రాజెక్టుల మీద రైతులతో పాటు ప్రజానీకంకొండంత ఆశలు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా శ్రీశైలం నాగార్జున సాగర్ కాళేశ్వరం లాంటి భారీనీటి ప్రాజెక్టులు తెలంగాణలో ఉన్నప్పటికీ,దేవాదుల ప్రాజెక్టు తప్పమిగతా ప్రాజెక్టుల నుండి మరింతగా జలాశయాలు విడుదల కావలసి ఉంది అనే చర్చజరుగుతుంది. అయితే కరవు పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రాజకీయాల కతీతంగా కారణాలేవైనా ఇంతకాలం నీటిని ఎత్తిపోయలేని కాళేశ్వరం ప్రాజెక్ట్ లోపాలను సరిదిద్ది అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వాల ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నవారు లేకపోలేదు. త్వరితగతిన పనులు సఫలమైతే త్రాగునీటికి సాగునీటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండగలదని అభిప్రాయపడుతున్న వారులేకపోలేదు. ప్రస్తుతం దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తెలంగాణలో కొంతమేర సహకరిస్తుందని అనుకున్నప్పటికీ గత రెండు మూడుసంవత్సరాల నుండి కారణాలేవైనా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు త్రాగునీరు సాగునీరును అందించలేని పరిస్థితిలోఉండడం గమనార్హం. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు తెలంగాణ ప్రాంతానికి విరివిగా నీరు అందించింది అని చెప్తున్నారు కానీకాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతుల గురించి నిపుణులతో లోపాలను సవరించే విధానంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండడం కొంత ఆశాజనకంగా కనబడుతుంది. ఒకవేళ కరవుపరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఇలానే కొనసాగితే ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని ప్రాజెక్టులనుండి వీలైనంత త్వరగా నీటిని ఎత్తిపోతల ద్వారా తెలంగాణకు కరవు నుండి విముక్తి కలిగించే దిశగా రాజకీయాల కతీతంగా ప్రభుత్వాలు కూడా సానుకూలంగా ఆలోచించడం శుభ పరిణామం. రాష్ట్రంలో ఎక్కువ శాతం ప్రజలువ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు అలాంటి వ్యవసాయాధారిత రైతాంగానికి ఖరీఫ్,రబీ కాలాలు చాలా ముఖ్యమైనవి వర్షాకాలంలో అంత జూన్ మాసం నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభదశ నుండి పండించవలసినపంటలు అవసరమైన నీరులేకపోవడంతో వర్షాభావం తక్కువ ఉండడంతో కొంతమంది నాటువేయడానికి కూడా వెనుకంజ వేస్తున్నారు.వేసిన విత్తనాలు సరిగామొలకెత్తని పరిస్థితు లు నెలకొంటున్నాయి. ఏది ఏమైనప్పటికీ రైతులకు ఖరీఫ్ సీజన్ జూన్‌మాసం నుండి ఆగస్టు వరకు వ్యవసాయానికి అనుకూలం అయినప్పటి కనీసంసెప్టెంబర్ నెల వరకైనా కరవుపీడిత ప్రాంతాల్లో పంటలు పండించాలంటే అవసరమైన పూర్తిసాగునీరు అందాల్సి ఉంటుంది. తద్వారా ఖరీఫ్ పంటలను రైతులు చేయగలిగితే ఆహార ఉత్పత్తులతో రైతులకు లాభసాటిగా ఉండడమే కాకుండా ప్రజలకు ఆహారధాన్యాల కొరత సమస్య తీరిపోతుందేమో అయితే అక్టోబర్ డిసెంబర్ మధ్యలో రబీసీజన్‌ప్రారంభమవుతుంది. కాబట్టి పూర్తిస్థాయిలో ఈలోపే సాగునీరు తాగునీరు అందాల్సిన అవసరం ఉంటుంది. తద్వారా రైతులు కనీసం రబీ సీజన్‌లలోనైనా పంటలను పండించేందుకు సన్నద్ధంగా ఉండగలుగుతారు. అందుకు వర్షభావం కూడా అనుకూలంగా ఉండాలి లేకుంటే ప్రాజెక్టులనుండివచ్చేసాగునీరైనా వ్యవసాయ రంగానికి అందేలా చూడాలి. ●

# హైడ్రోజన్ రైళ్లు పట్టాలపై కొత్త మలుపు

తిప్పర్తి శ్రీనివాస్

భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టానికి నాంది పలికింది. శతాబ్దాలుగా దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి వెన్నెముకగా నిలిచిన రైల్వే వ్యవస్థ ఇప్పుడు పర్యావరణ పరిరక్షణ దిశగా మరింత ముందడుగు వేస్తోంది. దేశంలో తొలిసారిగా హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైలును ప్రవేశపెట్టడం ద్వారా భారత రైల్వే రంగం సాంకేతిక పరివర్తనలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇది కేవలం ఒక కొత్త రైలు ప్రారంభం మాత్రమే కాదు, భవిష్యత్‌లో స్వచ్ఛమైన, స్థిరమైన రవాణా వ్యవస్థ నిర్మాణానికి దిశానిర్దేశం చేసే పరిణామం. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం వంటి సమస్యలు మానవాళికి పెద్ద సవాళ్లుగా మారాయి. రవాణా రంగం కార్బన్ ఉద్గారాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అన్వేషణ వేగవంతమైంది. సౌర, పవన విద్యుత్‌లతో పాటు హైడ్రోజన్ ఇంధనం భవిష్యత్తు శక్తి వనరుగా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో భారత రైల్వే హైడ్రోజన్ సాంకేతికతను స్వీకరించడం పర్యావరణ అనుకూల అభివృద్ధి వైపు ఒక సాహసోపేతమైన అడుగుగా భావించాలి. హైడ్రోజన్ రైళ్ల ప్రత్యేకత ఏమిటంటే ఇవి సంప్రదాయ డీజిల్ ఇంజిన్ల మాదిరిగా కాలుష్యకరమైన ఉద్గారాలను విడుదల చేయవు. హైడ్రోజన్ ఇంధన కణాలు (ఫ్యూయల్ సెల్స్) ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసి రైలును నడిపిస్తాయి. ఈ ప్రక్రియలో ప్రధాన ఉపఉత్పత్తిగా నీటి ఆవిరి మాత్రమే విడుదల అవుతుంది. ఫలితంగా వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వంటి హానికర వాయువుల మోతాదు తగ్గుతుంది. ఇది పర్యావరణ పరిరక్షణకు మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించేందుకు కూడా ఉపయోగపడుతుంది. హైడ్రోజన్ రైలు మరో ముఖ్యమైన లక్షణం స్వయం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం. విద్యుత్ గ్రిడ్‌పై పూర్తిగా ఆధారపడకుండా, రైలులోనే హైడ్రోజన్ ఆధారిత వ్యవస్థ ద్వారా అవసరమైన శక్తిని ఉత్పత్తి చేసుకోవడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా విద్యుదీకరణ పూర్తికాని రైల్వే మార్గాల్లో ఈ సాంకేతికత ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడంలో కూడా ఇది కీలక పాత్ర పోషించవచ్చు. ప్రపంచ స్థాయిలో పరిశీలిస్తే హైడ్రోజన్ రైళ్ల వినియోగం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. హైడ్రోజన్ ఆధారిత రైలును తొలిసారిగా ప్రవేశపెట్టిన దేశంగా జర్మనీ గుర్తింపు పొందింది. అక్కడ ఈ సాంకేతికతపై ప్రయోగాలు జరిపి పరిమిత స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చారు. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు కూడా హైడ్రోజన్ రవాణా వ్యవస్థపై



పరిశోధనలు కొనసాగిస్తున్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇది ఇంకా అభివృద్ధి చెందుతున్న రంగమే. ఈ పరిస్థితుల్లో భారత్ ఈ సాంకేతికతను స్వీకరించడం దూరదృష్టితో కూడిన నిర్ణయంగా చెప్పవచ్చు. అయితే హైడ్రోజన్ రైళ్ల ప్రయాణం సవాళ్ల రహితమైనది కాదు. హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా వంటి అంశాలు సాంకేతికంగా క్లిష్టమైనవి. ముఖ్యంగా పర్యావరణానికి అనుకూలమైన 'గ్రీన్ హైడ్రోజన్' ఉత్పత్తి చేయడానికి పునరుత్పాదక ఇంధనవనరుల వినియోగం పెరగాలి. ప్రస్తుతం హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు అధికంగాఉండటం కూడా ఒక ప్రధాన సవాలు. ఈ సమస్యలను అధిగమించేందుకు పరిశోధనలు, పెట్టుబడులు,ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యాలు అవసరం. భద్రత విషయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు అవసరం.హైడ్రోజన్ అత్యంత తేలికైన,మండేవాయువు కావడంతో దాని నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి. అయితే ఆధునిక హైడ్రోజన్ రైళ్లలో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంధన నిల్వ ట్యాంకులు, పీడన నియంత్రణ పరికరాలు,అత్యవసర రక్షణ వ్యవస్థలు వంటి సాంకేతిక పరిజ్ఞానాలు ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పిస్తాయి. భారతదేశం 2030 నాటికి కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ లక్ష్య సాధనలో రైల్వే రంగం కీలక పాత్ర పోషించాల్సిఉంటుంది. ఇప్పటికే విద్యుదీకరణ, సౌర విద్యుత్ వినియోగం, శక్తి సామర్థ్య పెంపు వంటి చర్యలు చేపడుతున్న భారతీయ రైల్వే ఇప్పుడు హైడ్రోజన్ సాంకేతికతను కూడా స్వీకరిస్తోంది. ఇది దేశం గ్రీన్ ఎనర్జీ మార్గంలో సాగుతున్నదానికి నిదర్శనం. అయితే హైడ్రోజన్ రైలును ప్రారంభించడం అంతిమ లక్ష్యం కాదు. అది ఒక ప్రారంభం మాత్రమే. ఈ సాంకేతికతను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. దేశీయంగా హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, ఖర్చులను తగ్గించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అప్పుడే హైడ్రోజన్ రైళ్లు భారత రవాణా వ్యవస్థలో కీలక భాగంగా మారగలవు. భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు కాలానుగుణ మార్పులను స్వీకరించింది. ఆవిరి ఇంజిన్ల నుంచి డీజిల్, విద్యుత్ రైళ్ల వరకు సాగిన ప్రయాణం ఇప్పుడు హైడ్రోజన్ యుగంలోకి అడుగుపెడుతోంది. ఈ పరిణామం కేవలం సాంకేతిక అభివృద్ధి కాదు, పర్యావరణ బాధ్యతతో కూడిన జాతీయ సంకల్పానికి ప్రతీక. భవిష్యత్ భారతదేశం శుభ్రమైన శక్తిఆధారంగా అభివృద్ధి చెందాలంటే ఇలాంటివినూత్న ప్రయత్నాలు మరింత వేగం పుంజుకోవాలి. హైడ్రోజన్ రైలు భారత రైల్వేకు మాత్రమే కాదు, దేశ హరిత భవిష్యత్తుకు ఒక ఆశాకిరణం. సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి ఈ మూడు అంశాలను సమన్వయం చేసే మార్గంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. సరైన విధానాలు, నిరంతర పరిశోధనలు, ప్రజల సహకారంతో హైడ్రోజన్ విప్లవం భారత రవాణా రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే అవకాశం ఉంది. ●

# భారీ క్షమాభిక్షలకు ట్రంప్ చెక్

## 6 వేల దరఖాస్తులకు అమెరికా అధ్యక్షుడు తిరస్కృతి



**వాషింగ్టన్,జులై 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవం సందర్భంగా చరిత్రలోనే అతిపెద్ద క్షమాభిక్షలు మరియు శిక్షల తగ్గింపు ప్రకటిస్తారనే ఊహాగానాలకు ట్రంప్ ప్రభుత్వం తెరదించింది. అమెరికా న్యాయ శాఖ దాదాపు 6వేల క్షమాభిక్ష దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడైంది. న్యాయ శాఖ అంతర్గత రికార్డుల ప్రకారం, ఈ నెల ప్రారంభం నుంచే తిరస్కరణల ప్రక్రియ మొదలైంది. న్యాయ శాఖ నిర్దేశించిన సమీక్షా విధానాన్ని పూర్తిచేసి, సంవత్సరాలుగా క్షమాభిక్ష లేదా శిక్షల తగ్గింపు కోసం ఎదురుచూస్తున్న వేలాదిమందికి ఈ నిర్ణయం భారీ నిరాశ కలిగించింది. అమెరికా పర్డన్ అటార్నీ ఎడ్ మార్టిన్ ఈనెల 14 తేదీతో దేశవ్యాప్తంగా ఉన్న ఫెడరల్ ప్రాసిక్యూటర్లకు లేఖ పంపారు. అందులో పదోతేదీనుంచే దరఖాస్తుల తిరస్కరణలు ప్రారంభమైనట్లు పేర్కొన్నప్పటికీ, ఈ నిర్ణయానికి స్పష్టమైన కారణాలను వెల్లడించలేదు. లేఖలో అధ్యక్షుడికి రాజ్యాంగం కల్పించిన క్షమాభిక్ష అధికారాలను మాత్రమే ప్రస్తావించారు. అధ్యక్షుడు స్వయంగా దరఖాస్తులను తిరస్కరించవచ్చని లేదా న్యాయ శాఖ సిఫార్సుల ఆధారంగా తిరస్కరణలను అమలు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును అధ్యక్షుడు ట్రంప్ వ్యక్తిగతంగా పరిశీలించారా లేదా అనే విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పర్డన్ అటార్నీ కార్యాలయం విడుదల చేసిన తాజా వివరాల ప్రకారం, 300కుపైగా క్షమాభిక్ష దరఖాస్తులు, 5,600కు పైగా శిక్షల తగ్గింపు అభ్యర్థనలు తిరస్కరించారు. ఈ యేడాది ప్రారంభంలోనే మరో 530 క్షమాభిక్ష దరఖాస్తులను కూడా ప్రభుత్వం తిరస్కరించింది.

అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా సుమారు 250మందికి క్షమా భిక్షలు లేదా శిక్షల తగ్గింపులు ప్రకటించే అవకాశం ఉందని గత కొన్ని నెలలుగా వార్తలు వెలువడ్డాయి. అధ్యక్షుడు ట్రంప్ 20 మందికి కూడా తక్కువ సంఖ్యలో క్షమాభిక్షలు మాత్రమే ప్రకటించారు. క్లీన్ ఎయిర్ యాక్ట్ ఉల్లంఘన కేసులో శిక్షపడిన కొందరు, ఒక రాజకీయ విరాళదాతకూడా ఉన్నారు. అనంతరం స్పందించిన వైట్ హౌస్ అధికారి, 250 మందికి క్షమాభిక్షలు ఇవ్వాలనే అధికారిక ప్రణాళిక ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు. ఆ సంఖ్య కేవలం సిబ్బంది మధ్య జరిగిన అంతర్గత చర్చల్లో వచ్చిన ప్రతిపాదన మాత్రమేనని, తుది నిర్ణయం ఎల్లప్పుడూ అధ్యక్షుడు ట్రంప్ వ్యక్తిగతంగానే తీసుకుంటారని తెలిపారు.ట్రంప్ క్షమాభిక్ష విధానంపై విమర్శలుఈ తాజా తిరస్కరణలతో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న క్షమాభిక్ష విధానంపై మరోసారి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వాల మాదిరిగా న్యాయ శాఖ పూర్తి పరిశీలన ఆధారంగా కాకుండా, రాజకీయ మిత్రులు, మద్దతుదారులు లేదా ప్రభావశీలుల సిఫార్సులతో వచ్చిన వారికి ట్రంప్ తరచూ క్షమాభిక్షలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధ్యక్ష పదవిలోకి తిరిగి వచ్చిన అనంతరం ట్రంప్ తీసుకున్న అత్యంత కీలక క్షమాభిక్ష నిర్ణయం 2021 జనవరి 6న అమెరికా క్యాపిటల్ భవనంపై జరిగిన దాడి కేసులకు సంబంధించి దాదాపు 1,600 మందికి ఉపశమనం కల్పించడం. రాజకీయ ఒత్తిళ్లు లేదా లాబీయింగ్ కారణంగా క్షమాభిక్షలు ఇస్తున్నారన్న ఆరోపణలను ట్రంప్ ప్రభుత్వం గతంలోనే ఖండించింది. తాజా నిర్ణయాలపై న్యాయ నిపుణులు, ఖైదీలకు క్షమాభిక్షల కోసం సహాయం చేసే సంస్థలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ యేడాది ప్రారంభంలో వైట్ హౌస్ క్షమాభిక్షల సలహాదారు అలీస్ మేరీ జాన్సన్, రెండో అవకాశం పొందడానికి అర్హులైన వ్యక్తుల కేసులను యూనివర్సిటీ లా స్కూళ్లు, లీగల్ క్లినిక్‌లు పంపించాలని సిఫారసుచేసారు.



## సింధుజలాల ఒప్పందం పునరుద్ధరణ సాధ్యం కాదు..

### పాక్‌కు భారత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జులై 21:** తీవ్రవాదాన్ని పాకిస్తాన్ అంతం చేసేవరకు సింధు నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని భారత ప్రభుత్వ స్పష్టంచేసింది. పహల్గాంలో పాక్ తీవ్రవాదులు దాడులకు పాల్పడి, పలువురిని హతమార్చిన సంగతి తెలిసిందే. దీంతో పాక్ చర్యకు నిరసనగా పాకిస్థాన్‌తో 1960లో కుదుర్చుకున్న సింధు నదీ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఇండియా నుంచి పాకిస్తాన్‌కు సింధు నదీ జలాలు వెళ్లడం లేదు. ఈ కారణంగా పాకిస్తాన్ తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ విషయంలో ఇండియాపై పాకిస్తాన్ అనేక రకాలుగా ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. విమర్శలు, బెదిరింపులకు దిగుతోంది. ఈ విషయంలో ఇండియా తన వైఖరి మార్చుకోవడం లేదు. ప్రస్తుతం ఉన్న స్థితిలో సింధు నదీ జలాల ఒప్పందాన్ని కొనసాగించడం సాధ్యం కాదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు పాకిస్తాన్ తగిన చర్యలు తీసుకోనంత వరకు ఈ ఒప్పందం కొనసాగబోదని తెలిపాయి. తీవ్రవాదానికి మద్దతు ఇచ్చే చర్యలకు పాకిస్తాన్ స్వస్తిపలకాలని, ఈ విషయంలో పాక్ తగిన చర్యలు తీసుకున్న తర్వాత మాత్రమే సింధు నదీ జలాల ఒప్పందాన్ని పాటిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అది కూడా చర్చల అనంతరమే అని స్పష్టం చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఇదే సమయంలో పాకిస్తాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని పూర్తిగా రద్దుచేయాలనుకోవడం లేదని, తాత్కాలికంగా మాత్రమే ఒప్పందాన్ని నిలిపివేశామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక అంతర్జాతీయ ఒప్పందం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉందనిపిస్తే దాన్ని రద్దు చేసే హక్కు సార్వభౌమ దేశంగా ఇండియాకు ఉందని కేంద్రం అభిప్రాయపడింది. ఈ ఒప్పందం నిలిపివేత విషయంలో ఇండియాపై పాక్ దుష్ప్రచారం చేస్తోంది. తమ దేశంలో నీటి కొరతకు ఇండియానే కారణమని పాక్ ఆరోపిస్తోంది. ఇండియా నుంచి పాకిస్తాన్‌కు సరఫరా చేసిన నీటిని నిల్వ చేసుకుని వాడుకునే సామర్థం లేకపోవడం వల్లే ఆ దేశంలో ఈ పరిస్థితి తలెత్తిందని ఇండియా బదులిచ్చింది. అక్కడ నీటి నిల్వ సామర్థం తక్కువగా ఉండటం, లీకేజీలు, ఇతర ప్రాంతాల మధ్య ఉన్న వివాదాల కారణంగానే పాక్‌లో నీటి కొరత ఉందని ఇండియా చెపుతోంది.

## సెప్టెంబరు 15లోగా అమెరికాకు చేరుకోవాలి

### భారత్ విద్యార్థులకు ఇమ్మిగ్రేషన్ నిపుణుల సూచనలు

**న్యూఢిల్లీ,జులై 21:** అమెరికాలో చదువుతున్న భారత విద్యార్థులకు ఇమ్మిగ్రేషన్ నిపుణులు కీలక సూచన చేశారు. ప్రస్తుతం సెలవుల కోసం భారత్‌తో పాటు ఇతర దేశాల్లో ఉన్న ఎఫ్1 విద్యార్థి వీసాదారులు సెప్టెంబర్ 15లోగా అమెరికాకు చేరుకోవాలని సూచిస్తున్నారు. ఆ తేదీ నుంచి అమెరికా కొత్త వీసా నిబంధనలు అమల్లోకి రానుండటమే ఇందుకు కారణం. ఆ రోజున అమెరికాలోనే ఉండే విద్యార్థులకు ఇప్పటి వరకు అమల్లో ఉన్న డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ వెసులుబాటు కొనసాగుతుంది. ఆలస్యంగా వెళ్లేవారికి మాత్రం కొత్త నిబంధనలే వర్తిస్తాయి. కొత్త నిబంధనల ప్రకారం సెప్టెంబర్ 15 తర్వాత అమెరికాలోకి వెళ్లే విద్యార్థులకు చదువు పూర్తయ్యే వరకు ఉండే పాత వెసులుబాటు ఉండదు. వారి వివరాల్లో నిర్దిష్ట గడువును నమోదు చేస్తారు. గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు మాత్రమే బసకు అనుమతి ఉంటుంది. ఆ గడువు దాటితే మళ్లీ అనుమతి కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అయితే సెప్టెంబర్ 15 నాటికి అమెరికాలో ఉండి, ఎఫ్1 వీసా నిబంధనలు పాటిస్తున్న వారికి మాత్రం కోర్సు పూర్తయ్యే వరకు పాత విధానం వర్తిస్తుంది. ఈ వెసులుబాటు కూడా శాశ్వతం కాదని నిపుణులు చెబుతున్నారు. సెప్టెంబర్ 15 తర్వాత ఒకసారి అమెరికా నుంచి బయటకు వెళ్లి తిరిగి వస్తే కొత్త నిబంధనలే అమల్లోకి వస్తాయి. అలాగే నాలుగేళ్ల వరకు ఉండొచ్చని భావించడం కూడా తప్పేనని స్పష్టం చేస్తున్నారు. విద్యార్థి కోర్సు, వీసా నిబంధనలను ఎప్పటికప్పుడు పాటించినప్పుడే అమెరికాలో ఉండేందుకు అనుమతి ఉంటుంది.

## విడాకుల కేసుల్లో ఉద్యోగాన్ని ఆయుధంగా వాడుకోవద్దు

### యజమానులకు ఫిర్యాదు చేసే ధోరణి సరికాదు

### భరణం అవకాశాలను నాశనం చేస్తుంది

### సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జులై 21:** వైవాహిక న్యాయ పోరాటాలు పని ప్రదేశ కక్షలుగా మారడంపై భారత సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. విడాకుల ప్రక్రియల సమయంలో జీవిత భాగస్వాములు తమ భాగస్వాముల యజమానులకు అధికారికంగా ఫిర్యాదులు చేసే పద్ధతిని తీవ్రంగా విమర్శించింది. జస్టిస్ బి.వి. నాగారత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం, జీవిత భాగస్వామి ఉద్యోగ స్థితిని ఒక ఆయుధంగా ఉపయోగించడం స్వభావరీత్యా ప్రతికూల ఫలితాలనిస్తుందని వ్యాఖ్యానించింది. జీవనోపాధిని కోల్పోయేలా చేయడంవల్ల, నెలవారీ భరణం పొందడానికి లేదా ఒక న్యాయమైన ఆర్థిక పరిష్కారానికి చేరుకోవడానికి ఉన్న వాస్తవిక అవకాశాలన్నీ నాశనమవుతాయని హెచ్చరించింది. వైవాహిక వివాదానికి సంబంధించిన ఒక బదిలీ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. విడిపోయిన భార్య అయిన పిటిషనర్, తనపై దాఖలైన పరువు నష్టం కేసును అసోం నుండి ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు బదిలీ చేయాలని కోరారు. సైనిక సేవా నిబంధనలను నేరుగా ఉల్లంఘిస్తూ, తన భర్త ఒక సేవలందిస్తున్న భారత వైమానికదళ (ఐఎఎఫ్) అధికారి చట్ట విరుద్ధంగా ఒక స్వతంత్ర ప్రైవేట్ వ్యాపారాన్ని నడుపుతున్నారని ఆరోపిస్తూ, ఆమె న్యూఢిల్లీలోని భారత వైమానిక దళ (ఐఎఎఫ్) అధికారులకు ఒక అధికారిక వినతిపత్రంరాశారు. ఈ నేపథ్యంలోనే పరవు నష్టందావా దాఖలైంది. వాదనల మధ్యలో జోక్యం చేసుకున్న జస్టిస్ నాగారత్న, దేశవ్యాప్తంగా ఉన్న కుటుంబ న్యాయస్థానాలలో రోజురోజుకు పెరుగుతున్న తీవ్రమైన కుదింపు పద్ధతులపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు. చట్టపరమైన విడాకులు లేదా భరణం కోరడం ఒక చట్టబద్ధమైన హక్కు అయినప్పటికీ, వ్యక్తిగత వివాదాల్లోకి కార్పొరేట్ యాజమాన్యాన్ని లేదా సైనిక కమాండ్‌ను లాగడం తరచుగా క్రమశిక్షణా విచారణలు, సస్పెన్షన్‌లు లేదా పూర్తిస్థాయి ఉద్యోగ తొలగింపులకు దారితీస్తుందని కోర్టు నొక్కి చెప్పింది. ప్రధాన సంపాదకుడి ఆదాయ వనరును నాశనం చేయడంద్వారా, వ్యాజ్యదారులు తమకు తెలియకుండానే తమ సొంత ఆర్థిక భద్రతా వలయాన్ని దెబ్బతీసుకుంటారు. వ్యాజ్యం మరింత పరిపాలన, పౌర పోరాటాలుగా దిగజారకుండా, ఇరు పక్షాలు స్నేహపూర్వక పరిష్కారాన్ని అన్వేషించాలని ధర్మాసనం ఆదేశించింది. బాహ్య ఒత్తిడి వ్యూహాలకు బదులుగా, సంస్థాగత సంప్రదింపుల ద్వారా తన సమస్యలను పరిష్కరించుకునేలా భార్యకు సలహా ఇవ్వమని సుప్రీంకోర్టు న్యాయవాదికి సూచిస్తూ, ఈ మొత్తం వివాదాన్ని సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రానికి నివేదించింది.

## హనీమూన్ హత్య కేసు..

### తక్షణమే లొంగిపోండి

### సోనమ్‌కు సుప్రీం సూచన

**న్యూఢిల్లీ, జులై 21:** మేఘాలయలో హనీమూన్ సందర్భంగా తన భర్త రాజా రఘువంశీని హత్య చేశారన్న ఆరోపణలపై ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీకి మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేసేందుకు ఆలోచిస్తున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. ఆమె విడుదలను సమర్థిస్తూ మేఘాలయ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పిబి వరలేలతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. విచారణ కోర్టు కీలక ప్రాసిక్యూషన్ సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసేలోపు, సోనమ్ మధ్యంతరంగా లొంగిపోవాలని కోర్టు సూచించింది. ఆ తర్వాత, కేసు యోగ్యతల ఆధారంగా ఆమె బెయిల్‌ను పునఃపరిశీలించవచ్చని తెలిపింది.

## సిజెపి నిరసన అణచివేతపై పిల్

### అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ, జులై 21:** కాక్రోచ్ జనతా పార్టీ 'సంసద్ చల్లో మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు మితిమీరిన బలప్రయోగం చేశారని ఆరోపిస్తూ దాఖలైన పిఐఎల్‌ను మంగళవారం (జులై 21, 2026) అత్యవసర విచారణ కోసం ఢిల్లీ హైకోర్టులో ప్రస్తావించారు. ఈ అభ్యర్థనను తక్షణమే స్వీకరించడానికి కోర్టు నిరాకరిస్తూ, 'ఈ విషయంలోకి కోర్టును లాగవద్దు. ఇది రేపు విచారణకు వస్తుంది" అని వ్యాఖ్యానించింది. సోమవారం ఢిల్లీలో పార్లమెంటుకు సిజెపి జరిపిన మార్చ్‌ను అణచివేసే క్రమంలో పోలీసులు లాఠీఛార్జ్ చేసి, బాష్పవాయువు ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో కనీసం 38 మందిని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీకి, సుమారు 65 మందిని డాక్టర్ రామ్ మనోహర్‌లోహియా ఆసుపత్రికి తరలించినట్లు వర్గాలు తెలిపాయి.

## లాఠీఛార్జిలో గాయపడిన విద్యార్థిని పరిస్థితి విషమం

### రామ్‌మనోహర్ లోహియా ఐసియులో చికిత్స

### ఆసుపత్రిని సందర్శించిన మంత్రి నడ్డా, రాహుల్, ప్రియాంక, కేజ్రీవాల్‌లు



**న్యూఢిల్లీ,జులై 21:** ఢిల్లీలో సోమవారం జరిగిన సిజెపి ఆధ్వర్యంలోని విద్యార్థుల నిరసన సందర్భంగా జరిగిన లాఠీఛార్జ్‌లో తీవ్రంగా గాయపడిన 20 యేళ్ల విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఆమెను ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి ఐసియులో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ వ్యవహారం ఢిల్లీలో హాట్‌టాఫిక్‌గా మారింది. ఈ ఘటనతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నెలకొంది. బాధిత విద్యార్థులను పరామర్శించేందుకు ఆమ్ ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కేంద్ర మంత్రి జెపి నడ్డా కూడా ఆస్పత్రికి వెళ్లారు. యువతి ఆరోగ్యంపై వైద్యుల నుంచి నడ్డా వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం నిరసన సందర్భంగా గాయపడిన విద్యార్థుల్లో ఒకరి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, ఆమెను ఐసియులో వెంటిలేటర్ సాయంతో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల లాఠీచార్జీలో యువతి అత్యంత తీవ్రంగా గాయపడినట్లుగా డాక్టర్లు భావిస్తున్నారు.

**అభిజీత్ దీప్కే క్షమాపణ**

గాయపడిన విద్యార్థులను పరామర్శించిన సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే భావోద్వేగంగా స్పందించారు. మా మద్దతుదారులందరికీ ముఖ్యంగా పోలీసుల చేతిలో దారుణంగా దాడికి గురైన విద్యార్థినులకు నేను క్షమాపణ చెబుతున్నాను. మిమ్మల్ని రక్షించడంలో మేము మరింత మెరుగ్గా వ్యవహరించాల్సింది. ఢిల్లీ పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడేందుకు ప్రభుత్వం యువ విద్యార్థుల రక్తం చిందించడానికి కూడా వెనుకాడలేదని వ్యాఖ్యానించారు. నిరసనలో గాయపడిన వారు తనను నేరుగా సంప్రదించాలని కోరారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆర్ఎంఎల్ ఆస్పత్రికి వెళ్లి గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. ఒక విద్యార్థిని ప్రస్తుతం అత్యంత విషమ పరిస్థితిలో చికిత్స పొందుతోంది. మిగతా గాయపడిన విద్యార్థులు, పోలీసు సిబ్బందిని ఇప్పటికే డిశ్చార్జ్ చేశారు. సోషల్ మీడియాలో 110 మంది గాయపడినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ సంఖ్యపై అధికారిక సమాచారం లేదని చెప్పారు. మరోవైపు కేంద్ర మంత్రి, మాజీ బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా కూడా ఉదయం ఆర్ఎంఎల్ ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఆస్పత్రికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పరామర్శించారు.

## సిక్కింలో సొరంగ ప్రమాదం

### 10 మంది మృతి..

### కొండచరియలు విరిగిపడడంతో టన్నెల్ ప్రవేశద్వారా మూసివేత

### 27 మంది కార్మికులు చిక్కుకున్నట్లు అంచనా



**గ్యాంగ్‌టక్,జులై 21:** సిక్కింలోని నామ్‌చీ జిల్లాలో జరుగుతున్న ఎన్‌హెచ్‌పిసి తీస్తా స్టేజ్6 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 10కు చేరింది. భారీ కొండచరియలు విరిగిపడటంతో సొరంగం ప్రవేశద్వారం పూర్తిగా మూసుకుపోయింది. దీంతో లోపల పనిచేస్తున్న పలువురు కార్మికులు చిక్కుకుపోయారు. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం మంగళవారం అధికారికంగా మృతులసంఖ్యను ధృవీకరించింది. సమర్‌డుంగ్ ప్రాంతంలోని నిర్మాణంలో ఉన్న ఈ సొరంగంలో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతదేహాలను సింగ్‌టామ్ జిల్లా ఆస్పత్రి, గ్యాంగ్‌టక్‌లోని ఎస్‌టీఎన్ఎం ఆస్పత్రి, నామ్‌చీ జిల్లా ఆస్పత్రులకు తరలించారు. సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. జిల్లా యంత్రాంగంతో పాటు ఎన్‌హెచ్‌పిసి అధికారులు, జాతీయ విపత్తు స్పందనదళం, రాష్ట్ర విపత్తు స్పందనదళం, అగ్నిమాపక మరియు అత్యవసర సేవల బృందాలు సంయుక్తంగా సహాయక చర్యలు చేపడుతున్నాయి. సొరంగంలో ఎంతమంది చిక్కుకుపోయారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. కొండచరియలు విరిగిపడిన ప్రభావంతో సొరంగంలో విషవాయువు లీకైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. భూగర్భ శిలా పొరలు కదలికకు గురికావడంతో సహజసిద్ధంగా వాయువు వెలువడినట్లు భావిస్తున్నారు.సొరంగంలో గ్యాస్ వ్యాపించడం వల్ల సహాయక చర్యలు మరింత క్లిష్టంగా మారాయని పోలీసులు తెలిపారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన పలువురు రెస్క్యూ సిబ్బందికి తల తిరగడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు ఎదురయ్యాయని వెల్లడించారు. దీంతో గ్యాస్‌మాస్కులు, ప్రత్యేక రక్షణపరికరాలతో సన్నద్ధమైన బృందాలు అత్యంత జాగ్రత్తగా సొరంగంలోకి ప్రవేశించే ప్రయత్నం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంబులెన్స్‌లను కూడా సిద్ధంగాఉంచారు. జిల్లా కలెక్టర్ అనూపా టామ్లింగ్ మాట్లాడుతూ, సోమవారం మధ్యాహ్నం సుమారు 3.40 గంటలకు ప్రమాద సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలను ఘటనాస్థలికి పంపించినట్లుతెలిపారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, జిల్లా పోలీసులు, అగ్నిమాపకశాఖ సంయుక్తంగా సహాయక చర్యలు చేపడుతుండగా, పశ్చిమ బెంగాల్ నుంచి ప్రత్యేక గ్యాస్ రక్షణ పరికరాలతో కూడిననిపుణుల బృందంకూడా ఆపరేషన్‌లో చేరిందని వెల్లడించారు.

## ఇండో యుఎస్ వాణిజ్య ఒప్పందంపై రైతుల భారీ ర్యాలీ



**న్యూఢిల్లీ,జులై 21:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసన తెలిపేందుకు రైతులు చీమల దండులా కదిలి వచ్చారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తూ నేడు ఢిల్లీలో రైతులు ఆందోళనలకు పిలుపునిచ్చారు. దేశ్ బచావో మోర్చా ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈర్యాలీలో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌తో సహా పలు రాష్ట్రాల నుంచి రైతులు దేశ రాజధాని భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి అమెరికాకు మేలు చేస్తోందని మండిపడ్డారు. భారతదేశంలోకి చౌక వ్యవసాయ దిగుమతులను అనుమతించే ఈ భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంతో తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, పశుపోషకులు, చిన్న వ్యాపారులు, దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని రైతు సంఘాల నేతలు ఆరోపంచారు. ప్రతిపాదిత ఒప్పందం కొన్ని వస్తువులకే పరిమితం కాదని, వ్యవసాయం, పాడి, పరిశ్రమ, డిజిటల్ వాణిజ్యం, ఈకామర్స్, ప్రభుత్వ కొనుగోళ్లు, మేధో సంపత్తి హక్కులు, సేవల రంగాన్ని కూడా ఇది కవర్ చేయవచ్చని పాంధర్ అనే నాయకుడు పేర్కొన్నారు. భారత్‌అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని, అలాగే దేశంలోని రైతులు,సామాన్య పౌరుల ప్రయోజనాలను కాపాడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## వాంగ్‌చుక్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించడానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 21:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) విద్యార్థుల నిరసనకు మద్దతుగా 24 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి నుండి గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి వెంటనే తరలించాలని ఢిల్లీ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 19, 21 కింద ఆయన ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి, భద్రతను నిర్ధారించడానికి ఈ తరలింపు అవసరమని కోర్టు పేర్కొంది. వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె. అంగ్మో దాఖలు చేసిన అప్పీల్‌ను అనుమతిస్తూ, ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యులతో జరిపిన సంప్రదింపుల ద్వారా, నిరంతర పర్యవేక్షణ అవసరమయ్యే కొన్ని వైద్యపరమైన సమస్యలు ఉన్నట్లు వెల్లడైందని ధర్మాసనం గుర్తించింది. వాంగ్‌చుక్‌కు వైద్య నిపుణులచే 'నిరంతర పర్యవేక్షణ' అవసరమనే విషయంలో వైద్యులందరి మధ్య ఏకాభిప్రాయం ఉందని కోర్టు నమోదు చేసింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడానికి, వైద్య చికిత్సను అందించడానికి తగిన నైపుణ్యం కలిగిన వైద్యుల బృందాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని మేదాంత ఆసుపత్రి డైరెక్టర్‌ను కూడా న్యాయస్థానం ఆదేశించింది.

## సంక్షిప్త వార్తలు

### అమెజాన్ డేటా సెంటర్‌పై ఇరాన్ డ్రోన్ దాడులు



**మనామా, జులై 21:** ఇరాన్-అమెరికా మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. టెహ్రాన్‌లోని పలు ప్రాంతాలపై అగ్రరాజ్యం విరుచుకుపడుతుండగా.. గల్ఫ్ దేశాలలోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఐఆర్‌జిసి దాడులు కొనసాగిస్తోంది. ఇందులో డేటా సెంటర్లు కూడా ఉండటం గమనార్హం. సోమవారం రాత్రి జోర్డాన్‌లోని సైనిక, పౌర మౌలిక సదుపాయాలు.. కువైట్, బహ్రెయిన్‌లలోని పౌర విమానాశ్రయాలు, విద్యుత్ కేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది. అదే సమయంలో బహ్రెయిన్‌లోని అమెరికా దిగ్గజ కంపెనీ 'అమెజాన్' డేటా సెంటల్‌పై డ్రోన్ దాడులు చేసినట్లు ఐఆర్‌జిసి వెల్లడించింది. డేటా సెంటర్‌లోని మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది.

### ఖర్గేకు జన్మదినశుభాకాంక్షలు తెలిపిన మోడీ

**న్యూఢిల్లీ, జులై 21:** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంగళవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇవాళ 84వ యేట అడుగుపెట్టిన ఖర్గేకు భగవంతుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ఎక్స్‌ద్వారా ప్రధాని తన సందేశాన్ని పంచుకున్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకి జన్మదిన శుభాకాంక్షలు. ఆయనకు భగవంతుడు దీర్ఘాయువును, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నా అని మోడీ తన సందేశంలో పేర్కొన్నారు.

### కరెన్సీ మ్యాప్ మారుస్తున్న నేపాల్



**ఖాట్మండు,జులై 21:** నేపాల్ ప్రభుత్వం తమ రూపాయి మ్యాప్ డిజైన్‌ను మార్చబోతోంది. భారత్‌తో సరిహద్దు వివాదానికి కేంద్రబిందువైన కాలాపాని, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలను ఆ రూపాయి నాణెం నుంచి తొలగించనుంది. దాని స్థానంలో దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ప్రాచీన బౌద్ధ మతం చిత్రాన్ని చేర్చాలని నిర్ణయించింది. ఈ మేరకు నేపాల్ మంత్రివర్గం కొత్త నాణెం రూపకల్పనకు ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు చలామణిలో ఉన్న నేపాల్ రూ.1 నాణెంపై ఆ దేశ రాజకీయ మ్యాప్‌తో పాటు భారత్‌తో వివాదంలో ఉన్న కాలాపాని, లిపులేఖ్, లింపియాధురా ప్రాంతాలు కూడా కనిపించేవి. తాజా డిజైన్‌లో ఆ మ్యాప్‌ను పూర్తిగా తొలగించి, ముస్తాంగ్ జిల్లాలోని చారిత్రకలో గ్యాకర్ బౌద్ధ మతం చిత్రాన్ని ముద్రించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### గయానాలో ఫెర్రీ ప్రమాదం: 27 మంది మృతి

**జార్జ్‌టౌన్:** దక్షిణ అమెరికా దేశమైన గయానా తీరంలో జరిగిన ఘోర ఫెర్రీ ప్రమాదంలో ఇప్పటివరకు 27 మంది మరణించగా, 69మందిని సురక్షితంగా ఒడ్డుకుచేర్చారు. మరో 83 మంది ఇంకా గల్లంతైనట్లు గయానా ప్రధానమంత్రి బ్రిగేడియర్ మార్క్ ఫిలిప్స్ వెల్లడించారు.ఎంవీ బరిమా అనే ఫెర్రీ జార్జ్‌టౌన్ నుంచి వాయువ్య ప్రాంతంలోని పోర్ట్ కైతుమా గ్రామానికి వెళ్తుండగా సముద్రంలో బోల్తా పడింది. ఫెర్రీలో మొత్తం 133 మంది ప్రయాణిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పయాణికుల జాబితా (మానిఫెస్ట్)లో తప్పులు ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

### సుప్రీంకోర్టుకు శివసేన ఎంపిల విలీనం వివాదం

**న్యూఢిల్లీ, జులై 21:** ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో ఆరుగురు శివసేన (యుబిటి) ఎంపిల విలీనాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గుర్తించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఈ విషయాన్ని అత్యవసర విచారణ కోసం మంగళవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. "ఇది ఒక ముఖ్యమైన విషయం.. ఆరుగురు ఎంపిలు ప్రత్యర్థి పార్టీలో విలీనం కావడాన్ని స్పీకర్ గుర్తించారు. ఇది రాజ్యాంగపరమైన అంశం ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. శనివారం రాత్రి ఆలస్యంగా స్పీకర్ దీనిని గుర్తించడంతో, పార్టీకి పార్లమెంట్ కార్యకలాపాలు స్తంభించిపోయాయ్ణి అని సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ సమర్పించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి సిజెఐ కాంత్ అంగీకరించారు.

# నేడు ఇంజినీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు

## 60,792 మంది వెబ్‌ఆప్షన్లు

## అందుబాటులో 31,834 సీట్లు

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026–27 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్–2026 ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా రెండో విడత సీట్ల కేటాయింపు నేడు(బుధవారం) చేపట్టనున్నారు. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగియగా, గడువు ముగిసే సమయానికి 60,792 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. మొత్తం 26,55,669 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రంలో 175 కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 81,620 సీట్లు అందుబాటులో ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. అనంతరం రెండో విడత కౌన్సెలింగ్‌లో అదనంగా 4347 సీట్లకు అనుమతిస్తున్నట్టు ప్రకటించారు. మొదటి విడతలో 19,325 మంది విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయలేదు. దాంతోపాటు మొదటి విడతలో మిగిలిపోయిన 8162 సీట్లతో కలిపి మొత్తం 27,487 సీట్లు, కొత్తగా 17 బ్రాంచ్‌ల్లో అదనంగా 4347 సీట్లకు అనుమతించగా.. వాటితో కలిపి రెండో విడతలో 31,834 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

# ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

## సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షలో



## సిఎస్ సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జులై21:**రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఎకో టూరిజం అభివృద్ధి, పులుల సంరక్షణ, టైగర్ రిజర్వుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ, పర్యాటక శాఖ సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సి.ఎస్ కు వివరించారు. ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎకో టూరిజంను అభివృద్ధి పరచి తద్వారా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పించడంతో పాటు పర్యటక రంగం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు.ప్రత్యేకంగా భద్రాచలం పరిసర ప్రాంతాలలో ఉన్న కిన్నెరసాని, శ్రీశైలం నల్లమల అటవీ ప్రాంతాలలో అమ్రాబాద్, గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న కవ్వాల్ టైగర్ రిజర్వు, ఆదిలాబాద్, ములుగు ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి తగు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఎకో టూరిజంను అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్రంలో విలువైన అటవీ సంపద ఉందని, జీవ వైవిధ్యం, సహజ ప్రకృతి అందాలను పర్యాటక అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం అభివృద్ధికి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ప్రాజెక్టులు రూపొందిస్తే, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిడిపి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టూరిజం డెవల్మెంట్ కార్పొరేషన్ సంయుక్త భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సిఎస్ సూచించారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ, అనంతగిరి,వికారాబాద్,సిటీ అర్బన్ ప్రాంతాలలో ఎకో టూరిజంను ప్రొత్సహించాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, నిబంధనలకు అనుగుణంగా పర్యాటక మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ వినయ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సిఎస్ సంజయ్‌తో అమెరికా కాన్సుల్‌జనరల్ లారావిలియమ్స్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై21:**హైదరాబాద్ లోని అమెరికా కౌన్సెల్ జనరల్ లారా విల్లియమ్స్ మంగళవారం డా.బీ.ఆర్ అంబెడ్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజుతో సమావేశమయ్యారు. మర్యాదపూర్వక ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

# బిజెపి రాష్ట్ర చీఫ్ రామచంద్రరావు ఆరోపణలన్నీ ఉనికి కోసమే

## ఎల్‌నినో ప్రకృతి విపత్తు ఎదుర్కొనేందుకు చేతనైతే కేంద్రం నిధులు ఇప్పించండి : మంత్రి పొన్నం

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తన రాజకీయ ఉనికిని చాటుకోవడానికి నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎల్ నినో ప్రకృతి విపత్తు పై కేంద్రం నుండి ఏం నిధులు తీసుకొస్తారో తీసుకొచ్చి చేతనైతే రాష్ట్ర ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడంతో తన అభిప్రాయాలను అధికారిక వేదికపై చెప్పే అవకాశం లేక, అసెంబ్లీ సమావేశాలకు ముందే అనవసర వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ ప్రచారం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్యూర్ చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడుతుందని, అక్కడ అన్ని పార్టీలకు తమ అభిప్రాయాలను వెల్లడించే పూర్తి అవకాశం ఉంటుందని తెలిపారు. బిజెపి తన వైఖరిని తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల ద్వారా సభలో వెల్లడించవచ్చని, ముందుగానే గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేయడం తగదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, మెజారిటీ ఉందని ప్రతిపక్షాల గొంతు నొక్కే సంస్కృతి తమది కాదని స్పష్టం చేశారు.

గతంలో బిజెపి ప్రభుత్వం అనేక కీలక చట్టాలను సరైన చర్చ లేకుండానే తీసుకొచ్చిందని గుర్తుచేస్తూ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రతి అంశంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.పార్టీ అధ్యక్ష పదవి ఉన్నప్పటికీ శాసనసభ గానీ, శాసనమండలి గానీ, పార్లమెంట్ గానీ ఏ సభలో సభ్యుడు కాకపోవడం వల్ల సొంత పార్టీ నాయకుల నుంచే తగిన ప్రాధాన్యం లభించకపోవడంతో రామచంద్రరావు నిరాశలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు.జీహెచ్‌ఎంసీ పరిధిలోని పేదలకు ఇళ్లు రావాలా? వద్దా? అనే విషయంలో బిజెపి తన వైఖరిని స్పష్టం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్లు అందించే కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజా సంక్షేమ దృక్పథంతో చూడాలని సూచించారు.ఇళ్ల నిర్మాణ పథకంలో కేంద్ర నిధులు ఉన్నాయనే విషయాన్ని చెబుతున్న బిజెపి నాయకులు, నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే కేంద్రంలోని తమ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి అదనపు నిధులు తీసుకురావాలని మంత్రి సవాల్ విసిరారు. ప్రజల హక్కులను ఉపకారాలుగా చూపించే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ అంగీకరించరని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# కన్నులపండువగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం



ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి తదితరులు

## మంత్రి కొండా సురేఖ, సిఎం సతీమణి గీతారెడ్డి ప్రత్యేక పూజలు

## భక్తజన సందోహంతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

**హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), జులై 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతో బల్కంపేట ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. రాష్ట్రం నలు మూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. ఈ మహోత్సవంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన కుమార్తె సుస్మితా పటేల్‌తో కలిసి పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతారెడ్డి తన కుమార్తె నైమిషాతో కలిసి ఆలయానికి చేరుకుని ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి ఘన స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. సీఎం కుటుంబం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజల ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణ పాడిపంటలతో సస్యశ్యామలంగా వర్ధిల్లాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం నెలకొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలా ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని మంత్రి వెల్లడించారు. దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, పారిశుధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లతో పాటు పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, శిశుపుల కోసం ప్రత్యేక దర్శన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.
మహోత్సవానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా పుష్పాలంకరణలు, విద్యుత్ దీపాలంకరణలతో కనువిందు చేసింది. వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా జరిగిన కళ్యాణ వేడుకలను తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఎల్లమ్మ అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగిపోయాయి.

# ఆగస్టు 30లోగా గురుకులాల తనిఖీలు పూర్తి చేయాలి

## విద్యతోపాటు క్రీడలు, కళల్లోనూ ప్రోత్సహించాలి

## వారానికి మూడురోజులు ఆర్‌సిఒలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని అన్ని గురుకుల విద్యాసంస్థలను ఆగస్టు 30లోగా పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశిం చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. గురుకుల విద్యాసంస్థల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఆర్‌సీవో) వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను సంద ర్శించాలని ఆదేశించారు. ఆర్‌సీవోలు కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా ప్రధాన కార్యాలయం, జిల్లా యంత్రాంగం, విద్యా సంస్థల మధ్య సమన్వయం కల్పించే సంధాన కర్తలుగా వ్యవహరించాలన్నారు. సొంత భవనాలు లేని గురుకుల విద్యాసంస్థలకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అందుకోసం సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశమై అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ నియోజకవర్గానికి అనుమతి పొందిన విద్యాసంస్థ అదే నియోజకవర్గ పరిధిలో భవనాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అద్దె భవనాలకు చెల్లించే మొత్తంలో 6 శాతం నిధులను భవనాల మరమ్మతులకు తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యాసంస్థలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను సమర్థవంతంగా అమలు చేసి భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు ప్రధాన కార్యాలయానికి తెలియజేసి వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల్లోనే కాకుండా క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసం వంటి రంగాల్లోనూ ప్రోత్సాహం అందించి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతిభ గల విద్యార్థుల వివరాలు తెలియజేస్తే వారికి ప్రభుత్వం తరపున మరింత ప్రోత్సాహం అందిస్తామని మంత్రి అధికారులకు సూచించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా సైకాలజిస్టులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని మంత్రి సూచించారు.

విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎక్కడా ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరగకుండా వంటశాలలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెల కనీసం 15 గురుకుల విద్యాసంస్థలను తాను, కమిషనర్, కార్యదర్శి ఆకస్మిక తనిఖీలు చేస్తామని, విధుల నిర్వహణలో నిరక్ష్యం ప్రదర్శించవద్దని మంత్రి హెచ్చరిం చారు. మూసీ గురుకుల విద్యాసంస్థకు సొంత భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని మంత్రి వెల్లడించారు. ఈ విడియో కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు పాల్గొన్నారు.



# విద్యార్థి సంఘాల చలో లోక్‌భవన్

## కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్

## అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు

## అరెస్టులను ఖండించిన విద్యార్థి సంఘాల నేతలు

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే భర్తరఫ్ చేయాలిడిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు మంగళవారం ఛలో లోక్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి లోక్‌భవన్‌కు వెళ్లడానికి ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నేతలను పోలీసుల అడ్డుకొని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఈడ్చుకుంటూ పోలీసు వాహనాల్లోకి ఎక్కించడం, తోపులాటలో పలువురు విద్యార్థులు గాయపడడం దురదృష్టకరమని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమాలపై దమనకాండను వెంటనే నిలిపివేయాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్ పాలనను తలపించే విధంగా వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు, యువతపై నిర్బంధ చర్యలను ఖండిస్తున్నామని ఛలో లోక్‌భవన్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌లో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన 'చలో లోక్ భవన్' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్, ఏఐఎఫ్‌డిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ.. సోనం వాంగ్ చుక్‌తోపాటు దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య హక్కులు, విద్యా హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు, యువతకు సంఘీభావాన్ని ప్రకటించారు. విద్యను కాపాడాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులపై ఇటువంటి నిర్బంధ చర్యలు బ్రిటీష్ పాలనను తలపిస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో జరిగిన అణచివేతను నేడు బీజేపీ ప్రభుత్వం పునరావృతం చేస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలో జరిగిన సంఘటనలకు నిరసనగా తెలంగాణలో "ఛలో లోక్ భవన్" కార్యక్రమానికి పిలుపునిస్తే, పోలీసులు ముందస్తుగా అడ్డుకుని విద్యార్థులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. విద్యార్థుల ఉద్యమాలను అణచివేయడం ద్వారా విద్యా సంక్షోభాన్ని దాచిపెట్టలేరని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

# నిజామాబాద్‌లో మౌలికవసతుల కల్పనకు కార్యాచరణ రూపొందించండి

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** నిజామాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనకు విస్తరిస్తున్న నగరం వైశాల్యానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవడానికి అధికారులు కృషిచేయాలని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ అభివృద్ధిపై సమీక్ష సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాల అధికారులు ప్రజలనుంచి సూచనలు తీసుకొని వాటికి అనుగుణంగా మౌలిక వసతులు పెంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి చెందితే జీవనోపాదుల కల్పన కూడా అదేవిధంగా పెరుగుతాయని అన్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించే చర్యలు తదితర అంశాలపై అధికారులు ఎప్పటి కప్పుడు ప్రజ లకు ఇబ్బందికలుగకుండా నిర్ణయాలు తీసుకొవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి, అదనపు కలెక్టర్ భుజంగరావు, మున్సిపల్ కమిషనర్ దిలీప్, డిఆర్‌వో గీత, నిజా మాబాద్ మేయర్ ఉమారాణి, ట్రాఫిక్ ఎసిపి, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కార్పొరేషన్ చైర్మన్లు కేశ వేణు, తాహేర్ బిన్, శేఖర్ గౌడ్, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్‌లో ఉన్న హనుమాన్ ఆలయాన్ని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, మహేష్ కుమార్ గౌడ్‌కి ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆంజనేయ స్వామిని ప్రార్థిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు భూపతి రెడ్డి ,ధన్ పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


# బూత్‌లెవెల్ ఏజెంట్ల అప్రమత్తతతో అర్హుల ఓట్లు గల్లంతు కావు

## 'సర్'పై సమీక్ష సమావేశంలో పాల్గొన్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జులై 21,ప్రభాతవార్త:** బూత్‌లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉంటే అర్హులైన ఏ వయోజనుడి ఓటు కూడా గల్లంతు కాదని, ఓట్ చోరీతో రాజ్యాధికారంలోకి రావాలనుకొనే వారిని ఆటలను కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని పిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ పై సమీక్ష సమావేశం కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ చైర్మన్లు శేఖర్ గౌడ్, కేశ వేణు, తాహేర్బిన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సర్ ప్రక్రియపై ప్రజల్లో అపోహలు తొలగిస్తూ, ముఖ్యంగా పేద ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఓటరు వివరాలను పరిశీలిస్తూ ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని ఆయన సూచించారు. నగర కార్పొరేటర్లు సమన్వయంతో పని చేసి, పార్టీ బలోపేతంతో పాటు ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని కోరారు. ఓటుచోరీ సీటు చోరీతో ఇక రాజ్యాంగాన్ని మార్పు చేసి సంక్షేమ రాజ్యంలేకండా చేసే ప్రమాదం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బిఎల్‌ఏలు, కార్పొరేటర్లతో సమావేశమై సర్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలోని 40 కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చండి

## జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్‌పర్సన్‌కు ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు విజ్ఞప్తి




**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** రాష్ట్రానికి చెందిన 40 కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాలని బీసీ సంక్షేమ, అభివృద్ధి విభాగాల ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ వెనుకబడిన తరగ తుల కమిషన్ (ఎన్‌సిబిసి) చైర్‌పర్సన్ సాధ్వి నిరం జన్‌జ్యోతికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు చెందిన 40 బీసీ కులాలను కేంద్ర ఇతర వెనుకబడిన తరగతుల (ఓబిసి) జాబితాలో చేర్చాలనే దీర్ఘకాలిక ప్రతిపాదనపై ఈ ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు విహెచ్ 40 బీసీ కులాలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల ప్రయోజనాలు అందేలా చూసేందుకు, వారిని కేంద్ర ఓబీసీ జాబితాలో త్వరితగతిన చేర్చాలని ఎన్‌సిబిసి చైర్‌పర్సన్‌ను కోరారు.

వినతి పత్రంపై ఎన్‌సిబిసి చైర్‌పర్సన్ సాధ్వినిరంజన్ జ్యోతి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాంకేతిక అడ్డంకులను తొలగించి, త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టమైన హామీ ఇచ్చినట్టు తెలిపారు. తాను ఈ సమస్యను వీలైనంత త్వరగా కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఓబీసీలకు ఖచ్చితంగా న్యాయం చేస్తానని ఆమె ఇచ్చినట్టు విహెచ్ మీడియకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఈ 40 కులాలను కేంద్ర జాబితా నుండి మినహాయించడం వల్ల స్థానిక యువత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యా సంస్థల్లో సీట్లను కోల్పోతున్నారని విహెచ్ తెలిపారు. చైర్‌పర్సన్ ఇచ్చిన హామీ పట్ల విహెచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ త్వరితగతిన అమలయ్యేలా, బాధిత వర్గాలకు న్యాయం జరిగేలా తెలంగాణ ప్రభుత్వం కమిషన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపు తుందని విహెచ్ స్పష్టం చేశారు.

## 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్'లో భాగంగా

# హార్యానాను సందర్శించిన విద్యార్థుల బృందం

## రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను అక్కడి విద్యార్థులకు పరిచయం

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా హర్యానా రాష్ట్రాన్ని తెలంగాణ విద్యార్థుల బృందం సందర్శించింది. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి చెందిన విద్యార్థుల బృందం ఈ నెల 15 నుండి 22 వరకు హర్యానా రాష్ట్రంలో పర్యటించింది. విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా మార్గదర్శకత్వంలో, పాఠశాల విద్య శాఖ డైరక్టర్, ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరక్టర్ డాక్టర్ ఈ నవీన్ నికోలస్, సమగ్ర శిక్ష పాఠశాల విద్య ఎఎస్‌పిడిపి వి.శ్రీహరి, జేడీ మదన్ మోహన్ సహకారంతో ఈ పర్యటనలో హర్యానాలోని పలు పాఠశాలలు, విద్యా, సాంస్కృతిక సంస్థలను విద్యార్థుల బృందం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను ఈ బృందం అక్కడి విద్యార్థులకు పరిచయం చేసింది. ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ కార్యక్రమం భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాన్ని బలోపేతం చేయడం, జాతీయ సమైక్యతను పెంపొందించడం, అలాగే విద్యార్థుల్లో 'భిన్నత్వంలో ఏకత్వం' భావనను బలపరచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రాన్ని హర్యానా రాష్ట్రంతో జత చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా రెండు రాష్ట్రాల విద్యార్థులు పరస్పరం ఒకరి సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానం, చరిత్ర, పర్యాటక ప్రాంతాలు, వంటకాలు, కళారూపాల గురించి అవగాహన పెంపొందించుకుంటున్నారు. తెలంగాణ విద్యార్థులు హర్యానా సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోగా, హర్యానా విద్యార్థులు తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వమైన బతుకమ్మ, బోనాలు, ఒగ్గుకథ, జానపద నృత్యాలు తదితర అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులు హర్యానా భాషలో ప్రాథమిక సంభాషణలు, ప్రసంగాలను కూడా ప్రదర్శించారు. పర్యటనలో భాగంగా తెలంగాణ బృందం ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాల, షాబాద్, జై శ్రీరామ్ విద్యాపీఠంతోపాటు కురుక్షేత్ర జిల్లాలోని సైనిక్ పాఠశాలలను సందర్శించింది. ఈ 3 విద్యాసంస్థల్లో తెలంగాణ విద్యార్థులు ఒగ్గుకథ, జానపద నృత్యాలు, సాంప్రదాయ కళారూపాలు సాంస్కృతిక ప్రదర్శనలను అందించి విశేషప్రశంసలు అందుకున్నారు.



## స్వదేశీ వాణిజ్య విమానాల తయారీకి రెండు సంస్థల ఒప్పందం

**న్యూఢిల్లీ, జులై 21:** భారతదేశం స్వదేశీ వాణిజ్యవిమానాల తయారీ దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. దేశంలోనే తొలి 200 సీట్ల సింగిల్ ఐల్ వాణిజ్య విమానాల అభివృద్ధి లక్ష్యంగా హంస ఇండస్ట్రీస్, ఏర్నోవా ఇంజనీరింగ్ డివిజన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఇరు సంస్థలు అంతర్జాతీయ ఎయిర్‌షో 2026లో అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ భాగస్వామ్యం ద్వారా ఇండియాలో ప్రపంచ స్థాయి ప్రయాణికుల విమానాన్ని రూపకల్పన చేయడం, ధృవీకరించడం, పారిశ్రామికీకరించడం, తయారు చేయడానికి అవసరమైన జాతీయ ఏరోస్పేస్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించనున్నాయి. విమాన రూపకల్పనతో పాటు ఇంజనీరింగ్ నైపుణ్యం, ఆధునిక తయారీ సాంకేతికత, పారిశ్రామిక భాగస్వామ్యాలు, దేశీయ సరఫరా గొలుసు అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ ఒప్పందం కింద ఏరోస్ట్రక్చర్, స్ట్రక్చరల్ ఆర్కిటెక్చర్, మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్, డిజిటల్ ఇంజనీరింగ్ వంటి కీలక రంగాల్లో ఇరు సంస్థలు కలిసి అవకాశాలను పరిశీలించనున్నాయి. భవిష్యత్తులో భారత విమానయాన పరిశ్రమకు బలమైన సాంకేతిక పునాది వేయడం ఈ సహకారం ప్రధాన ఉద్దేశం. ఈ విషయంపై హంస ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఉమేష్ వంకాయలపాటి మాట్లాడుతూ ఇండియాలోనే 200 సీట్ల స్వదేశీ వాణిజ్య విమానాన్ని రూపొందించి, ధృవీకరించి, తయారు చేయాలన్నదే మా లక్ష్యం. ఇందుకోసం కేవలం విమానాన్ని అభివృద్ధి చేయడం మాత్రమే కాకుండా, దేశంలో పూర్తి స్థాయి ఏరోస్పేస్ ఎకోసిస్టమ్ను నిర్మించడం కూడా అత్యంత అవసరం. ఆ దిశగా ఏర్నోవాతో ఈ భాగస్వామ్యం కీలక మైలురాయి అని పేర్కొన్నారు.

## ఇరాన్ పిక్‌యాక్స్ అణుస్థావరంపై త్వరలోనే భారీ దాడి: ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, జులై 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ అణు సెంట్రిఫ్యూజ్‌లు ఉన్నాయని భావిస్తున్న ప్రాంతంపై అమెరికా త్వరలోనే, అత్యంత తీవ్ర స్థాయిలో దాడి చేస్తుందని హెచ్చరించారు. టెహ్రాన్‌కు ఇప్పటివరకు చేసిన అత్యంత కఠిన హెచ్చరికల్లో ఇది ఒకటిగా భావిస్తున్నారు. నటాంజ్ అణు కేంద్రం సమీపంలోని పిక్‌యాక్స్ అనే అత్యంత భద్రత కలిగిన భూగర్భ సముదాయానికి ఇరాన్ యురేనియం శుద్ధి సెంట్రిఫ్యూజ్‌లను తరలించిందనే వార్తలపై ట్రంప్‌ను మీడియా ప్రతినిధులుప్రశ్నించారు. దీనికి స్పందించిన ట్రంప్, ఆ ప్రాంతంపై మేము చాలా త్వరలో, చాలా భారీగా దాడి చేస్తాం. దాన్ని అడ్డుకునే శక్తి వారికి లేదని స్పష్టం చేశారు. సాధారణంగా సైనిక చర్యల గురించి ముందుగానే బహిరంగంగా మాట్లాడను. ఇరాన్ దీనిని అడ్డుకునే సామర్థ్యం ఉందని నేను భావించి ఉంటే ఎప్పుడూ ఇలా చెప్పేవాడిని కాదు. కానీ ఆ ప్రాంతంపై త్వరలోనే భారీ దాడి చేస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ గూఢచారి సంస్థల అంచనా ప్రకారం, ఇరాన్ వేలాది యురేనియం శుద్ధి సెంట్రిఫ్యూజ్‌లను నటాంజ్ సమీపంలోని పిక్‌యాక్స్ మౌంటెన్ భూగర్భ సముదాయానికి తరలించినట్లు చెపుతోంది. ఈ కేంద్రం ఘనమైన రాతి పొరల కింద వందల అడుగుల లోతులో నిర్మించబడినట్లు భావిస్తున్నారు. దీంతో భూఉపరితలంలోని అణు కేంద్రాలతో పోలిస్తే దీనిని ధ్వంసం చేయడం అత్యంత కష్టసాధ్యంగా మారింది. ఇతర అణు కేంద్రాలు దెబ్బతిన్నా, ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి కొనసాగించే లేదా వేగంగా పునర్నిర్మించే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులతో పేదల సొమ్ము దోపిడీ

**మున్సిపల్ చట్ట సవరణతో పన్నుల మోత, ఆర్థికభారం**

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తీవ్రఆగ్రహం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై21:** హైదరాబాద్ నగరంపై, పేద, మధ్యతరగతి ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుల భారం, డిపాజిట్ల పేరుతో నిలువుదోపిడీకి తెరతీసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) చట్టం, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరుపై ఘాటుగా విమర్శలు గుప్పించారు. క్యూర్ పేరుతో ప్రజలకు పెయిన్ తీసుకొస్తున్నారంటూ ఆయన విమర్శించారు. క్యూర్ చట్టంలోని కీలక నిబంధనలు ప్రజలను పీల్చి పిప్పిచేసేలా ఉన్నాయని రాంచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. నీరు, సివరేజ్ సేవలను విడదీసి వేర్వేరు పన్నులు విధించడం ద్వారా ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతుందన్నారు. 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, కార్పొరేటర్లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధుల పాత్రపై ఎలాంటి స్పష్టత లేకుండా, జవాబుదారీతనం లోపించిన ఈ చట్టాన్ని తాము అసెంబ్లీలో తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. భాగస్వాములైన రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ప్రజల సూచనలు తీసుకోకుండా ఏకపక్షంగా ఈ చట్టం తీసుకురావాలనుకోవడం సరైనది కాదని హితవు పలికారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సంక్షేమం కోసం కాదని, అది మరొక ఆర్థిక దోపిడీ కార్యక్రమమని దుయ్యబట్టారు. 24 నియోజకవర్గాల్లో లక్షలాది మంది అర్హులు ఉంటే, కేవలం 7,680 ఫ్లాట్లకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి, ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ.100 రుసుముతో పాటు రూ.10,000 ఈఎండీ డిపాజిట్ వసూలు చేయడం అత్యంత అన్యాయమన్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వం పేదల నుంచి దాదాపు రూ.1,000 కోట్లు వసూలు చేయడానికి కుట్ర పన్నిందని, ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పేరుతో చేసిన డిపాజిట్ల దోపిడీని గుర్తు చేస్తోందని విమర్శించారు. కాగా, మీడియా సమావేశానికి ముందు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పలువురు ప్రముఖులు ఎన్. రాంచందర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన అవసరం

**విద్యుత్ వినియోగంపై నియంత్రణ ఉండాలి: డి.సిఎం భట్టివిక్రమార్క**

**ఎల్‌నినో సమస్యలపై విస్తృతస్థాయి సదస్సులో పాల్గొన్న పలువురు నిపుణులు**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జులై 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రణాళికాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో విస్తృతస్థాయిలో జరిగిన ఎల్‌నినో-పసిఫిక్ మహాసముద్రం వేడెక్కడం నుండి తెలంగాణ సన్నద్ధత వరకు అనే అంశంపై జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క భారతదేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న ఎల్‌నినో సమస్యపై అన్నివర్గాలు, ప్రజలకు అవగాహనతోపాటు జరుగుతున్న పరిణామాలపట్ల అప్రమత్తత ఎంతో అవసరమని అన్నారు. ఎన్నోవేల కిలోమీటర్ల దూరంలోని పసిఫిక్ మహాసముద్రంలో జరుగుతున్న పరిణామాలు మన తెలంగాణకు చేరుకున్న ఈ ఎల్‌నినో సమస్యపై తెలంగాణ రాష్ట్ర ప్రజలు, సమాజ మొత్తానికి సవివరంగా అవగాహన కల్పించి ఎదురయ్యే ఆయా సమస్యలను ఎదుర్కొని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రతలు తెలపడానికి వృత్తి, సామాజిక బాధ్యతగా విచ్చేసి వివరాలు తెలియజేసిన విషయ నిపుణులు, వివిధ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అసలు ఎల్‌నినో అంటే ఏమిటి, దాని ప్రభావమేమిటి, అది ఎవరెవరిపై, ఏయే రంగాలపై ఎంతవరకు ఉంటుంది, వాటి వల్ల ఏర్పడే ఇబ్బందులు ఏమిటనే అంశాలన్నింటినీ లోతుగా అవగాహన అధ్యయనం చేసినవారు బాగా వివరించగలరని అలాంటి వారితో ఈ సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. ఎల్‌నినో సమస్యపై ప్రభుత్వ పాలనాపరమైన నిర్ణయాలతోపాటు అన్నిరంగాలు, ప్రజలు అవగాహణ చేసుకుంటే తగునిర్ణయాలు, ముందుజాగ్రతలు తీసుకునే అవకాశముంటుందన్నారు. ఈ క్రమంలో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, ప్రకృతిలోని జీవుల అవసరాల దృష్ట్యా ఉత్పన్నమయే అంశాలపై ప్రతీఒక్కరూ వారివారి స్థాయిల్లో ప్లాన్ చేసుకుని ముందుకుపోతే ఇలాంటి సమస్యను తట్టుకొని ఆ ప్రభావాల నుండి బయటపడొచ్చన్న అవగాహనకు సదస్సు ఏర్పాటు చేశామన్నారు. నిపుణులు ఎల్‌నినోతో వర్షాభావం వల్ల నీటివనరులు తగ్గితేకూడా పండించుకునే ఏ పంటలున్నాయి... నష్టపోకుండా ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చో చక్కగా వివరించారన్నారు. తద్వారా రైతులు వారి ప్రణాళిక తయారుచేసుకోవచ్చని చెప్పారు. అలాగే విద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో వర్షాట ప్రభావమెంతో వివరించడం వల్ల విద్యుత్తును మనం ఎలా పొదుపుగా వాడుకోవాలి.. అందుబాటులో ఉండే సోలార్ విద్యుత్‌ను ఏ అవసరాలకు ఎలా వాడుకోవాలి.. థర్మల్ విద్యుత్ వాడుకుంటే ఆర్థికభారం ఉంటుందో తెలిపినందుకు అభినందించారు. హైడల్ విద్యుత్ ఉత్పత్తి సరైనంతగా లేకపోవడం, వర్షాభావం వల్ల బోర్లు, వాడుకునే ఏసిలు, ఫ్యాన్లు, కూలర్లు, లైట్లుకు విద్యుత్ వాడకంలో ఎండాకాలానికి మించిపోయిందని వివరించారని, ప్రజలంతా తక్కువ ధరకు దొరికే సోలార్ విద్యుత్ అందుబాటయ్యే సమయంతో దానిని వ్యవసాయం, హార్టికల్చర్ తదితరాలకు వాడుకుంటే అదనపు ఆర్థికభారం ప్రజలపై పడదన్నారు.

ఈ సదస్సులో ఆయా ప్రముఖ విషయ నిపుణులు, వివిధ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులకు ఇలా స్లైడ్‌షో, పవర్‌పాయింట్ ద్వారా ఎన్నో విషయాలు, సూచనలు అందజేసిన ప్రొఫెసర్లు బి.వెంకటేశ్వరరావు, కార్మూరి అశోక్, జీనా, డి.రాజారెడ్డి, డా. సుధీర్‌జోసెఫ్, డా. విజయ్, డా. వినోద్‌కుమార్ సింగ్, డా. ఎం.బలరామ్, డా. కె.మృత్యుంజయరెడ్డి, ఎం.సురేష్‌బాబు తదితరులకు కృతజ్ఞతాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళికాశాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, సీనియర్ ఐఎఎస్ అధికారులు దేవయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు. చివరిగా సదస్సులో పాల్గొన్న ప్రముఖులందరినీ ఘనంగా సత్కరించారు.




సభలో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వేదికపై మంత్రి అజారుద్దీన్, నవీన్‌మిట్టల్, గౌరవ్ తదితర ప్రముఖులు

## ఉద్యమకారుల సంక్షేమానికి పెర్మనెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**కేశవరావు కమిటీని కలిసిన కల్వకుంట్ల కవిత, అల్లం నారాయణ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై21:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముఖాముఖి షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం అమర వీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద వైద్యులు, న్యాయవాదులు, జర్నలిస్టులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు, వివిధ వర్గాల అగ్రశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు. అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు), ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్‌కు కవిత సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ కేశవరావు స్పందిస్తూ.. 'నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్‌ఛార్జిగా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు.

**జర్నలిస్ట్ ఉద్యమకారుల డిమాండ్లు**

తెలంగాణ మీడియా చానల్స్, పత్రికల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఉద్యమకారులైన జర్నలిస్టులకు గుర్తింపును ఇవ్వడంతో పాటు 250 గజాల నివాస స్థలం, ఉచిత రవాణా సౌకర్యం, పిల్లలకు ఉచిత నాణ్యమైన విద్య. జర్నలిస్టుల కుటుంబ ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక హాస్పిటల్ సదుపాయం కల్పించాలి. న్యాయవాద వ్యవస్థ, ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ కోసం శాసనమండలిలో అడ్వకేట్లకు ప్రత్యేక ఎమ్మెల్సీ స్థానాన్ని ఏర్పాటు చేయాలి. శాసనమండలిలో డాక్టర్లకు ప్రత్యేక ఎమ్మెల్సీ స్థానం ఏర్పాటు చేయాలి. ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్లకు ప్రభుత్వ బదిలీల్లో ప్రత్యేక ప్రాధాన్యత పాయింట్లు ఇవ్వాలి. ఉద్యమకారుల సంక్షేమం కోసం ఒక పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి.

## యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించండి

**కేంద్ర ప్రభుత్వ నిధుల సమీకరణపై సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై21:** కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన కేంద్ర నిధుల సమీకరణకు తగు కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో సిఎస్ మాట్లాడుతూ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన యుట 'లైజేషన్ సర్టిఫికెట్లు, నివేదికలు, ప్రతిపాదనలను సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, తద్వారా కేంద్ర నిధులు విడుదల కావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా సిఎస్ గ్రూప్ కోఆర్డినేషన్ మీటింగ్స్ నిర్వహించి ఆర్థిక వనరుల సమీకరణ, శాఖల సమన్వయం, కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో అమలు చేస్తున్న పథకాలు, నిధుల సమీకరణ పెంపొందించే చర్యలు, రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగిషిప్ ప్రొగ్రామ్స్, సాధించిన పురోగతి, తదితర అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమీక్షలో శాఖల వారీగా పథకాల పురోగతిని సిఎం డ్యాష్ బోర్డులో పొందు పరచాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలు, వాటి పురోగతి తదితర అంశాలన్నింటిని ఎప్పటికప్పుడు సిఎం డ్యాష్ బోర్డులో పొందుపరిచి, అంతర్గత అంశాలపై సమీక్షించుకోవాలని సూచించారు. రానున్న రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు సమాయత్తం కావాలని అసెంబ్లీ ఎజెండా ప్రకారం సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని సిఎస్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు మహేశ్ దత్ ఎక్కా, నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, శీకా గోయల్, స్టీఫెన్ రవీంద్ర, కార్యదర్శులు ఇలంబర్తి, సురేంద్ర మోహన్, గౌరవ ఉప్పల్, సిక్తా పట్నాయక్, లోకేష్ కుమార్, రాజీవ్ గాంధీ హనుమంత్, కృష్ణ ఆదిత్య, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఐటి శాఖ స్పెషల్ సెక్రెటరీ అనుదీప్, లా సెక్రెటరీ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 7,400 పోలీస్ పోస్టుల భర్తీకి షెడ్యూల్ ఇవ్వండి

**రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించిన హైకోర్టు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 21:** రాష్ట్ర పోలీసు శాఖలో ఇటీవల ప్రభుత్వం ఆమోదించిన సుమారు 7,400 ఖాళీ పోస్టుల నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డును ఆదేశించింది. నియామక ప్రక్రియ ఏ దశలో ఉంది, ఎప్పటిలోగా పూర్తి చేస్తారు అనే వివరాలను నాలుగు వారాల్లోగా నివేదించాలని పేర్కొంటూ తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. పోలీసు శాఖలో వివిధ హోదాల్లో మంజూరైన భారీ సంఖ్యలోని ఖాళీలను భర్తీ చేయడం లేదని సవాల్ చేస్తూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేతినేడి అఖిల్ శ్రీగురు తేజ దాఖలు చేసిన ప్రజాప్రయోజన పిటీషన్‌పై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్లతో కూడిన ధర్మాసనం విచారణ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున స్పెషల్ జీపీ రాహుల్ వాదనలు వినిపిస్తూ.. 5,000 పోలీసు పోస్టుల నియామక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, దీనికి సంబంధించి రిక్రూట్మెంట్ బోర్డు పత్రికా ప్రకటన కూడా విడుదల చేసిందని ధర్మాసనానికి వివరించారు. అయితే పిటిషనర్ తరపు న్యాయవాది ఈ వాదనలను వ్యతిరేకించారు. గత విచారణలో 7,000కు పైగా పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు కేవలం 5,000 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని వాదించారు. చివరిసారిగా 2022లో నియామకాలు జరిగాయని, నాలుగేళ్లు గడిచినా తక్కువ పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

## పరిశ్రమల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్**

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త :** తమ సంస్థ పరిధిలోని పరిశ్రమల అభివృద్ధికి నాణ్యమైన, నిరంతర మరియు విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించడం ప్రధాన లక్ష్యమని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎనర్జీ కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్ సంబంధిత సమస్యలను ప్రాధాన్యతతో, సత్వరమే పరిష్కరించేందుకు సంస్థ కట్టుబడి ఉన్నామన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాలు, విద్యుత్ బిల్లింగ్ సమస్యలు, కొత్త విద్యుత్ కనెక్షన్లకు పట్టే సమయం, లేఅవుట్లకు దశలవారీగా ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు తదితర సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ పరికరాల లభ్యత, క్యాప్టివ్ పవర్ వినియోగదారులపై క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్, కొత్త కనెక్షన్లకు అవసరమైన పత్రాలపై అవగాహన తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమల అభివృద్ధి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకమని, పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశ్రమలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ, విద్యుత్ సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇందులో ఎఫ్‌టీసీసీఐ ఎనర్జీ కమిటీ చైర్మన్ వినోద్ అగర్వాల్, విద్యుత్ కమిటీ సలహాదారు అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన పలువురు ప్రముఖులు

**కార్టూన్ పుస్తకాన్ని అందజేసిన బిపి ఆచార్య**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై21:** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మంగళవారం లోక్ భవన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కలిశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ ప్రధాన ప్రధాన కమిషనర్ సురేశ్ బట్టిని ఇతర అధికారులతో కలిసి గవర్నర్‌ను కలిశారు. బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థకు చెందిన డాక్టర్ ఉమారాణి ప్రతినిధి బృందంతో కలిసి గవర్నర్‌ను కలిశారు.
ప్రముఖ తెలుగు సినీ నిర్మాత బండ్ల గణేష్ గవర్నర్‌ను కలిశారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్టీ, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి.పి. ఆచార్య ట్రస్ట్ సభ్యుల(ప్రొఫెసర్ పాండు రంగారావు, శ్రీధర్‌రావు) తో కలిసి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కర్టూన్ పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేశారు.
పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రణవ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి వ్యవస్థాపకురాలు డాక్టర్ జి.పద్మజా రెడ్డి గవర్నర్‌ను కలిశారు.
నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) హైదరాబాద్ అధ్యక్షుడు కె. శ్రీధర్ రెడ్డి ప్రతినిధి బృందంతో కలిసి గవర్నర్‌ను కలిశారు.

## శస్త్రచికిత్స నుంచి కోలుకున్న అమితాబ్



**ముంబయి, జులై 21:** బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్‌బచ్చన్ తన ఆరోగ్యానికి సంబంధించిన కీలక విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఇటీవల ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకున్నట్లు ఆయన తన వ్యక్తిగత బ్లాగ్‌లో వెల్లడించారు. ప్రస్తుతం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నప్పటికీ, కోలుకునే ప్రక్రియ శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎంతో కష్టంగా ఉందని ఆయన ఈ బ్లాగ్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో ఆందోళనకు దారితీశాయి. అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్‌లో మాట్లాడుతూ ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో శస్త్రచికిత్స, ఐసీయూ, ఆ తర్వాత డిశ్చార్జ్ అయి ఇంటికి తిరిగి రావడం జరిగింది. శారీరకంగా, మానసికంగా కొలుకునే ఈ దశ అత్యంత కష్టతరమైందని పేర్కొన్నారు. ఆయనకు ఏ కారణంతో శస్త్రచికిత్స జరిగింది ఏ చికిత్స చేయించుకున్నారు అనే విషయాలను మాత్రం వెల్లడించలేదు. ఆరోగ్య పరిస్థితి గురించి మాత్రమే కాకుండా జీవితంలో ఎదురయ్యే విజయాలు, అపజయాలపై కూడా అమితాబ్ తన ఆలోచనలను అభిమానులతో పంచుకున్నారు. ఒక రోజు ప్రతి విజేత కూడా ఓటమిని ఎదుర్కోవాల్సి వస్తుందని, అలాంటి సమయంలో ధైర్యంగా ముందుకు సాగే వారే నిజమైన ఛాంపియన్లు అవుతారని పేర్కొన్నారు.

## రాష్ట్ర కాటన్ మిల్లర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

**అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రవీందర్‌రెడ్డి, రమేష్**

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కరీంనగర్‌కు చెందిన కక్కిరాల రమేష్ ప్రధాన కార్యదర్శిగా, నిర్మల్‌కు చెందిన పడిసెల కృష్ణమూర్తి కోశాధికారిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం అసోసియేషన్ కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో పత్తివ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యాజమానుల ప్రయోజనాలను పరిరక్షించడానికి, ప్రభుత్వ విధానాలపై చర్చించడానికి అఅసోసియేషన్ ఏర్పాటు అయింది.

# పలు జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు

**ఉప్పొంగుతున్న వాగులు, వంకలు**

**పంటలకు ఊపిరి పోసిన వానలు**

**రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తించిన వర్షాలు**

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు కురిశాయి. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో సోమ వారం అర్ధరాత్రి నుండి మంగళవారం వరకూ ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురియడంతో జనజీవనం స్థంభించింది. కొన్ని ప్రాంతాల్లో చెట్లు సైతం నేలవాలాయి. పలు చోట్ల వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎండిపోతున్న పంట చేలుకు ఈ వర్షాలు జీవం పోశాయి. వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలతో పాటు కూరగాయల తోటలకు ఈ వర్షాలు ఊపిరి పోశాయి. రాష్ట్రంలోని ప్రధానంగా ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో భారీగా వర్షాలు కురిశాయి. ములుగు జిల్లాతో పాటు, సరిహద్దు రాష్ట్రం చత్తీస్ఘడ్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ములుగు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163పై ఇసుకవాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ గడిచిన 24 గంటల్లో 76.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం వాతావరణ నివేదిక ప్రకారం, మంచిర్యాల జిల్లాలో సగటు వర్షపాతం 58.4 మిల్లీమీటర్లు కాగా, తెలంగాణలోనే అత్యధికంగా తాండూరు మండల కేంద్రంలో 120 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెల్లంపల్లి మండలంలో 119 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కోటపల్లి మండల కేంద్రంలో 105.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. న్నెపల్లి, వేమనపల్లి, భీమిని, చెన్నూరు, కాశీపేట, నెన్నాల్, జైపూర్ మరియు భీమారం మండలాల్లో 40 మి.మీ నుంచి 94.8 మి.మీ మధ్య వర్షపాతం నమోదైంది. పత్తి, సోయాతోపాటు మొక్కజొన్న, ఇతర ఆరుతడి పంటలకు ఈ వానలు మేలు చేశాయని చెబుతున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం అక్కేపల్లి గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఈ కారణంగా అక్కేపల్లి మరియు శివలింగాపూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇది ప్రధాన రహదారి కావడంతో, ప్రతిరోజు ఈ దారి గుండా ప్రయాణించే ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ఉధృతి తగ్గే వరకు వాగు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులను లేదా తెలంగాణ విపత్తు నిర్వహణ అధికారులను సంప్రదించాలని సూచించారు. అ వరద ప్రవాహం కారణంగా ఈ తాత్కాలిక డైవర్షన్ అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో, 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. అప్రోచ్ రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టినప్పటికీ, వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# నేరం ఆధునికమైతే... పోలీసింగ్ అంతకంటే ఆధునికం కావాలి

● ఫ్యాక్షన్ నుంచి సైబర్ నేరాల వరకు కఠిన పోరు ● ఈగల్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో నేరాలపై ఉక్కుపాదం ● 112 స్పందన వేగం పెంపు... మహిళలపై నేరాలు తగ్గింపు ● సాంకేతిక పోలీసింగ్‌తో దేశానికే ఆదర్శంగా ఏపి ● 'ఫ్యూచర్‌రెడీ: ఏపి పోలీస్ రిట్రీట్-2026' వర్క్‌షాప్‌లో హోంమంత్రి వంగలపూడి అనిత





**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** నేరాల స్వరూపం రోజురోజుకు సాంకేతికత ఆధారంగా మారుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ కూడా అంతకంటే ఆధునికంగా, వేగవంతంగా, ప్రజా కేంద్రీకృతంగా రూపాంతరం చెందాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన రిట్రీట్‌లో ముఖ్య అతిథిగా మంత్రి అనిత పాల్గొన్నారు. కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన ఆమె ఉద్వేగభరితంగా మాట్లాడుతూ ఒక నేరంగా జరిగిన సందర్భంలో ఘటనపై పోలీసు సత్యశోధన జరిగే లోపుగానే సామాజిక మాధ్యమాలు తప్పుడు ఇన్వెస్టిగేషన్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. నేర నియంత్రణతో పాటు వాస్తవాలను పక్కదోవపట్టించే పరిస్థితులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఉన్నత పోలీసు అధికారులను ఉద్దేశించి హోం మంత్రి అనిత మాట్లాడుతూ. 2001లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన పోలీసు సంస్కరణల రిట్రీట్ సంప్రదాయాన్ని 25 సంవత్సరాల అనంతరం అదే దూరదృష్టి, అదే సంస్కరణల స్ఫూర్తితో పునరుద్ధరించడం చారిత్రాత్మకమని హోంమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ సవాళ్లను ముందుగానే అంచనా వేసి పోలీసు వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరఫున ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, డిజిపి కార్యాలయం, జిల్లా ఎస్పీలు, పోలీసు సిబ్బందిని ఆమె అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు, వామపక్ష తీవ్రవాదం, మతకలహాలను గణనీయంగా అదుపులోకి తీసుకురాగలిగామని పేర్కొన్న హోంమంత్రి, ప్రస్తుతం సైబర్ నేరాలు, రౌడీయిజం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆధునిక నేరాలను ఎదుర్కోవడానికి పోలీసులు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం పెరుగుతోందని, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వాస్తవాలు, ఆధారాలతో తిప్పికొట్టే బాధ్యత పోలీసులదే నని అన్నారు. ప్రతి ఘటనపై ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని పేర్కొన్న మంత్రి, మహిళలపై నమోదవుతున్న నేరాలను సుమారు నాలుగు శాతం తగ్గించగలిగామని తెలిపారు. గంజాయి నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈగల్ వ్యవస్థ ద్వారా ఎస్పీలు, పోలీసు అధికారులు సమన్వయంతో గంజాయి సాగు, అక్రమ రవాణాపైసమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 112 అత్యవసర స్పందన వ్యవస్థ ద్వారా స్పందన సమయాన్ని గణనీయంగా తగ్గించామని, పోలీసింగ్‌లో 'గోల్డెన్ టైమ్' అత్యంత కీలకమని హోంమంత్రి పేర్కొన్నారు. వేగవంతమైన స్పందన వల్ల నేరస్థులను త్వరగా అదుపులోకి తీసుకురావడంతో పాటు బాధితుల్లో భరోసా పెరుగుతుందని అన్నారు. పోలీసు శాఖ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ఇప్పటికే 6,000 మంది కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేశామని, భవిష్యత్తులో కూడా ప్రతి జాబ్ క్యాలెండర్‌లో కొత్త పోలీసు పోస్టులను భర్తీ చేస్తూ శాఖను మరింత బలోపేతం చేస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేయడానికి, నూతన తరహా నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ రెండు రోజుల రిట్రీట్‌లో మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, సైబర్ భద్రత, రౌడీయిజం నిర్మూలన, ఫ్యాక్షన్ రాజకీయాల నియంత్రణ, వామపక్ష తీవ్రవాద నిర్మూలన, మతసామరస్య పరిరక్షణ వంటి ఆరు కీలక అంశాలపై వర్కింగ్ గ్రూపులు చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయి అనుభవాల ఆధారంగా రూపొందే సూచనలు రాష్ట్ర పోలీసింగ్‌కు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికగా మారనున్నాయని చెప్పారు. 'నేరం ఎంత ఆధునికమైనా... ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ దానికంటే ఒక అడుగు ముందే ఉంటుంది. సాంకేతికత, వేగవంతమైన స్పందన, పారదర్శకత, ప్రజల విశ్వాసం ఆధారంగా ఫ్యూచర్‌రెడీ ఏపి పోలీస్ వ్యవస్థను నిర్మించి దేశానికే ఆదర్శంగా నిలబెడతాం' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా, రాబోయే 20సంవత్సరాల సవాళ్లను ఎదుర్కొనే అత్యాధునిక పోలీసింగ్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమన్నారు. మారుతున్న నేరాల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని 10 కీలక అంశాలతో కూడిన భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు వెల్లడించారు. సాంప్రదాయ పోలీసింగ్‌కు బదులుగా డిజిటల్, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. విదేశాల నుంచి జరిగే సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, అనామక సైబర్ బెదిరింపులను ఎదుర్కొనేందుకు ముందస్తు నిఘా వ్యవస్థలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డ్రోన్ నిఘా, నిర్వహణ కోసం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భౌతిక అర్హతలతో పాటు కోడింగ్, క్రిప్టోగ్రఫీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతను పోలీస్ బలగాల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అత్యవసర సేవల 112 కాల్ వచ్చిన వెంటనే క్షణాల్లో స్పందించే వ్యవస్థను అభివృద్ధి చేయడం, పోలీస్- వైద్య- మహిళా సంక్షేమ శాఖల సమన్వయంతో గృహ హింస, ఆత్మహత్యలు, బాలలపై నేరాల నివారణకు డిజిటల్ హెల్త్ అండ్ సేఫ్టీ గ్రిడ్, ప్రిడిక్టివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాల సాధన కోసం స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికతో ఏపీ పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని డిజిపి హరీష్ స్పష్టం చేశారు.

## స్త్రీ, శిశు, దివ్యాంగ, సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై నేడు అసెంబ్లీ కమిటీ సమావేశం

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** స్త్రీ, శిశు, దివ్యాంగ, సీనియర్ సిటిజన్స్ ఈనెల 22వ తేది బుధవారం ఉ.10.30 గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్లో మహిళా, శిశు, దివ్యాంగ, సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై అసెంబ్లీ కమిటీ సమావేశం అసెంబ్లీ కమిటీ హాల్లో జరగనుందని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర తెలియజేశారు.

## గురుకుల సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ద్వారా నిర్వహించబడుతున్న ప్రతిష్టాత్మక సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటిగ్రేటెడ్ ఐఐటి, జెఇఇలలో ఉచిత శిక్షణతో కూడిన జూనియర్ ఇంటర్మీడియట్, సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపిసి /బైపిసి కోర్సులలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ జాయింట్ సెక్రటరీ (అకాడమిక్) డా. ఐ. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని మేఘాద్రిగడ్డ (విశాఖపట్నం జిల్లా), అమరావతి తాడికొండ (గుంటూరు జిల్లా), కోట (నెల్లూరు జిల్లా)లలోని మూడుసెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలలో ఈ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. మార్చి 2026లో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులై, కనీసం 85శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులని, అలాగే మార్చి 2026 జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులు సీనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కేంద్రాల ద్వారా నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతో పాటు ప్రముఖ శిక్షణ సంస్థల అధ్యాపకులచే సమగ్రమైన ఐఐటి, జెఇఇ, నీట్ ప్రవేశ పరీక్షలకు నాణ్యమైన కోచింగ్, పూర్తి ఉచిత వసతి, పౌష్టికాహార భోజనం, స్టడీ మెటీరియల్‌ను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మొత్తం సీట్లలో 75శాతం సీట్లు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు, 25శాతం సీట్లు ఇతర వర్గాల విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. అర్హులైన విద్యార్థులు అధికారిక వెబ్‌పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి జులై 30, 2026 చివరి తేదీ అని తెలియజేశారు. ఇప్పటికే ఇతర జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఎంపికైన పక్షంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ప్రవేశం పొందవచ్చని సూచించారు. అర్హత గల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా. ఐ. శ్రీదేవి ఆ ప్రకటనలో కోరారు.

# తప్పు దిద్దుకున్న టిటిడి అధికారులు... ఆ అధికారి పోస్టింగ్‌పై వెనుకడుగు

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో ముఖ్యంగా తిరుమలలో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు, అధికారులు ఉత్సాహం చూపుతుంటారు. రోజువారీగా విదులకు హాజరయ్యే ముందు శ్రీవారి ఆలయంలోనికి ప్రవేశించే అవకాశంతో బాటు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని ఆ తరువాత విధులు నిర్వహించే వీలుంది. అలాంటిది తిరుమలలో ఏ విభాగంలో అయినా పోస్టులు ఖాళీ అయితే అక్కడ విదులకు పెద్ద ఎత్తున ఉత్సాహం చూపుతుంటారు. టిటిడికి సంబంధించి తిరుపతి పరిపాలన భవనంలో గానీ, స్థానిక ఆలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు తిరుమలకు రావడానికి వారివారి స్థాయిలో సిపార్సులు కూడా చేసుకుంటారు. టిటిడి తిరుపతి జెఇఓ ఉద్యోగుల బదిలీలపై, పోస్టింగ్‌లపై సిఫార్సుచేస్తే అదనపు ఇఓ, ఇఓలు వారి అంగీకారం తెలియజేసి అవసరమైన మేరకు సంబంధిత ఉద్యోగులను బదలీ చేస్తుంటారు. అలాంటిది తిరుమలలో ఇటీవల ఖాళీ అయిన ఇంజనీరింగ్ విభాగం లోని డిప్యూటీ ఇఇ -ఉత్తర సెక్షన్ టి.వీరప్రసాద్ పదవీ విరమణ స్థానంలో తిరుపతిలోని ఎఇఇ పిఎంవి సుబ్రమణ్యంకు పోస్టింగ్ కల్పించారు. అయితే ఆయన ఇదివరకే సిఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, గతంలో అరెస్ట్ అయిన సందర్భంలో ఉద్యోగులకు స్వీట్లు పంచిపెట్టడం జరిగింది. ఈ విషయం తెలిసినా టిటిడి ఉద్యోగుల నుండి వ్యతిరేకత వచ్చినా ఇఓ, సిఇలు ఆ వివాదాస్పద అధికారికి తిరుమలలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ విషయంపై దూమరం రేగడంతో మంగళవారం ఆ అధికారిని అక్కడ నుండి మళ్ళీ రిలీవ్ చేసి బదలీ చేశారు. ఆ స్థానంలో వేణుగోపాల్‌ను నియమించారు. అయితే ఆ అధికారి నోటిదురుసుతోనే ఈ రాద్దాంతం జరిగిందని ఉద్యోగుల్లో చర్చ. అయితే టిటిడి ఇఓ, అదనపు ఇఓ, జెఇఓలతో బాటు సిఇ వివాదాస్పద అధికారికి ఎలా తిరుమలో పోస్టింగ్ ఇచ్చారనేది ఇప్పుడు సంచలనంగా మారింది. దీనిపై సిఎం చంద్రబాబునాయుడు కూడా ఆరా తీసినట్లు సమాచారం. మరీ టిటిడిలో జరుగుతున్న వివాదాస్పద విధానాలపై రానున్న రోజుల్లో ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఉద్యోగ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఎట్టకేలకు గతనెల 30న జరిగిన టిటిడిలో ఈ వివాదస్పదమైన పోస్టింగును సిఇ సత్యనారాయణ సరిదిద్దడంతో వివాదం సద్దుమణిగింది.

## పిడుగు పడి వృద్ధుడు మృతి



**సంతకవిటి (శ్రీకాకుళం జిల్లా), జులై 21 ప్రభాత వార్త:** శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం మల్లయ్యపేట గ్రామంలో పిడుగు పడి మూల కృష్ణమూర్తి (60) మృతి చెందారు. పొలంలో ఎదలో కలుపు తీస్తుండగా భారీ వర్షం పడింది. వర్షంతో పాటు ఉరుములు మెరుపులతో ఒక పిడుగు పడి కృష్ణమూర్తి అక్కడికక్కడే చనిపోయాడు. ఈయనకి ఇద్దరు మగ పిల్లలు కలరు. ఒకరు సబ్ ఇన్‌స్పెక్టర్, ఇంకొకరు ఎలక్ట్రికల్ ఏఈ. కృష్ణమూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అగ్నిప్రమాదంపై విచారణ జరపాలి



**తిరుపతి, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాద ఘటనపై టిఎన్ఎస్ ఎఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి సాంకేతిక, పరిపాలనా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. టిఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు వెంకటేష్ నాయుడు, రాఘవేంద్ర, వెంకటరెడ్డి, దాదు, ఫక్రుద్దీన్, ఆదర్శ్ తదితరులు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మసీ భవనం నిర్మాణ నాణ్యత, నిర్మాణ ప్రక్రియ, టెండర్ల మంజూరు, వ్యయ వివరాలు సంబంధిత రికార్డులపై సమగ్ర పరిశీలన చేపట్టి, పూర్తి నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. అక్రమాలు వెలుగులోకి తీసి సంబంధిత బాధ్యులపై చట్టపరమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


# తిరుమల సమాచారం



## తిరుమలకు పోటెత్తిన భక్తులు

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు భారీగా చేరారు. కొండపై మంగళవారం ఉదయానికి వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 8 గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. మొక్కులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. కాగా తిరుమలకు భక్తుల రాక పెరగడంతో అలిపిరి తనిఖీకేంద్రం వద్ద మంగళవారం ఉదయం భారీగా వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది చర్యలు చేపట్టి వాహనాలను క్రమబద్ధంగా కొండపైకి అనుమతించారు. భక్తులు సహకరించాలని అలిపిరి ఎవిఎస్ఒ రమేశ్ కృష్ణ విజ్ఞప్తి చేశారు.

## అలిపిరి కాలిబాటలో అడవి పందికి పూజలు



**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వరాహమూర్తిగా భావించి నుదుటిపై బొట్టు పెట్టి నమస్కరించిన యువతి ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌కావడంతో టిటిడి అటవీశాఖ స్పందించింది. కాలినడక మార్గాల్లో అడవి జంతువుల వద్దకు వెళ్లడం ప్రాణానికే ప్రమాదమని హెచ్చరిక చేశారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భక్తి విశ్వాసాలు అపారమైనా, ఆ భక్తి కొన్నిసార్లు హద్దులు దాటి ప్రాణాల మీదకు తెస్తుంటుందని పేర్కొన్నారు. తిరుమల నడకదారిలో ఓ యువతి వరాహ అవతారంగా భావించి ఓ అడవి పందికి ఆమె పూజలు చేయడం సంచలనంగా మారింది. కాలినడకమార్గాల్లో అడవి జంతువులను చూస్తే భయపడి భక్తులు దూరంగా వెళ్తారు. యువతి మాత్రం ధైర్యంగా ఆ అడవి పంది వద్దకు వెళ్లి, దాని నుదుటిపై కుంకుమ బొట్టు పెట్టి, నమస్కరించి పూజలు చేసింది. ఆ సమయంలో ఆ అడవి పంది కూడా ఎలాంటి హాని తలపెట్టకుండా నిశ్చలంగా ఉండిపోవడం ఆశ్చర్యం కలిగించింది. అక్కడున్న కొందరు ఈ దృశ్యాన్ని తమ ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్‌గా మారింది. అడవి పందులు అత్యంత క్రూరమైనవని, వాటి కోరలతో దాడి చేస్తే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా తిరుమలలోనూ అతిథిగృహాలు, విశ్రాంతి గృహాల ప్రాంతాల్లో, ఆలయం పరిసరాల్లోనూ అడవిపందులు సంచారం ఉండటం విశేషం.



## 24 నుండి 26 దాకా గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జ్యేష్ఠాభిషేకం (అభిధేయక అభిషేకం) నిర్వహించనున్నారు. ఈ వార్షిక ఉత్సవంలో స్వామివారి స్వర్ణకవచాలను శాస్త్రోక్తంగా తొలగించి, పవిత్రంగా శుద్ధి చేసి తిరిగి అలంకరిస్తారు. 24వ తేదీ కవచాధివాసం, 25న కవచ ప్రతిష్ఠ, చివరగా 26న కవచ సమర్పణ జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం మహాశాంతి హోమం, పుణ్యాహవచనం, ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం శతకలశ స్నపనం, సాయంత్రం వీధి ఉత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడతాయి. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో జ్యేష్ఠా నక్షత్రం సందర్భంగా నిర్వహించే ఈ జ్యేష్ఠాభిషేకం ద్వారా గోవిందరాజస్వామి భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చి అనుగ్రహిస్తారని ఆలయ ఆగమ పండితులు పేర్కొంటున్నారు.

## వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణం

**శ్రీకాళహస్తి, జులై 21 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించబడుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ద్రౌపదమ్మ కల్యాణం నిర్వహించారు. ఆలయ ఆవరణను ఓ కల్యాణ వేదికగా ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు, అరటి మొక్కలతో చక్కగా తీర్చిదిద్దారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా మన సంప్రదాయాన్ని అద్దంపట్టే విధంగా ముస్తాబు చేశారు. వేదపండితులు వేద మంత్రాల్ని ఘోషిస్తుండగా సంప్రదాయ బద్దంగా కళ్యాణ తంతువు ప్రారంభించారు. ఆలయ పూజారి దయానందం సూచనలతో పూజారులు పురుషోత్తం కార్యక్రమాల్ని నిర్వహించారు. ద్రౌపదీ దేవిని వధువుగా ముస్తాబు చేశారు. అర్జునుని వరుడుగా ముస్తాబు చేసి కళ్యాణ మండపం వద్దకు వేదమంత్రాలతో మేళ తాళాలు మంగళవాయిద్యాలతో చేర్చారు. ఇక్కడ హోమాలు, కల్యాణ మంత్రాలు, సంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఓ బికె వెంకటేశులు, డిప్యూటీ ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఉత్సవాల ఇన్‌చార్జి ఎఇఓ హేమామాలిని, లక్ష్మయ్య, పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వ హించారు. కల్యాణోత్సం కమనీయంగా నిర్వహించారు. వేదపండితుడు అర్ధగిరి వేదమంత్రాల్ని పఠిస్తుండగా ఉభయదారులు హాజరు కాగా కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తరువాత గ్రామోత్సవం జరిపారు.



## సప్పరంలో అర్జునుని దివ్యదర్శనం

**శ్రీకాళహస్తి, జులై 21 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం అర్జునుడు సప్పరం వాహనంపై దివ్య దర్శనం ఇచ్చారు. అర్జున సమేత ద్రౌపదీదేవి, కృష్ణుడు ఉత్సవర్లను లంకార మండపంలో అలంకార గురుకుల్ చక్కగా ముస్తాబు చేశారు. పట్టణంలోని జయరామా రావు వీధి, తేరువీధి, బజారువీధి, నగరి వీధి, నెహ్రూవీధుల గుండా ఊరేగింపు సాగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఓ బికె వెంకటేశులు ఉత్సవాన్ని పర్య వేక్షించారు. ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గాప్రసాద్, సిబ్బంది వెంటరాగా ఊరేగింపు సాగింది.



## గుర్తుతెలియని భక్తుడు తిరుమలలో మృతి

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో రెండవ వైకుంఠం కాంప్లెక్స్ కంపార్ట్మెంట్ 6 హాల్‌లో ఓ గుర్తుతెలియని భక్తుడు ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఉన్నట్లుండి అనారోగ్య కారణంగా స్పృహ తప్పి పడి ఉండగా అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది గమనించి అతనిని అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న డాక్టర్లు పరీక్షించి ఆ భక్తుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు కూడా లభించలేదు. గుండు చేయించుకొని ఉండి, ఎడమ చెవికి పోగు కుట్టబడి ఉంది, మెడలో తెల్ల పూసల దండ ధరించి ఉన్నాడు, కుడి చేయికి స్టీల్ కడియం, బ్రౌన్ కలర్ టీ చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆ వ్యక్తిని ఎవరైనా గుర్తించిన తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు గానీ, 0877 -2289027, 94407 96771 నంబర్‌లకు తెలపాలని పోలీసులు కోరారు.

## తిరుపతి జిల్లా కలెక్టర్‌తో సుగంధ ద్రవ్యాల బోర్డు సిఇఓ భేటీ



**తిరుపతి, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ అవార్డు అందుకున్న ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు (ఎపిఎంఎపి) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఓ) రాష్ట్ర అటవీశాఖ సీనియర్ అధికారి ఆవుల చంద్రశేఖర్ మంగళవారం తిరుపతికి విచ్చేశారు ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్‌ను కలిసి వివరాలు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో మొక్క, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఇటీవల లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హౌస్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి అంతర్జాతీయ అవార్డు అందుకున్న సిఇఓ ఆవుల చంద్రశేఖర్ కృషిని కలెక్టర్ ప్రశంసించారు.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషితోనే అంతర్జాతీయ అవార్డు దక్కిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో తనకు ఎంతగానో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి సిఇఓ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించేలా ప్రోత్సహించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి సత్యకుమార్‌కు, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆవుల చంద్రశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బంగారునగలు భక్తుడికి అప్పగింత



**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇష్టదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు ఉన్నఫళంగా మరచివెళ్ళిన బంగారు నగలున్న విలువైన సంచిని అలిపిరి విజిలెన్స్ అధికారి సురక్షితంగా భక్తులకు అందజేశారు. సాధారణంగా అలిపిరి తనిఖీ కేంద్రంలో వాహనాలను దిగిన తరువాత భక్తులు వారివారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీకోసం స్కానర్‌లో వదలుతారు. స్కానింగ్ అయిన తరువాత భక్తులు తిరిగి సంచులను తీసుకోవాల్సి ఉంది. హైదరాబాద్‌కు చెందిన మహేష్ కుటుంబంతో తిరుమలకు వచ్చారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో నగలున్న సంచిని మరచిపోయాడు. విధుల్లో ఉన్న సిబ్బంది అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణకు తెలిపారు. ఆయన వెంటనే సిసికెమెరా పుటేజీ గమనించి ప్రచారసాధనాల ద్వారా ప్రకటన చేయించడంతో అప్పటికే సంచిని మరిచిపోయిన విషయాన్ని తెలియజేసి భక్తుడిని వెంటనే కార్యాలయానికి పిలిపించుకున్నారు. పూర్తి వివరాలను ధృవీకరించిన అనంతరం వందగ్రాములు బంగారునగలునన్న సంచిని అప్పగించారు. టిటిడి యాజమాన్యానికి, విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది నిజాయితీ, అప్రమత్తత, సేవాభావాన్ని భక్తుడు మహేష్ అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## కాణిపాకం ఆలయంలో సిబ్బంది చేతివాటం

● ప్రత్యేక అభిషేకం టిక్కెట్ రొటేషన్ చేస్తూ పట్టుబడ్డ ఉద్యోగి

**కాణిపాకం, జులై 21 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయంలో పనిచేసే ఉద్యోగి తన చేతి వాటాన్ని ప్రదర్శించారు. మంగళవారం భక్తురాలి నుండి ప్రత్యేక అభిషేకంకు డబ్బులు తీసుకుని టిక్కెట్ ఇవ్వకుండా ఆలయంలోని అనుమతించడంతో తనికీల్లో ఉద్యోగి అవినీతి భాగోతం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... దేవస్థానంలో కార్తీక్ అనే వ్యక్తి ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం ప్రత్యేక అభిషేకం టిక్కెట్ కౌంటర్‌లో విధులు కేటాయించారు. ఉదయం 9గంటలకు ప్రత్యేక అభిషేకంకు టిక్కెట్ కావాలని కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న కార్తీక్‌ను ఓ భక్తురాలు కోరింది. అయితే డబ్బులు తీసుకుని టిక్కెట్ తన వద్దనే వుంచుకుని భక్తురాలిని ప్రత్యేక అభిషేకంకు లోనికి పంపించారు. ఈవిషయం అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలకు పూనుకున్నారు.
**అవినీతికి పాల్పడిని ఉద్యోగిపై చర్యలు తీసుకుంటాం:** కాణిపాకం దేవస్థానంలో భక్తురాలి నుండి డబ్బులు తీసుకుని టిక్కెట్ ఇవ్వకుండా ప్రత్యేక అభిషేకంకు ఆలయంలోనికి అనుమతించిన ఆలయ ఉద్యోగి కార్తీక్‌పై చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే పంచామృతాభిషేకంకు ఆలయ ఉద్యోగి కార్తీక్ భక్తురాలి నుండి డబ్బులు తీసుకుని టిక్కెట్ ఇవ్వకుండా ఆలయంలోని పంపినట్లు తనిఖీల్లో బయట పడినట్లు తెలిపారు. ఈమేరకు కార్తీక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# స్క్రీన్ టైమ్ సర్దుబాటు!



అనేడు ప్రపంచాన్ని శాసిస్తున్న పదం. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు తెలియకుండానే జీవితంలో భాగమై, భారంగా తయారైంది. చిన్నారి ఏడుస్తున్నా, తిండికి మారాం చేసినా, చివరికి నిద్రపుచ్చడానికి కూడా ఫోన్ చేతుల్లో పెడుతూ వరంగా భావించిన తల్లిదండ్రులకు స్క్రీన్‌టైమ్ నేడు శాపంగా మారింది. అధిక స్క్రీన్‌టైమ్ వల్ల పిల్లల ప్రవర్తన, భావోద్వేగాల నియంత్రణ అదుపులో ఉండకుండా పోతున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ చూస్తూ గడిపే పిల్లల మానసిక ఆరోగ్యం, ఎదుగుదలలో సమస్యలు తలెత్తుతున్నాయి. తరచూ నిపుణులు హెచ్చరించే ఈ మాటలే.. ఆడమ్ మొస్సేరి పేర్కొన్నారు. తన ఇంట్లో స్క్రీన్ టైం సులభంగా ఇవ్వనని తెలిపారు. వీడియోగేమ్స్ ఆడే తన పిల్లలకు స్క్రీన్‌టైమ్ లిమిట్ వారానికి మూడు అర గంటలుగా (గంటన్నర) నిర్దేశించినట్టు పేర్కొన్నారు. ఒకవేళ వారు ఆ మూడు అరగంటల స్క్రీన్‌టైమ్ వినియోగించుకోకుండా.. ఉపయోగకరమైన పని చేసి చూపిస్తే, ఆ సమయాన్ని వారాంతానికి సర్దుబాటు చేసేలా ఏర్పాటు చేశారు. వారాంతంలో ఒకేసారి గంటన్నరపాటు స్క్రీన్ చూసుకునే వెసులుబాటు కల్పించారట. ఈ కండిషన్ మంచి ప్రయోజనాన్నే ఇచ్చిందని చెబుతున్నారు మొస్సేరి. ఈ డిజిటల్ కాలంలో పేరెంటింగ్ కొంచెం కష్టంతో కూడుకున్నదైనా సరైన మార్పులు చేస్తే నష్టాలకంటే ప్రయోజనాలు పొందవచ్చని ఆయన చెప్పుకొచ్చారు

ఇంట్లో ఉన్నప్పుడు ఇంటి శుభ్రం, ఆఫీసులో ఉన్నప్పుడు అక్కడా ప్రశాంత వాతావరణం ఉందో లేదో గమనిస్తుంటాం ఒక్కోసారి మన టేబుల్‌ను అందంగా అమర్చుకోవడం పనీ మనకే పడుతుంది.

# శుభ్రతతో మనసుకు హాయి..

✦ అందుబాటులో ఉండాలి. అని ఫైల్స్, పేపర్లు వగైరా అన్నీ పక్కన పెట్టుకుంటూ ఉంటాం. తీరా చూస్తేనేమో డెస్క్ అంతా నిండి పోయి కనిపిస్తుంది. గజిబిజి ప్రదేశం మనసునీ చిరాకు పెడుతుంది. కాబట్టి, వీటిని మార్చడం కష్టం అన్నవి మినహా మిగిలినవన్నీ తీసేయండి. ✦ సిస్టమ్ శుభ్రత క్లీనింగ్ డిపార్ట్‌మెంట్‌ది అనేసుకుంటాం. బాగానే ఉంది కానీ.. పని మధ్యలో ఎప్పుడో వేళ్లను చూసుకున్నప్పుడు మురికిగా కనిపించడం, డెస్క్ మీద చిన్నమరక లాంటివి కనిపించినప్పుడు ఏమనిపిస్తుంది? పొర పాటున ముఖం మీద పెట్టుకున్నానా అనుకోవడం, దానిమీదకే దృష్టిమళ్లడం లాంటివి జరుగుతుంటాయి కదూ! టిష్యూ, లేదా చిన్న వస్త్రాన్ని పెట్టుకోండి. రాగానే ఒకసారి తుడిచేసుకుంటే దృష్టిమళ్లదు. ✦ చాలా గుర్తుగా పెట్టాం అనుకుం టామా? తీరా అవసరానికి సద్రాలోని వస్తువులన్నీ ఎన్నిసార్లు తిరగేసినా కావాల్సిన ఫైల్ దొరకదు. ఆందోళన కమ్మేస్తుంది. ఇలా జర గొద్దంటే ఫలానా రోజు ఫలానాది అవసరం అనుకుంటూ ఒక వరస క్రమంలో పెట్టుకోండి. స్టాప్లర్, పెన్, పెన్సిల్, పిన్నులు వంటివాటిని ఒకచోట, రిఫరెన్స్ మెటీరియల్లను మరోచోట ఇలా సర్దుకోండి. ఎంత తొందరలో ఉన్నా, వాటిని అక్కడే పెట్టేలా అలవాటు చేసుకుంటే సరి. ✦ చేయమన్నారు కదా అని గంటలకొద్దీ కేటాయించొద్దు. పని పెండింగ్‌లో పడుతుంది. రోజూ రాగానే ఓసారి చూసుకుని పనిలో పడిపోవాలి. వారాంతాల్లో పూర్తయిన ఫైళ్లను తొలగించడం, అనవసరమైన వాటిని కింది డ్రాలో పెట్టడం లేదా తీసేయడం వంటివి చేస్తే చాలు. పని ప్రదేశం శుభ్రం ఉంటుంది, మనసుకీ హాయి. ▢



# ఆ ఇంట్లో అందరూ కలెక్టర్లే!

ఇది ఇవ్వాల్టిమాట కాకపోవచ్చు. ఐనా చెప్పుకోదగినది. వినదగినది. ఎంతో స్ఫూర్తి దాయకమైన విషయాలు మళ్లీ మళ్లీ తెలుసుకుంటుంటే మనమెందుకు అలా చదవ లేం, అనే అభిప్రాయం ఈ తరం యువతలో కలుగక మానదు. అదేమిటో తెలుసుకుందాం.. ఒక ఇంట్లో ఒకరు కలెక్టర్ అయితేనే వారి తల్లితండ్రులు ఉప్పొంగిపోతారు. బంధువులు చుట్టుపక్కలవాళ్లు ప్రపంచాన్ని జయించినంత సందడి చేస్తారు. ఒకే తరంలో ఒకే ఇంట్లో అయిదుగురు అక్క చెల్లెళ్లు పంతం పట్టి ఐఎఎస్‌లు పూర్తిచేసిసాంటే వారి సంకల్పాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. మరింత మందికి స్ఫూర్తిని కలిగించే విషయాన్ని జన బాహుళ్యం ఎంతో గొప్పగా చెప్పుకుంటుంది. అందుకే ఈ విషయాలన్నీ రాజస్థాన్ రాష్ట్రంలో ఒకే కుటుంబానికి చెందిన అయిదురు అక్కాచెల్లెళ్లు ఇప్పుడు పాలనాధికారులుగా ప్రజాసేవలో ముందుగుడులో ఉన్నారు. వాళ్లంతా ధనవంతులేమీకాదు. వారి సంకల్పానికి కారణం వాళ్ల నాన్నే, సాదాసీదా మధ్య తరగతి కుటుంబానికి చెందిన రైతు. ఆయనకు ఐదుగురు ఆడపిల్లలు. అంతా ఆడపిల్లలే అని ఆయనెప్పుడు ఆందోళన పడలేదు. వాళ్లింట్లో పంచలక్ష్ములు ఉన్నట్లే సంతోషపడేవాడు. వాళ్లే రోమా, మంజు, అన్సురీతు, సమన్ వాళ్లల్లో ఒక్కరైనా ఐఎఎస్ చదివించాలనే తలపోసేవాడు. రాజస్థాన్‌లోని హనుమాన్ గఢ్ జిల్లాలో ఖేరుసరి గ్రామ రైతు సహదేవ్ సహారన్ తన కోరికను వారిముందుంచాడు. పంట పండినా పండక పోయినా కుటుంబ పోషణకు ఏ మాత్రం లోటు లేకుండా చూసు కున్నాడు. 'స్త్రీ విద్య' దేశానికి ఎంతో మేలు చేస్తుందని నమ్మాడు అదే తన కూతుళ్లకూ చెప్పాడు. తండ్రి ఆశయాన్ని గెలిపించడమే లక్ష్యంగా ఉన్నత చదువులను సార్థకం చేశారు. వాళ్లంతా 'నాన్న మాటంటే మాటే' అనుకున్నారు. ఎవరి ప్రయత్నం వారు చేసారు. యువతులు ఉన్నత చదువుల్లో విద్యాసరస్వతులుగా వెలిగిపోయారు. నాన్న ఆశయం తీర్చాలన్న తపన తప్ప మరో ఆలోచన వారిలో మెదిలేది కాదు. 2018లో నిర్వహించిన రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్ష ఫలితాలలో అన్షు, రీతు, సుమన్‌లకు రాజస్థాన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ (ఆర్ఎఎస్)కు ఏకకాలంలో ఎంపికై అందర్ని ఆశ్చర్యానికి గురి చేశారు. ఇప్పటికే ఆ ఇంట్లో రోమా, మంజుల, కలెక్టర్లుగా పనిచేస్తున్నారు. తాజాగా ఈ ముగ్గురు కూడా ఆర్ఎఎస్‌కు ఎంపిక కావడంతో ఆ ఇంట్లో ఇప్పుడు అందరూ కలెక్టర్లే ఆ తల్లితంనరదుల ఆనందానికి అవధుల్లేవు. ఆర్ఎఎస్‌కు ఎంపికైన ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఫోటోలను ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి పర్వీన్ కఫఫ్వాన్ షేర్ చేశారు. ▢

# వాడిన 'టీ' బ్యాగ్‌లలో..



కొంతమంది తమ రోజును బ్లాక్ లేదా గ్రీన్ టీతో ప్రారంభి స్తారు. కానీ అదే టీని మన సౌందర్య సంరక్షణ కోసం ఎలా ఉపయోగించు కోవచ్చో తెలుసా.. ✦ చర్మం పొడిబారినప్పుడు నిర్జీవంగా కనిపిస్తుంటుంది. ఇలాంటప్పుడు చల్లని గ్రీన్‌టీతో ముఖం కడుక్కోవాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై మురికి తొలగిపోయి, చర్మం పొడిబారే సమస్య కూడా తగ్గుతుంది. దీంతో చర్మం తాజాగా కనిపిస్తుంది. ✦ వాడేసిన టీ-బ్యాగులను కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి వాటిని కాసేపు కళ్లపై పెట్టుకొని చూడండి. ఇలా చేయడం వల్ల కళ్ల వాపు తగ్గుతుంది. నల్లటి వలయాల సమస్య కూడా దూరం అవుతుంది. తలస్నానం చేసే ముందు బ్లాక్ టీని తలంతా రాసుకోవాలి. పది, పదిహేను నిమిషాల తరువాత షాంపూతో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే జుట్టు చిట్లడ తగ్గుతుంది. అలాగే జుట్టుబాగా పెరుగుతుంది. ▢

# పెసర ఇడ్లీ



**కావలసిన పదార్థాలు:** పెసరపప్పు: ఒక కప్పు క్యారెట్: ఒకటిబీన్స్: గుప్పెడు క్యాబేజీ: చిన్న ముక్కఈనో ప్యాకెట్: ఒకటిబొంబాయి రవ్వ: పావు కప్పుపెరుగు: ఒక గరిట ఉప్పు: తగినంతకొత్తిమీర: అయిదారు రెబ్బలు

**తయారీ:** ముందుగా పెసరపప్పును శుభ్రంగా కడిగి నాలుగైదు గంటలు నానబెట్టుకోవాలి. క్యారెట్, క్యాబేజీలను కడిగి తురుముకోవాలి. బీన్స్‌ను సన్నటి ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. ఇప్పుడు నానబెట్టిన పెసరపప్పును మెత్తగా రుబ్బుకోవాలి. అందులో బొంబాయి రవ్వ కలుపుకోవాలి. ఇందాక సిద్ధం చేసి పెట్టుకున్న కూరగాయ ముక్కలను వేసుకోవాలి. సన్నగా తరిగిన కొత్తిమీర కూడా దీనికి జోడించాలి. కాస్త ఉప్పుతోపాటు ఈనో వేసి బాగా కలియబెట్టాలి. పెరుగు చేర్చడం వల్ల కాస్త పుల్లటి రుచి వస్తుంది. వెంటనే ఇడ్లీ పాత్రలో వేసుకొని ఆవిరిమీద ఉడికించుకుంటే ఆరోగ్యకరమైన పెసరపప్పు ఇడ్లీలు సిద్ధమైపోతాయి. ▢

# జంట అరటి పండ్లు



భగవంతుడి సన్నిధి అయిన ఆలయానికి వెళుతూ ఉత్త చేతులతో వెళ్లకూడదని పెద్దలు చెబుతుంటారు. అందువల్లనే ఆలయానికి వెళుతూ పూలు పండ్లు తీసుకెళుతుం టారు. అలా అరటిపండ్లు కొన్నప్పుడు ఒక్కోసారి జంట అరటి పండ్లు (అతుక్కుని వున్నవి) వస్తుం టాయి. వాటిని దైవానికి నైవేద్యంగా సమర్పించ కూడదనీ .. ఎవరికీ ఇవ్వకూడదని కొంతమంది అంటూ వుంటారు. ఎందుకొచ్చిన సందేహం అనేసి కొంత మంది వాటిని పారే స్తుంటారు. అయితే అతుక్కుని వున్న అరటి పండ్లు చూడటానికి కాస్త తేడాగా అనిపిస్తాయి గనుక, వాటిని నైవేద్యంగా ఇవ్వకూడదనే ప్రచారం జరిగి ఉంటుంది. దైవానికి సాధ్యమైనంత వరకూ తాజా పండ్లనే నైవేద్యంగా సమర్పించాలి. తప్పనిసరి అయితే జంట అరటి పండ్లను కూడా ఇవ్వొచ్చనేది ఆధ్యాత్మిక వేత్తల మాట. అతుక్కుని వున్న అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించడం వలన, వాటిని ఇతరులకి ఇవ్వడం వలన ఎలాంటి దోషం ఉండదని వారు సెలవిస్తున్నారు. ▢

## తెర

NBK111 షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయమైయింది. అభిమానులు ఆందోళన చెందాల్సిన

# NBK111 షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం



అవసరం లేదు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం: దర్శకుడు గోపిచంద్ మలినేని గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణకు స్వల్ప గాయమైయింది. బాలయ్య హీరోగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో NBK111 రూపొందుతోంది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం కాకినాడలో జరుగుతోంది. ఓ కీలక యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా బాలకృష్ణ గారికి చిన్న మసిల్ టియర్ అయింది. ఈ విషయాన్ని దర్శకుడు గోపిచంద్ మలినేని సోషల్ మీడియా ద్వారా తెలిజేశారు. NBK111 షూటింగ్ కాకినాడలో జరుగుతున్న సమయంలో ఓ యాక్షన్ సీక్వెన్స్‌లో నందమూరి బాలకృష్ణ గారికి చిన్న మసిల్ టియర్ అయింది.వైద్యుల సూచన మేరకు, ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవడానికి ఒక చిన్న మైనర్ సర్జరీ చేయాల్సి ఉంది.సినిమాపై ఆయనకున్న క్రమశిక్షణ, కష్టపడే తత్వం NBK111చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తి నిస్తుంది.అభిమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లో పాల్గొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.వీర సింహారెడ్డి బ్లాక్ బస్టర్ విజయం తర్వాత బాలయ్య, గోపిచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు వున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై నిర్మాత వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

'35 చిన్న కథ కాదు' టీమ్‌కు అభినందనలు ఇటీవల ప్రకటించిన 72వ నేషనల్ ఫిలిం అవార్డ్స్ లో ఉత్తమ బాలల చిత్రం, ఉత్తమ బాల నటుడు విభాగాల్లో రెండు అవార్డ్స్ గెల్చుకుంది "35 చిన్న కథ కాదు" సినిమా. ఈ చిత్రంలోని నటనకు



# '35 చిన్న కథ కాదు' టీమ్‌కు అభినందనలు

ఉత్తమ బాల నటుడిగా జాతీయ అవార్డ్ అందుకున్నారు మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల. మాస్టర్ అరుణ్ దేవ్ ప్రస్తుతం "సమ్మర్ హాలిడేస్" అనే బాలల చిత్రంలో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో "35 చిన్న కథ కాదు" మూవీ టీమ్ ను అభినందించారు "సమ్మర్ హాలిడేస్" సినిమా టీమ్. "సమ్మర్ హాలిడేస్" చిత్రాన్ని ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ 35 చిన్న కథ కాదు బ్యూటిఫుల్ ఫిలిం. ఈ సినిమాలో అరుణ్ నటన చూస్తున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యాను. డైరెక్టర్ నందకిషోర్ ఎఫర్ట్స్ వల్లే ఈ రోజు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఈ చిత్రానికి వివేక్ సాగర్ ఇచ్చిన సంగీతం నన్ను ఇన్స్ పైర్ చేస్తుం టుంది. డైరెక్టర్ శ్రీకర్ మాట్లాడుతూ తెలుగు సినిమా గర్వపడే బాలల చిత్రాన్ని అందించిన 35 చిన్న కథ కాదు టీమ్‌కు నా శుభాకాంక్షలు చెబుతున్నా. ఎప్పుడో 30 ఏళ్ల కిందట బాల రామాయణం సినిమాకు తెలుగు సినిమాకు ఉత్తమ బాలల చిత్రం అవార్డ్ 35 చిన్న కథ కాదు సినిమాతో ఆ గౌరవం దక్కింది. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ నేను థియేటర్ లో 35 చిన్న కథ కాదు సినిమాను మిస్ అయ్యాను. ఓటీటీలో చూశాను. కథను నమ్మి ప్రియదర్శి, నివేదా, దర్శక నిర్మాతలు ఈ సినిమాను చేశారు. యాక్టర్ విశ్వదేవ్ మాట్లాడుతూ నంద కిషోర్ ఈ కథ చెప్పినప్పుడు మేము ఎంత ఎగ్జైట్ అయ్యామో థియేటర్స్ లో ప్రేక్షకులు కూడా అలాగే ఫీలయ్యారు. ఈ సినిమాకు ఒక డ్రీమ్ టీమ్ కుదిరింది. వాళ్లంతా సినిమాను నమ్మి పనిచేయడం వల్లే ఈరోజు రెండు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి.

# సెన్సార్ నుంచి యు/ఎ సర్టిఫికేషన్ పొందిన 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫోటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందు తున్న సినిమా "చెన్నై లవ్ స్టోరీ". ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తు న్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తు న్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు "చెన్నై లవ్ స్టోరీ" మూవీ రెడీ అవుతోంది.తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమాకు సెన్సార్ నుంచి యు/ఎ సర్టిఫికేషన్ దక్కింది. ఇటీవల వచ్చిన ప్రేమ కథల్లో ఈ సినిమా విభిన్నంగా ఉందని కుటుంబం అంతా చూడగలిగే ఇలాంటి మంచి ప్రేమ కథలు మరిన్ని రావాలని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. మరోవైపు "చెన్నై లవ్ స్టోరీ" మేకర్స్ అగ్రెసివ్ ప్రమోషనల్ యాక్టివిటీస్ చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ సినిమా ట్రైలర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. "చెన్నై లవ్ స్టోరీ" సినిమాను ఈ నెల 23న ప్రీమియర్స్ నుంచే థియేటర్స్‌లో ఎంజాయ్ చేసేందుకు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

# 'టాక్సిక్' రొమాంటిక్ మెలోడీ 'మనసాగదే' రిలీజ్



రాకింగ్ స్టార్ యష్ ఖిటాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్ నుంచి విడుదలైన తొలి పాట 'తబాహీ' రికార్డు బ్రేకింగ్ రెస్పాన్స్‌తో చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు అదే జోష్‌ను కొనసాగిస్తూ మేకర్స్ రెండో పాట 'మనసాగదే' (తెలుగు వెర్షన్)ను విడుదల చేశారు. ఉప్పొంగే ఉద్వేగాలను చూపిస్తే, 'మనసాగదే' మాత్రం 'ఓఐఐఐఐ' మరో కొత్త కోణాన్ని ప్రజెంట్ చేసింది. మనసులో దాచుకున్న భావాలు, తీరని తపన, మౌనంగా మిగిలిపోయిన ప్రేమను ఈ పాట ఎంతో అందంగా పలికిస్తుంది. ప్రతి ప్రేమకథలో ఎన్నో భావోద్వేగాల పొరలు ఉంటాయని, ప్రతి దశ ప్రేమకు కొత్త అర్థాన్ని ఇస్తుందని ఈ పాట చెబుతోంది. ఈ పాటలో యష్, తారా సుతారియా రాయా, రెబెకా పాత్రల మధ్య బంధాన్ని పూర్తిగా కొత్త కోణంలో చూపించారు. వీరిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీ, ఎమోషన్స్ కట్టిపడేసింది. ఖితబాహీఖి లో కనిపించిన రాయా పాత్ర ఈసారి మనసులో నడుస్తున్న సంఘర్షణను కూడా సూచిస్తుంది.తనిష్క్ బాగ్చి, అర్సాన్ నిజామీ, ఫహీమ్ అబ్దుల్లా స్వరపరిచిన ఈ రొమాంటిక్ మెలోడీకి సిద్ధార్థ్ బస్రూర్ తన వోకల్స్ టప్ ప్రాణం పోశారు. ఐదు భాషల్లో విడుదలైన ఈ పాట తెలుగు వెర్షన్‌కు 'మనసాగదే' టైటిల్ తో రిలీజ్ చేశారు. తెలుగు సాహిత్యాన్ని రామజోగయ్య శాస్త్రి అందించారు. హిందీలో 'మధోష్', కన్నడలో 'మనమోహక', తమిళంలో'తడుమారుధేయ్', మలయాళంలో 'మధుమోహిని' పేర్లతో ఈ పాట విడుదలైంది. ఈ చిత్రంలో యష్, నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

# జన నాయకుడు ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది: వెంకట్ కె. నారాయణ



**ఈ సినిమా రిలీజ్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు కదా? మీరు ముందుగానే ఊహించారా?**

ముందుగానే కొన్ని ఇబ్బందులు రావొచ్చని మేము అనుకున్నాం. విజయ్ గారు కూడా, "ఇది నా చివరి సినిమా. దీని తర్వాత పూర్తిగా రాజకీయాల్లోకి వెళ్తున్నాను.

**మీరు బిజినెస్‌లో ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లారు.సినిమాల్లోకి రావాలనే ఆలోచన ఎలా వచ్చింది?**

నాకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే చాలా ఇష్టం. అకాడమిక్ పుస్తకాల్లో దొరకని ఎన్నో గొప్ప విషయాలు సినిమాల్లో ఉంటాయి. పాటలు, లిరిక్స్, కథలు... ఇవన్నీ మన జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయి. ఇటీవల విడుదలైన పెద్ది సినిమాలో "ఒకేలాగే బతికేయడానికి ఇంత పెద్ద జన్మ ఎందుకు?" అనే డైలాగ్ ఉంది.

**సెన్సార్ విషయంలో చాలా ఇబ్బందులు వచ్చాయి కదా? బాధపడ్డారా?**

ఇందులో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్, సమాజంలో మార్పు తీసుకురావాలనే సందేశం ఉంది. భగవంత్ కేసరికి జాతీయ అవార్డు కూడా అందుకుంది.

**ముఖ్యమంత్రి అయిన తర్వాత విజయ్ నుంచి వస్తున్న తొలి సినిమా ఇది. అంచనాలు ఇంకా పెరుగుతాయని భావిస్తున్నారా?**

ఖచ్చితంగా. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ గారి సినిమా థియేటర్లలో విడుదల కావడం ప్రేక్షకులకు, అభిమానులకు ఒక ప్రత్యేకమైన అనుభూతి.


**ఈ సినిమా విజయ్ అభిమానులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుందని భావిస్తున్నారు?**

ఈ సినిమా విజయ్ గారి అభిమానులకు కచ్చితంగా ఒక మెమొరబుల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 7,000 నుంచి 8,000 స్క్రీన్లో సినిమాను విడుదల చేస్తున్నాం. విజయ్ సినీ ప్రయాణానికి ఓ ట్రిబ్యూట్‌లా ఉండేలా ప్లాన్ చేశాం.

# 'హేయ్'. ఆగస్టు 14న వరల్డ్‌వైడ్ రిలీజ్



లేడీ సూపర్ స్టార్ నయనతార, యువ హీరో కవిన్ తొలిసారి జంటగా నటిస్తున్న ఖిహేయ్ఖి విడుదల తేదీని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. ప్రత్యేక అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేస్తూ ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.నూతన దర్శకుడు విష్ణు ఎడ్విన్ దర్శకత్వం వహిస్తున్నఈ చిత్రంలో కె. భాగ్యరాజ్, ప్రభు, రాధిక శరత్‌కుమార్, వీటీవీ గణేష్, సత్యన్, ఆదిత్య కదిర్, ఖురేషి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జెన్ మార్టిన్ సంగీతం సమకూరుస్తున్నారు. ఫిలోమిన్ రాజ్ ఎడిటర్‌గా, ఎస్. కన్నన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.జీ స్టూడియోస్, ది రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నయనతార, విగ్నేష్ శివన్, ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మిస్తున్నారు. వినోద్ సి.జె, కె.ఎస్. మయిల్ వాగనన్ సహ నిర్మాతలుగా, వి.కె. కుబేంద్రన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.దర్శకుడు విష్ణు మాట్లాడుతూ.. "హేయ్ టైటిల్‌కు తగ్గట్టుగానే ఇది చాలా సింపుల్, హార్ట్‌వార్మింగ్, ఫీల్‌గుడ్ సినిమా. ప్రతి కుటుంబం కలిసి చూసి ఎంజాయ్ చేసేలా రెండున్నర గంటల పూర్తి వినోదాన్ని అందించే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం.



# ఇక కామన్‌వెల్త్ గేమ్స్ సంబరం




**రేపు గ్లాస్గోలో ప్రారంభం *10 క్రీడాంశాల్లో పోటీలు *75 దేశాల నుంచి 3వేలకు పైగా అథ్లెట్లు**

**125 మంది భారీ బృందంతో భారత్ *పతకాలపై గురిపెట్టిన నీరజ్ చోప్రా, మీరాబాయి, లవ్లీనా**

నిన్నా మొన్నటి వరకు సాకర్ ఫీవర్‌తో ఊగిపోయిన క్రీడాభిమానులను అలరించేందుకు మరో మెగా టోర్నీ దూసుకు వచ్చిం ది. ఈసారి గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల మెగా క్రీడా సంబరం మరో 24 గంటల్లో ప్రారంభం కానున్నాయి. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో అగస్టు 2 వరకు జరిగే ఈ పోటీల్లో 74 దేశాల నుంచి మూడు వేలకు పైగా అథెట్లు బరిలోకి దిగుతున్నారు. 10 క్రీడాంశాలు, మూడు పారా స్పోర్ట్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి, 125 మంది అథెట్ల భారీ బృందంతో భారత్ బరిలోకి దిగుతోంది. అహ్మదాబాద్ వేదికగా 2030లో కామన్‌వెల్త్ క్రీడలకు అతిథ్యమివ్వబోతున్న భారత్... గ్లాస్గోలో సత్తా చాటాలని చూస్తోంది.

**గ్లాస్గో(స్కాట్లాండ్):** మరో క్రీడా సంబరం ముందుకు వచ్చేస్తోంది. 13 క్రీడాంశాలు, 74 దేశాలు, మూడు వేలకు పైగా అథెట్లతో 11రోజుల పాటు గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలు అలరించబోతున్నాయి. ఒలింపిక్స్ తర్వాత అంతటి ఘనచరిత్ర ఉన్న కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించడంపై అథెట్లు దృష్టి సారించారు.

### భారీగా తగ్గిన క్రీడాంశాలు

ఈసారి కామన్‌వెల్త్ క్రీడాంశాలను పదికి కుదించారు. దీనికి మరో మూడు పారా క్రీడాంశాలను చేర్చారు. అథ్లెటిక్స్, బాక్సింగ్, జూడో, వెయిట్ లిఫ్టింగ్, లాన్ బౌల్స్, స్విమ్మింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్,నెట్‌బాల్, ట్రాక్ సైక్లింగ్, బాస్కెట్‌బాల్, పారా స్పోర్ట్స్ అంశాలు ఉన్నాయి. బ్రిటన్ ఆతిథ్యం ఇచ్చిన 2022 బర్మింగ్హామ్ కామన్ వెల్త్ క్రీడల్లో 20 క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. అపుడు ఆస్ట్రేలియా 178పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. మొదట 2026 కామన్‌వెల్త్ క్రీడలకు ఆస్ట్రేలియాలోని విక్టోరియా ఎంపికైనా... ఆ తర్వాత విరమించుకోవడంతో చివరకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గోకు నిర్వాహకులు అతిథ్య హక్కులు ఇచ్చారు.

### భారీ బృందంతో బరిలోకి భారత్

గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ 126 మంది అథెట్ల భారీ బృందంతో బరిలోకి దిగుతున్నది. ఒలింపిక్ మెడలిస్టులు మిరాబాయి చాను(వెయిట్



లిఫ్టింగ్), లవ్లీనా బర్గోహైన్(బాక్సింగ్) భారత ఫ్లాగ్ బేరర్స్‌గా వ్యవహరించనున్నారు. అత్యధికంగా అథ్లెటిక్స్‌లో 32 మంది.. బాక్సింగ్, జూడోలో 14 మంది చొప్పున.. వెయిట్ లిఫ్టింగ్‌లో 12 మంది పోటీపడుతున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో గుర్విందర్ సింగ్, గుల్వీర్ సింగ్, సంతోష్ కుమార్, పారుల్ చౌదరీ, ప్రియాంక గోస్వామిపై భారీ ఆశలు పెట్టుకుంది. పోల్‌వాల్ట్‌లో కుల్దీప్ కుమార్, లాంగ్‌జంప్‌లో లోకేష్ సత్యనాథన్, పూజా సింగ్, షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్, జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా, రోహిత్ యాదవ్, డిస్కస్‌త్రోలో సీమా పూనియా.. గోల్డ్ మెడల్ ఆశలను మోస్తున్నారు. ఇటీవల మెరుగైన ఫలితాలు సాధిస్తున్న బాక్సర్లు, వెయిల్ లిఫ్టర్ల నుంచి, పెద్ద సంఖ్యలో మెడల్స్‌ను ఆశిస్తోంది.

### భారీగా మెడల్స్ నెగ్గడంపై దృష్టి

గత కామన్‌వెల్త్ క్రీడల్లో భారత అథెట్లు అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఏకంగా 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్య పతకాలు నెగ్గారు. మొత్తం 61 మెడల్స్‌తో భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు సొంతగడ్డపై జరిగిన 2010 న్యూఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించింది.ఆ క్రీడల్లో మొత్తం 101 మెడల్స్‌తో ఆస్ట్రేలియా తర్వాత రెండో స్థానంలో భారత్ నిలిచింది. ఇందులో 38 స్వర్ణాలు, 27 రజతాలు, 36 కాంస్య పతకాలు ఉన్నాయి. వచ్చే కామన్ వెల్త్ క్రీడలకు అతిథ్యమిస్తున్న భారత్.. గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై దృష్టి సారించింది. కామన్‌వెల్త్ క్రీడలకు చాలా ముందుగానే భారత అథ్లెట్లకు వివిధ దేశాల్లో ప్రపంచ స్థాయి శిక్షణను అందించింది. భారీగా మెడల్స్ కొల్లగొట్టడంపై ఫోకస్ పెట్టింది.



## హాకీ ప్రపంచకప్‌కు భారత్

**న్యూఢిల్లీ, జులై 21:** పురుషుల హాకీ ప్రపంచ కప్ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నమెంట్ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనుంది. ఈ టోర్నీకి గాను 20 మంది సభ్యులతో కూడిన భారత్ జట్టును ఐహెచ్‌ఎఫ్ ప్రకటించింది. డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ప్రొ హాకీ లీగ్‌లో లీగ్‌లో పాల్గొన్న నలుగురు ఆటగాళ్లకు జట్టులో చోటు దక్కలేదు. డిఫెండర్ అమన్‌దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్ కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్ థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీ చోటు కోల్పోయారు. ప్రపంచ కప్‌లో పూల్-డిలో ఉన్న భారత్... ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది.ఈ టోర్నీలో భారత్ ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. 1971లో కాంస్యం, 1973లో రజతం సాధించింది.

## జింబాబ్వేతో సిరీస్‌కు టీమిండియా సై

హరారే, జులై 21: వరుసగా రెండు టీ20 సిరీస్‌లు కోల్పోయిన టీమిండియా... మరో సిరీస్‌కు సిద్ధమైంది. జింబాబ్వేపై మూడు టీ20 సిరీస్ గెలుపొంది పరాజయాలకు ముగింపు పలకడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా భారత జట్టు హరారేకు చేరుకుంది. భారత్ జింబాబ్వే మధ్య తొలి టి20 మ్యాచ్ గురువారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనుంది. వరుసగా మూడు సిరీస్‌లను కోల్పోయి జింబాబ్వే పర్యటనకు వెళ్లిన టీమిండియా అక్కడ ఎలా రాణిస్తుందోనని అందరూఆత్రుతగా ఎదరు చూస్తున్నారు. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది.అరంగేట్ర సిరీస్‌లో విఫలమైన వైభవ్‌కు ఈ జింబాబ్వే టూర్ అద్భుత అవకాశం.

సంజూ శాంసన్‌కు విశ్రాంతి ఇవ్వడంతో భారత ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మతో కలిసి వైభవ్ ఆరంభించనున్నాడు. ఈ సిరీస్‌లో వైభవ్ తనను తాను నిరూపించుకుంటే భారత టీ20 జట్టులో అతడి స్థానం పదిలంగా ఉంటుంది. అయితే జింబాబ్వే గడ్డపై సూర్యవంశీ అద్భుతమైన ట్రాక్



రికార్డు ఉంది.

### వైభవ్ చెలరేగడం ఖాయం!

ఈ ఏడాది ఆరంభంలో జింబాబ్వే వేదికగా జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో వైభవ్ అదరగొట్టాడు. ముఖ్యంగా ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై అతడు విధ్వంసం సృష్టించాడు. కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు చేశాడు.ఇది యూత్ వన్డే చరిత్రలోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిచ్చర పిడుగు జింబాబ్వేలో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడి 169.49 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 439 పరుగులు సాధించాడు. ఇప్పుడు భారత సీనియర్ జట్టు తరపున కూడా అదే జోరును కనబరుస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కాగా జింబాబ్వే పర్యటనలో భారత జట్టు ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరించనున్నాడు. వరుస సిరీస్‌లతో బిజీగా ఉండడంతో రెగ్యులర్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది.

చేయనున్నారు. ఇంకా ప్రత్యక్ష ప్రసారం ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.

### భారత జట్టు

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, వైభవ్ సూర్యవంశి, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్‌శర్మ, మయాంక్.



**తొలి రౌండ్‌లోనే ప్రణయ్, దేవిక సిహాగ్ ఔట్**

## చైనా ఓపెన్ టైటిల్‌పై సింధు గురి

**బీజింగ్, జులై 21:** చైనా మాస్టర్స్ తొలి రోజునే భారత్‌కు నిరాశాజనక ఆరంభం లభించింది. భారత షట్లర్లు దేవిక సిహాగ్, హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమితో నిష్క్రమించారు.దేవిక సిహాగ్ మూడు గేమ్‌ల పోరాటంలో ఓడిపోగా, హెచ్‌ఎస్ ప్రణయ్ వరుస గేమ్లలో ఓడి ఇంటిదారి పట్టారు.థాయిలాండ్ ఓపెన్ సూపర్ 300 విజేత అయిన దేవిక, తొలి గేమ్‌ను కోల్పోయినప్పటికీ పుంజుకుని పోరాడింది. అయితే ఆ జోరును కొనసాగించలేక, మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్, థాయిలాండ్‌కు చెందిన బుసానన్ ఒంగ్‌బామ్‌రుంగ్‌ఫాన్ చేతిలో 19-21, 21-19, 13-21 తేడాతో ఓడింది. 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత ప్రణయ్ కూడా పురుషుల విభాగం తొలి రౌండ్‌లో మలేషియాకు చెందిన లియోంగ్ జున్ హావ్ చేతిలో 10-21, 14-21 తేడాతో ఓటమి పాలయ్యారు. ఇటీవలే జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన పివి సింధు.. చైనా ఓపెన్‌పై గురిపెట్టఇంది. నేడు తొలి రౌండ్‌లో తోటి భారత క్రీడాకారిణి ఉన్నతి హుడాతో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ఆశలు పెట్టుకున్న లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి కూడా బరిలోకి దిగనున్నారు.

**11 రీసెర్చ్ అనలిస్టుల రిజిస్ట్రేషన్లు**

## రద్దు చేసిన సెబీ




**ముంబయి,జులై 21:**భారత మూలధన మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రీసెర్చ్ అనలిస్టులుగా నమోదైన 11సంస్థలు,వ్యక్తుల రిజిస్ట్రేషన్లను రద్దు చేసింది. తప్పనిసరిగా ప్రతి ఐదేళ్లకు చెల్లించాల్సిన రిన్యూవల్ ఫీజును చెల్లించకపోవడంతో రద్దుచేసినట్లు సెబీ వెల్లడించింది. చెల్లుబాటు గడువు ముగిసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను దుర్వినియోగం చేయకుండా నిరోధించడం, అలాగే చురుకుగా పనిచేస్తున్న నమోదిత సంస్థలే సెక్యూరిటీస్ మార్కెట్లో కొనసాగేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు సెబీ పేర్కొంది.

మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో,ప్రతి ఐదేళ్లకు చెల్లించాల్సిన రిన్యూవల్ ఫీజు చెల్లించకపోవడంతో ఆయా రీసెర్చ్ అనలిస్టుల రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కోల్పోయాయని తెలిపింది.ఏడుగురు వ్యక్తిగత రీసెర్చ్ అనలిస్టులు ఉన్నారు.సెబీ వివరాల ప్రకారం, కొందరు 2020నుంచే రిన్యూవల్ ఫీజులు చెల్లించకుండా బకాయిలు ఉంచారు. దీనిపై విచారణలు ప్రారంభించిన సెబీ, రిజిస్ట్రేషన్లను ఎందుకు సస్పెండ్ లేదా రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో ముగ్గురు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. మిగిలిన 8మంది తమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయవచ్చని సెబీకి తెలియజేశారు.తప్పనిసరి రిన్యూవల్ ఫీజులు చెల్లించకపోవడంతో వారి రిజిస్ట్రేషన్లు ఇప్పటికే చెల్లుబాటు కోల్పోయాయని అందువల్ల వాటిని అధికారికంగా రద్దు చేసినట్లు సెబీ స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ రద్దు అయినంత మాత్రాన వారు రీసెర్చ్ అనలిస్టులుగా నమోదై ఉన్న సమయంలో చేసిన చర్యలు లేదా నిర్లక్ష్యాల్లకు సంబంధించిన బాధ్యతలు తొలగిపోవని సెబీ పేర్కొంది. సంస్థలు, వ్యక్తులు తమ రికార్డులను భద్రపరచడం, పెండింగ్‌లో ఉన్న ఇన్వెస్టర్ ఫిర్యాదులను పరిష్కరించడం, తమపై ఉన్న అన్ని బాధ్యతలను కొనసాగించడం తప్పనిసరి అని ఆదేశించింది.

## రెండో రోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలే

**ముంబయి,జులై 21:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా అమ్మకాలు కొనసాగించడం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌షేర్లలో బలహీనత కారణంగా ప్రధానసూచీలు ఒత్తిడికి గురయ్యాయి.మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల సమీపంలో కొనసాగుతోంది.దీనివల్ల ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు కంపెనీల లాభాల మార్జిన్లపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.అయితే ప్రధాన సూచీలు క్షీణించినప్పటికీ, కంపెనీల త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలతో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. రంగాల వారీగా ఆటో, మెటల్ షేర్లు లాభపడగా, పీఎస్‌యూ బ్యాంకులు, ఐటీ, ఎనర్జీ రంగాల షేర్లు నష్టాల్లో ముగిశాయి.

బీఎస్‌ఈ సెన్సెక్స్ 238.41 పాయింట్లు పడిపోయి 77,470.11 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 50.80 పాయింట్లు కోల్పోయి 24,187.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పతనానికి ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.07, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.48, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.40 షేర్లక్షీణత కారణమయ్యాయి. మరోవైపు, బీఎస్‌ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.19 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో మొత్తం




2,188 షేర్లు లాభపడగా, 2,021 షేర్లు నష్టపోయాయి. 199 షేర్లు మార్పులేకుండా ముగిశాయి.

భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 0.15 శాతం పెరిగి 6.782శాతానికి చేరుకుంది.డాలరుతో రూపాయి విలువలు 96.25 వద్ద ట్రేడైంది.గత ముగింపు 96.36.ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5,2026డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 1.01శాతం పెరిగి 1,42,822కు చేరాయి.సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 53 సెంట్లు (0.59 ) పెరిగి 89.75 డాలర్ల వద్ద ట్రేడైంది.కొత్తగా లిస్టైన కంపెనీలుఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ షేరు బీఎస్‌ఈలో రూ.609.90 వద్ద ముగిసి, ఇష్యూ ధర రూ.574పై 6.25 శాతం ప్రీమియం నమోదు చేసింది.

ఆల్విన్ టెక్స్‌వరల్డ్ షేరు రూ.99.75 వద్ద ముగిసి, ఇష్యూ ధర రూ.105తో పోలిస్తే 5శాతం డిస్కౌంట్లో లిస్టైంది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.07బజాజ్ ఆటో 0.92టీవీఎస్ మోటార్ కంపెనీ 5.67 ఎస్‌ఎంఎల్ మహీంద్రా2.62 కరూర్ వైశ్యా బ్యాంక్ 13.11. కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్3.43 వన్97 కమ్యూనికేషన్స్ (పేటీఎం)3.86 బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్20 కిర్లోస్కర్ న్యూమాటిక్ కంపెనీ6.12 శాతంచొప్పున ట్రేడ్ అయ్యాయి.కాలిబర్ మైనింగ్ అండ్ లాజిస్టిక్స్ ఐపీఓకు ఇన్వెస్టర్లనుంచి మంచి స్పందన లభించింది. మంగళవారం సాయంత్రం 4:27 గంటల వరకు ఎన్‌ఎస్‌ఈ గణాంకాల ప్రకారం, ఆఫర్ చేసిన 78.35లక్షల షేర్లకు గాను 114.56 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 146.20 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.ఈ ఐపీఓ జూలై 17న ప్రారంభమై జూలై 21న ముగిసింది. ఒక్కో షేరు ధరను రూ.402 నుంచి రూ.424 మధ్య నిర్ణయించారు.

## పీఎల్‌ఐ పథకంతో రూ.2.40 లక్షల కోట్ల పెట్టుబడులు

**రూ.15.2 లక్షల కోట్లకు చేరిన ఎగుమతులు**



**న్యూఢిల్లీ,జులై 21:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం పీఎల్‌ఐ దేశీయ తయారీ రంగానికి భారీ మద్దతిస్తోంది. ఈ పథకాల కింద 14 రంగాల్లో మొత్తం రూ.2.40లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, ఎగుమతులు రూ.15.2లక్షల కోట్లకు చేరుకున్నాయని పరిశ్రమలు, అంతర్గతవాణిజ్య ప్రోత్సాహక విభాగం వెల్లడించింది. పీఎల్‌ఐ పథకాల కింద ఎగుమతులు 4లక్షల కోట్ల నుంచి రూ.15.2లక్షల కోట్లకు పెరిగాయి. దేశ తయారీ రంగం, ఎగుమతి సామర్థ్యం వేగంగా విస్తరిస్తోందనడానికి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది.14 రంగాలకు వర్తించే పీఎల్‌ఐ పథకాలలో సోలార్ ఫోటోవోల్టాయిక్ మాడ్యూళ్ల రంగం అత్యధికంగా రూ.64,873 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది.

ఫార్మాస్యూటికల్ రంగం రూ.45,158 కోట్ల పెట్టుబడులతో రెండో స్థానంలో నిలవగా, ఆటోమొబైల్ మరియు ఆటోకాంపోనెంట్ల రంగం 44,326 కోట్ల పెట్టుబడులను సాధించింది. దేశీయ మొబైల్ ఫోన్ తయారీని పెంపొందించడంలో కూడా పీఎల్‌ఐ పథకం విశేష ఫలితాలను సాధించిందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో విక్రయిస్తున్న మొబైల్ ఫోన్లలో 99.2 శాతం దేశీయంగానే తయారవుతున్నాయి. పీఎల్‌ఐ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత మొబైల్ ఫోన్ దిగుమతులు 77 శాతం తగ్గడం, దేశ తయారీ సామర్థ్యం పెరిగిందనడానికి నిదర్శనమని పేర్కొంది. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తోందని తెలిపింది. కేబినెట్ కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ పథకాల పురోగతిని పర్యవేక్షిస్తుండగా,అవసరాలకు అనుగుణంగా సంబంధిత మంత్రిత్వశాఖలు మార్గదర్శకాలు,అర్హత ప్రమాణాల్లో మార్పులు చేసి పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచుతున్నాయని వెల్లడించింది.దేశీయ తయారీని బలోపేతం చేయడం, ఎగుమతులను పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రారంభించిన పీఎల్‌ఐ పథకాలు ప్రస్తుతం 14 కీలక రంగాలను కవర్ చేస్తున్నాయి.

## రూ.30వేల వరకూ మారుతి సుజుకి కార్ల ధరల పెంపు

**ముంబయి,జులై 21:** దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా మరోసారి తన ప్రయాణికుల వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరుగుతున్న ముడి పదార్థాల ధరలు, తయారీ వ్యయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఆగస్టు నెల నుంచి అన్ని మోడళ్లపై గరిష్ఠంగా రూ.30వేల వరకు ధరలు పెంచనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు మంగళవారం తెలియజేసింది. ఉత్పత్తి వ్యయాలు నిరంతరం పెరుగుతున్నందున వాటి ప్రభావాన్ని కొంత మేర తగ్గించుకునేందుకు ఈ ధరల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

గత కొన్ని నెలలుగా ఖర్చులను తగ్గించే చర్యలు, ఉత్పాదకత పెంపు, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరిచే చర్యల ద్వారా వ్యయభారాన్ని తట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో మొత్తం భారం కంపెనీ భరించడం సాధ్యం కావడం లేదని తెలిపింది. ఇది కేవలం రెండు నెలల వ్యవధిలోనే కంపెనీ చేపడుతున్న రెండో ధరల పెంపు కావడం గమనార్హం. అంతకుముందునెలలో కూడా మారుతి సుజుకి వివిధ మోడళ్ల ధంలను గరిష్ఠంగా రూ.30వేలవరకుపెంచింది.మా పోర్ట్‌ఫోలియోలోని అన్ని మోడళ్ల ధరలను గరిష్ఠంగా రూ.30వేల వరకు పెంచాలని నిర్ణయించామని కంపెనీ తెలిపింది. ముడి పదార్థాల ధరలు, తయారీ ఖర్చులు, సరఫరా గొలుసు (సప్లై చైన్) వ్యయాలు, ద్రవ్యోల్బణ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో వాహన తయారీ సంస్థలు వరుసగా ధరలను సవరించాల్సిన




పరిస్థితి ఏర్పడిందని మారుతి సుజుకి తెలిపింది.

అయినప్పటికీ విని స్టాక్ మార్కెట్లో మారుతి సుజుకి షేర్లకు స్వల్ప మద్దతు లభించింది. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి కంపెనీ షేరు 0.93 శాతం పెరిగి రూ.13,640 వద్ద ముగియగా, అదే సమయంలో బెంచ్‌మార్క్ నిఫ్టీ50 సూచీ 0.21 శాతం నష్టంతో ముగిసింది.




## బంధన్ బ్యాంక్ నికరలాభం రూ.502 కోట్లు

**ముంబయి,జులై 21:** ప్రైవేట్ రంగంలోని బంధన్ బ్యాంక్ తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది.రుణ నష్టాల కోసం కేటాయింపులు (ప్రొవిజనింగ్) గణనీయంగా తగ్గడంతో బ్యాంకు నికరలాభం ఏడాది ప్రాతిపదికన దాదాపు 35 శాతం పెరిగింది. బ్యాంకు నికర లాభం రూ.372 కోట్ల నుంచి రూ.502 కోట్లకు పెరిగింది. ఇది గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 34.9 శాతం వృద్ధిని సూచిస్తోంది.బ్యాంకు ప్రధాన ఆదాయ సూచిక అయిన నికర వడ్డీ ఆదాయం కూడా వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది రూ.2,758 కోట్లుగా ఉన్న ఈ ఆదాయం, ప్రస్తుత త్రైమాసికంలో 6 శాతం పెరిగి రూ.2,921 కోట్లకు చేరుకుంది. బ్యాంకు నికర వడ్డీ మార్జిన్ వరుస త్రైమాసిక ప్రాతిపదికన 6.2 శాతం వద్ద స్థిరంగా కొనసాగింది. మారుతున్న వడ్డీ రేట్ల పరిస్థితుల్లోనూ బ్యాంకు రుణాల లాభదాయకత స్థిరంగా ఉన్నట్లు ఇది సూచిస్తోంది.ఆస్తుల నాణ్యత పరంగా కూడా బ్యాంకు మెరుగైన పనితీరును కనబరిచింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి మార్చి త్రైమాసికంలోని 3.27 శాతం నుంచి 3.15 శాతానికి తగ్గింది. అలాగే నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.97 శాతం నుంచి 0.93 శాతానికి తగ్గి రుణాల నాణ్యత మరింత మెరుగుపడినట్లు వెల్లడైంది.




## నెట్ లేకున్నా యుపిఐ చెల్లింపులు: ఎన్‌ఫిసిఐ కొత్త ఫీచర్

**ముంబయి,జులై 21:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మరో విప్లవాత్మక మార్పు వస్తోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లోనూ సులభంగా యూపీఐ లావాదేవీలు జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ఒక కొత్త ఫీచర్‌ను తెస్తోంది. యూజర్ ఫోన్, వ్యాపారి వద్ద ఉండే పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్ రెండూ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ, 2వేల వరకు చెల్లింపులు చేయవచ్చు.ఈ సదుపాయాన్ని నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆధారంగా ట్యాప్‌టుపే విధానంలో తీసుకురానున్నారు. వినియోగదారులు ముందుగా తమఫోన్‌లో ఇంటర్నెట్ ఉన్నప్పుడు ఆన్‌డివైస్ యూపీఐ లైట్ వ్యాలెట్‌లోకి డబ్బును లోడ్ చేసుకోవాలి. ఇంటర్నెట్ సిగ్నల్ లేని ప్రదేశాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, ఎన్‌ఎఫ్‌సీ ఆధారిత స్మార్ట్ ఫోన్‌ను వ్యాపారి వద్ద ఉన్న సర్టిఫైడ్ ఆఫ్‌లైన్ పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేస్తే చాలు. ఎలాంటి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే లావాదేవీపూర్తవుతుంది.ఈ లావాదేవీ వివరాలను పీఓఎస్ టెర్మినల్ తనలో స్టోర్ చేసుకొని, తిరిగి ఇంటర్నెట్ కనెక్టివిటీ వచ్చిన వెంటనే సెటిల్‌మెంట్ కోసం పంపుతుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.